
ఆంధ్ర ప్రదేశ్

జనవరి 1972

50 పైసలు

దేశరక్షణ అనుబంధంతో సహా





ఆంధ్రప్రదేశ్

జనవరి, 1972
పుష్యం-మాఘం, 1893

సంపుటి : 16   సంచిక : 3

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు

సంపాదకులు : కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ముఖ చిత్రం :
సంక్రాంతి ముగ్గులు

రెండవ అట్ట :
హైదరాబాదులోని నెహ్రూ జూలాజికల్ పార్కులోని
ఖడ్గమృగం పద్మిని, ఇటీవలే పుట్టిన దాని పిల్ల
ఫొటో: శ్రీధర్ ఫొటో సర్వీస్

చివరి అట్ట :
హైదరాబాదు పబ్లిక్ గార్డెన్స్

వెల : 50 పైసలు
సాలు చందా : 6 రూపాయలు
రిజిష్టర్డ్ నెంబరు : 133

సంచికలో

దేశరక్షణ అనుబంధం

సంక్రాంతి సంచిక

చరిత్రాత్మక సంఘటనల సంవత్సరం


1971

1971 సంవత్సరం మన దేశానికి అత్యంత ప్రధానమైన సంవత్సరంగా పరిణమించింది. ఈ యేడు మనం నూతన చరిత్రను సృష్టించడమే కాదు, భారత ఉపఖండంలోని భౌగోళిక సరిహద్దులే మారిపోయినవి. ఈ సంవత్సరం ప్రారంభంలో జరిగిన మధ్యంతర ఎన్నికలలో ఘన విజయం సాధించిన మన ప్రధాన మంత్రి, సంవత్సరాంతంలో—మన జాతి ఏకైక నాయకురాలుగానే కాక, ప్రపంచ స్థాయి రాజనీతిజ్ఞురాలుగా కూడా పేరు ప్రతిష్ఠలు పొందారు. ఒక జాతి ప్రజల స్వాతంత్ర్యం అణచి వేయబడి, వారిని మానవ హక్కులకు కూడా దూరం చేసిన నీతి విహీనమైన ఆక్రమణ సైన్యాల బారినుండి వారిని విముక్తం చేయడంద్వారా భారత దేశం ప్రపంచానికి తన సామర్థ్యాన్ని నిర్ద్వంద్వంగా ప్రదర్శించి చూపింది. పశ్చిమ పాకిస్తాన్ మిలిటరీ పాలకులు ప్రారంభించిన దురాక్రమణను ఆమె నాయకత్వంలో త్రిప్పికొట్టడమే కాకుండా, ఆ దురాక్రమణదారులు చేసిన కిరాతక చర్యల ధాటికి తట్టుకోలేక స్వదేశం వదలి పెట్టవలసి వచ్చిన కోటి మంది శరణార్థుల తిరుగు ప్రయాణానికి అవకాశం కల్పించే విధంగా బంగ్లాదేశ్‌ను విముక్తంచేయాలి అనే మన లక్ష్యం సిద్ధించిన తర్వాత కాల్పుల విరమణకు ఏక పక్ష నిర్ణయం ప్రకటించడం కూడా జరిగింది. భారతదేశపు ఉద్దేశాలను గురించి అనుమానపడిన కొన్ని పెద్ద దేశాల అనుమానాలు నిరాధారములనీ. భారతదేశానికి పాకిస్తాన్ భూభాగం మీదగానీ, బంగ్లాదేశ్ భూభాగంమీద గానీ ఏ విధమైన దురాక్రమణ ఉద్దేశాలు లేవనీ రుజువయింది. స్వాతంత్ర్య యోధుల త్యాగాల పునాదుల మీద నిర్మించబడిన నూతన బంగ్లాదేశ్ అవతరణ, స్వాతంత్ర్యోద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన కొత్త అధ్యాయం. ప్రపంచంలో ఎనిమిదవ స్థానాన్ని అలంకరిస్తూ, మత ప్రసక్తి లేని సోషలిస్టు, ప్రజాస్వామ్య విధానాలకు అంకితమైన ఒక కొత్త రాజ్యం అవతరించడం ప్రపంచ రాజకీయాలలో అతి ప్రధానమైన సంఘటన. దీనివల్ల భారత ఉపఖండపు భౌగోళికపటం మారడమే కాకుండా, ఆసియా ఖండంలోనూ, నిజానికి ప్రపంచంలోనే వివిధ దేశాల బలాబలాలలో గణనీయమైన మార్పు వచ్చింది.

ఇటీవల జరిగిన భారత–పాకిస్తాన్ యుద్ధం, నూతన భారతదేశ అవతరణకూ, ప్రపంచ దేశాల పరిస్థితులలో మార్పుకూ కారణమైనందున చరిత్రలో ప్రసిద్ధమై చిరకాలం నిలిచి వుంటుంది. పరస్పర విరుద్ధ విశ్వాసాలతో కూడిన అమెరికా, చైనా దేశాలు రెండూ పాకిస్తాన్ వైపు చేరినవి. కమ్యూనిస్టు రిపబ్లిక్‌గా రూపొందిన తర్వాత చైనాకు ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం కల్పించడం కోసం భారతదేశం అందరికంటే ముందుండి కృషి చేసింది. గత రెండు దశాబ్దాలుగా సభ్యత్వం నిరాకరించబడి, మొట్ట మొదటిసారిగా చైనాకు ప్రపంచ సంస్థలో యీ యేడే సభ్యత్వం లభించిన కారణంగా కూడా 1971 సంవత్సరం ప్రాధాన్యం వహిస్తున్నది. చైనా విషయంలో యథార్థాన్ని గుర్తించిన ఐక్యరాజ్య సమితి, అదే విధంగా బంగ్లాదేశ్ విషయంలో కూడా, వున్న పరిస్థితిని గుర్తించి, బంగ్లాదేశ్‌కు సభ్యత్వం కల్పించి, ప్రపంచంలో న్యాయమైన తన స్థానాన్ని పొందడానికి ఆ దేశానికి అవకాశం యివ్వాలి.

ఇప్పుడు మనకు శ్రీ పి. వి. నరసింహారావు నాయకత్వాన కొత్త మంత్రి వర్గం ఏర్పడింది. కాబట్టి 1971 మనకొక ప్రధానమైన సంవత్సరం. ప్రధానమంత్రి స్వయంగా శ్రద్ధ తీసుకున్న ఫలితంగా మన రాష్ట్రానికి సమైక్యం, స్థైర్యం ఏర్పడ్డాయి. మన రాష్ట్ర చరిత్రలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తెలుగు మాట్లాడే నాలుగున్నరకోట్ల ప్రజల ఉమ్మడి సొత్తు అనీ ఐక్యతను రక్షించుకోవడం, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించుకోవడం ప్రజల బాధ్యత అనీ మన ముఖ్యమంత్రి వెలిబుచ్చిన అభిప్రాయం నేటి రాష్ట్ర ప్రజావాణికి ప్రతిబింబమని చెప్పవచ్చు.

—పి. వి. ఆర్.



బంగ్లా ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది

—గవర్నరు—

ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయి దేశాయి డిసెంబరు 18 వ తేదీ రాత్రి హైదరాబాదు ఆకాశవాణి కేంద్రం నుండి ప్రసంగిస్తూ యిలా అన్నారు.

" మనపై రుద్దబడిన యుద్ధం ముగిసినందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. బంగ్లాదేశ ప్రజల చిరకాల వాంఛ తీరి, సోదరులమని చెప్పుకునే పశ్చిమ ప్రాంతం వారి చేతుల్లో అనేక బాధలను అనుభవించిన తర్వాత వారు ఒక స్వతంత్ర జాతిగా రూపొందడం ఎంతో తృప్తినిస్తోంది. భారత దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత ఏర్పడిన క్లిష్టతరమైన పరిస్థితుల్లో ఎంతో నేర్పుతో వ్యవహరించిన మన ప్రధానమంత్రిని మనం అభినందించకుండా ఉండలేము. అణచబడిన ప్రజలను విముక్తులను చేయడంలోనూ, యుద్ధోన్మాది అయిన శత్రువునుంచి మన పవిత్ర సీమలను పరిరక్షించడంలోనూ, మన రక్షణదళాలకు చెందిన మూడు విభాగాల వారికి దేశం కృతజ్ఞతలు చెప్పుకోవలసి ఉంది. యుద్ధం అంతరించినందుకు దయామయుడైన భగవంతునికి మనం కృతజ్ఞులం. కాని, మన సమస్యలు అంతం కాలేదు. యుద్ధానంతర పరిణామాలుగా తలెత్తే శక్తులను మనం ఎదుర్కోవాలి.

సంపూర్ణమైన జాతి సమైక్యతను, సుహృద్భావాన్ని రాష్ట్రంలో మనం సాధించి, చిరంతనమైన శాంతిని పరిరక్షించుకోవడంలోనే మన కర్తవ్యం ఉంది. మన మాతృ భూమిని రక్షించడంలో వీరమరణం పొందిన, క్షతగాత్రులైన సైనికుల కుటుంబాలను ఆదుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకొని జాతీయ రక్షణ నిధిని సమకూర్చడంలో మనం మనశక్తి సామర్థ్యాల్ని ప్రదర్శించాలి. సరుకుల్ని దాచడంద్వారా, అధిక ధరలకు అమ్మడం ద్వారా ధరల పెరుగుదలకు తోడ్పడం ద్వారా వ్యాపారస్థులు వర్తక రంగాన్ని పీడించరాదు. వాడకందారులు కూడా సరుకులు దాచకూడదు. ఏవిధంగానూ లాభార్జనపరులతో సహకరించకూడదు. ప్రజల సచేతనమైన సహకారంతో పుకార్లు లేవతీసేవారిని, సంఘ విద్రోహ శక్తులను పట్టి యివ్వాలి. ప్రతి వారూ చేయి చేయి కలిపి శ్రమించాలి. వారు కర్షకులైనా, కార్మికులైనా, కార్యాలయ సిబ్బంది అయినా సరే, ఎటువంటి దుబారాను చేయకూడదు. పొదుపును అలవరచుకోవాలి.

దేశంలోని ప్రతివారూ తమ మాతృ భూమి పట్ల తమకు కల కర్తవ్యాన్ని గుర్తెరిగి మసలుకోవాలి. కొలది కాలము అయినా, యుద్ధకారణంగా ఏర్పడిన మచ్చలను మాన్పడంలో మనమంతా మన ప్రధానమంత్రికి శక్తివంచన లేకుండా సహకారాన్నివ్వాలి."

పాకిస్తాన్ పాలకుల విధ్వంసకాండకు ముందు

బంగారు బంగ్లాదేశ్

గణ ప్రజాతంత్ర బంగ్లాదేశ్ విస్తీర్ణం 1,43,000 చదరపు కిలో మీటర్లు, జనాభా ఏడున్నరకోట్లు. దీనికి పశ్చిమాన, ఉత్తరాన పశ్చిమ బెంగాలు రాష్ట్రం, ఉత్తరాన, ఈశాన్య దిశలోనూ అస్సాం రాష్ట్రం, తూర్పున కేంద్ర పాలిత రాష్ట్రమైన త్రిపుర, ఆగ్నేయంగా బర్మా ఎల్లలుగా వున్నాయి.

1961 జనాభా లెక్కల ననుసరించి బంగ్లాదేశ్ జనాభా 5 కోట్ల 8 లక్షల 40 వేలు. వీరిలో మహమ్మదీయులు 80.43 శాతం, షెడ్యూలు తరగతులు సహా హిందువులు 18.45 శాతం, క్రైస్తవులు 0.29 శాతం మంది వున్నారు.

జనసాంద్రత చ. కి. మీటరుకు 355 మంది. 1961 లో రాజధాని ఢాకా. జనాభా 5,57,000.

1971 లో అంటే బంగ్లాదేశం స్వతంత్ర రాజ్యంగా అవతరించక ముందు జనాభా ఏడున్నర కోట్లు అని అంచనా. అంటే ఐక్యరాజ్యసమితిలో యిప్పుడు సభ్యత్వం కలిగివున్న 88 దేశాల జనాభా కంటే బంగ్లాదేశ్ జనాభా ఎక్కువ. ఇందులో సుమారు 1 కోటి మంది ప్రజలు, పాకిస్తాన్ మిలటరీ పాలకుల ఘాతుక చర్యలకు ఓర్చుకోలేక ప్రాణభీతితో భారత దేశంలోకి వలస వచ్చారు.

బంగ్లాదేశ్‌లో వాతావరణ పరిస్థితి భూమధ్యరేఖ ప్రాంత వర్ష పాతం మీద ఆధారపడివుంటుంది. గాలిలో చెమ్మ ఎక్కువ. సంవత్సరంలో ఎనిమిది నెలలపాటు ఉష్ణోగ్రత ఒక మోస్తరు ఎక్కువగా వుంటుంది. మరీ ఎక్కువ వేడీ, మరీ ఎక్కువ చలీ వుండవు. నవంబరు చివరినుండి ఫిబ్రవరి మధ్యవరకు వర్షాకాలం.

బంగ్లాదేశ్‌లో అడవి మృగాలు ఎక్కువగా వుంటాయి. అడవుల్లో వేట అవకాశాలు ఎక్కువగా వున్నాయి. గ్రామ సీమలు అనేక రకాల పక్షులు, జంతువులు మొదలగువాటితో నిండి వుంటాయి.

వ్యవసాయం :

బంగ్లాదేశ్‌లో వ్యవసాయమే ప్రధానవృత్తి. అధిక సంఖ్యాక ప్రజలు వ్యవసాయంమీద జీవిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదులైన ముడి పదార్థాలుకూడా ఇక్కడ లభిస్తాయి. మొత్తం విస్తీర్ణం 353 లక్షల యకరాలలో 224లక్షల యెకరాలు (సుమారు 63 శాతం) సాగు అవుతున్నవి. మిగిలిన భూమిలో మొత్తం విస్తీర్ణంలో 15 శాతం అడవులు. 18 శాతం సాగు యని భూమి 4 శాతం సాగుకు యోగ్యమైన బంజరుభూమి.

పరిశ్రమలు :

1966_67 నాటికి బంగ్లాదేశ్‌లోని పరిశ్రమల్లో 2 లక్షలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. పరిశ్రమల్లో ముఖ్యమైనవి_22 జవుళి మిల్లులు, 7 పంచదార ఫ్యాక్టరీలు, 18 అగ్గి పెట్టెల ఫ్యాక్టరీలు, 7 గాజు పరిశ్రమలు, 178 హోయిజరీ పరిశ్రమలు, ఒక కాగితం మిల్లు, 29 జూట్ మిల్లులు, 28 అల్యూమినం పరిశ్రమలు 1 సిమెంట్ ఫ్యాక్టరీ. ఇవికాక ఒక న్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీ, ఎరువుల ఫ్యాక్టరీ, నౌకా నిర్మాణ శాల _ డాక్ యార్డుకూడా వున్నాయి. 1966_67 లో జనపనార ఫ్యాక్టరీలలో 15 614 మగ్గాలు వున్నాయి. అక్కడ ఉత్పత్తి 4,03,700 టన్నులు దీనిలో 80 శాతం ఎగుమతి అవుతుండేది. అదే సంవత్సరంలో 743 లక్షల గజాల నూలు ఉత్పత్తి అయింది 26,500 టన్నులు న్యూస్ ప్రింట్ కూడా ఉత్పత్తి జరిగింది

నౌకాయానం :

బంగ్లాదేశ్‌లో నౌకాయానానికి వీలైన నదులు, కాల్వలు పుష్కలంగా వున్నాయి. గంగా, బ్రహ్మపుత్ర, మేఘనా నదులు ముఖ్యమైనవి. వీటిలో స్టీమ్ నౌకలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైలు మార్గాలులేని ప్రదేశాలకు రవాణా, రాకపోకలకు నౌకాయాన సౌకర్యాలు పనికివస్తాయి.

రోడ్లు :

రహదార్ల విషయంలో బంగ్లాదేశ్‌లో తగినన్ని సౌకర్యాలు లేవనేచెప్పాలి. అన్ని కాలాలలో ఉపయోగపడే రోడ్లు కేవలం 2 వేల మైళ్ళ పొడవున మాత్రమే వున్నాయి. పాకిస్తాన్ పాలకులు విధ్వంసం చేయకపూర్వం 752 మైళ్ళ పొడవు రైలుమార్గాలుండేవి.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర రక్షణ మండలి

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి వి నరసింహారావు డిసెంబరు 14 న హైదరాబాదులో పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ దేశ రక్షణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యిచ్చే విరాళంగా ఎనిమిది నుంచి పదికోట్ల రూపాయలను సేకరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి అధ్యక్షుడుగా 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర రక్షణ మండలి' ఒకటి ఏర్పాటు చేయబడింది. రాష్ట్రంలో దేశ రక్షణ కృషి కార్యక్రమాలకు యీ మండలి ఆధ్వర్యం వహిస్తుంది. 165 మంది సభ్యులు గల యీ మండలిలో రాష్ట్ర మంత్రులు 25 మంది. శాసనసభ స్పీకరు, శాసనమండలి అధ్యక్షుడు, మొత్తం 21 జిల్లా పరిషత్తుల ఛైర్మనులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పారిశ్రామిక, వర్తక, సాంఘిక సంక్షేమ, తదితర పౌర సంస్థల ప్రతినిధులు వున్నారు. ఇంకా శాసనసభ డిప్యూటీ స్పీకరు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్, నాలుగు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులు, శ్రీయుతులు కాసు బ్రహ్మానందరెడ్డి, ఎం. చెన్నారెడ్డి, కొండాలక్ష్మణ్ బాపూజీ, బెజవాడ గోపాలరెడ్డి, సి. డి. దేశ్‌ముఖ్, దుర్గాబాయి దేశ్‌ముఖ్, వైస్ అడ్మిరల్ కటారి (రిటైర్డ్), సబ్ ఏరియా కమాండరు బ్రిగేడియర్ యం కె. బాలచంద్రన్ గార్లు కూడా సభ్యులుగా వున్నారు.

సాధారణ పరిపాలన (పొలిటికల్) శాఖ ఉపకార్యదర్శి శ్రీ ఎ. వలియప్పన్ యీ మండలికి కార్యదర్శిగాను, ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీ ఎన్. రమేశన్ ఈ మండలికి కోశాధికారిగానూ వ్యవహరిస్తారు.

రక్షణ కార్యకలాపాల్లో భారీ ఎత్తున ప్రజలు పాల్గొనడానికి వీలుగా జిల్లాస్థాయిలో కమిటీలను జిల్లా కలెక్టర్లు నెలకొల్పుతున్నారు.

రక్షణ నిధికి యిచ్చే విరాళాలను జిల్లాలలో కలక్టర్లకుగాని హైదరాబాదులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గాని ముఖ్యమంత్రికి గాని పంపించ వచ్చని ముఖ్యమంత్రి తెలియజేశారు.

ఎన్. జి. ఓలు ఒక రోజు జీతం, గెజిటెడ్ ఉద్యోగులు రెండురోజుల వేతనం విరాళంగా యివ్వగలరన్నారు. కార్మికులు ఆదివారం పనిచేసి, ఆరోజు జీతాన్ని రక్షణ నిధికి యివ్వవచ్చు. ఇప్పటికే అనేక పరిశ్రమల్లోని కార్మికులు యీ పని చేస్తున్నారని ఆయన అన్నారు.

వ్యాపారవర్గాలు, వర్తకులు తమ లాభాలలో 5 శాతం రక్షణనిధికి యివ్వాలనీ, మతాదాయ ధర్మాదాయ సంస్థలు తమ రిజర్వు నిధుల నుంచి 10 శాతం విరాళం యివ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ విరాళాలతో మన రాష్ట్రం రు.10 కోట్లు వసూలుచేయ గలదన్నారు.

రెండు నాట్ విమానాల కొనుగోలుకు కావలసిన ధనాన్ని తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలు సమకూర్చడానికి పూనుకున్నందుకు



ఆయన హర్షం వెలిబుచ్చారు. ఇతర జిల్లాలు కూడా ఇదేపనిచేస్తే రాష్ట్రం 21 నాట్ విమానాలు విరాళమివ్వవచ్చునన్నారు.

తన పర్యటన సందర్భంలో యువకులలో వృద్ధులలో ఎంతో ఉత్సాహం తొణికిసలాడటం గమనించానన్నారు.

పరిశ్రమల మేనేజిమెంట్లు, కార్మికులు ఉత్పత్తిని పెంచాలనీ సమ్మెలు, లాకౌట్‌లకు స్వస్తి చెప్పాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికరంగంలోని శాంతిని ఉత్పత్తిని పెంచడానికి వినియోగించు కోవాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ విధ్యుక్తధర్మాన్ని నిర్వహించ గలరనే విశ్వాసాన్ని ముఖ్యమంత్రి వెల్లడించారు.

ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు డిసెంబరు 20 వ తేదీ జుబిలీహాలులో జరిగిన రాష్ట్ర పౌర రక్షణ మండలి ప్రథమ సమావేశంలో ప్రసంగిస్తూ యుద్ధంలో మరణించిన జవానుల కుటుంబాలకు, క్షతగాత్రులకు హైదరాబాదు జిల్లా వికారాబాదులోని ఓటపల్లి ప్రాజెక్టు క్రింద 100 ఎకరాల మాగాణి భూమి ప్రత్యేకించబడుతుందని ప్రకటించారు.

కాలువల క్రింద నీటి సరఫరా సౌకర్యంగల భూములను జవానులకుటుంబాలకు కేటాయించవలసిందని కలెక్టర్లకు ఉత్తర్వులు

జారీచేయబడినాయి. ఇండో-పాకిస్తాన్ యుద్ధంలో మరణించిన 6 మంది ఆఫీసర్ల కుటుంబాలకు ఇండ్లస్థలాలు కేటాయించబడుతాయి. అంతేగాకుండా వారికి రూ 5,000 లు నగదు కూడా యివ్వబడుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ నుండి యుద్ధానికి వెళ్ళిన వారిలో 6 గురు ఆఫీసర్లు 60 మంది జవానులు మరణించినట్లు తెలుస్తున్నది.

రాష్ట్ర పౌరరక్షణ మండలి కార్యక్రమం ప్రారంభించడానికి ముందు సభ్యులందరూ, మృతవీరుల స్మృతికి చిహ్నంగా ఒక నిమిషం నిశ్శబ్దం పాటించారు

కాల్పుల విరమణ జరిగినప్పటికీ, మనం జాగ్రత్తగా మెలగుతూ దేశ రక్షణ కృషిని కొనసాగిస్తూ వుండాలని ముఖ్యమంత్రి చెప్పారు. బంగ్లాదేశ్ ఒక స్వతంత్ర రాజ్యంగా అవతరించింది. ఇది మనకు పొరుగున ఉన్న మిత్ర దేశం. యుద్ధంలోనే కాకుండా, శాంతి సమయంలో కూడా మనం బంగ్లాదేశ్‌కు అండగా నిలవాలి. బంగ్లాదేశ్ పునర్నిర్మాణానికి మనం తోడ్పడాలి యుద్ధంవల్ల అపారనష్టానికి గురియైన ఆ దేశానికి మనం సాధ్యమైనంత సహాయం చేయడం చాలా అవసరం బంగ్లాదేశ్‌కు మనం ఎంత సహాయం చేయగలమో, ఆ మేరకు మనమైత్రిత్వం బలిష్టమవుతుంది. బంగ్లాదేశ్ పునర్నిర్మాణంకొరకు మన శక్తినంతటినీ ఉపయోగించవలసి వుంటుంది. యుద్ధంలో చిన్నాభిన్నమైనదేశం తన పునర్నిర్మాణాల కొరకు మరొక దేశం నుండి సహాయం అపేక్షించడం కొత్త విషయమేమీ కాదు అని ముఖ్యమంత్రి అన్నారు.

రాష్ట్రంనుండి రక్షణ నిధులు వసూలు చేయడానికి, జవానుల కుటుంబాల సంక్షేమ విషయాలకు, ధరల స్థిరీకరణకు ప్రచారం కొరకు మొత్తం నాలుగు ఉప సంఘాలను నియమించారు.

రక్షణనిధికి విరాళాలు

(స్థలాభావంచేత అన్ని వార్తలు ప్రకటించలేకపోతున్నాం-సం)

రాష్ట్ర ప్రభుత్వ రంగంలోవున్న రిపబ్లిక్ ఫోర్జ్‌కంపనీ కార్మికులు ఒక సెలవు దినంనాడు పనిచేసి, తద్వారా వచ్చే ఆదాయాన్ని జాతీయ రక్షణ నిధికి సమర్పించదలిచారు.

రిపబ్లిక్ ఫోర్జ్ కంపెనీ కార్మికులు చూపిన ఆదర్శవంతమైన మార్గాన్ని ఇతర పరిశ్రమల కార్మికులుకూడా అనుసరించగలరని పరిశ్రమల మంత్రి శ్రీ చొక్కారావు ఆశాభావం వెల్లడించారు

గత ఆరుమాసాలలో ఇక్కడ ఉత్పత్తి హెచ్చిందని తెలుసుకొని ఆయన హర్షం వెలిబుచ్చారు. మేనేజింగు డైరెక్టరు శ్రీ ఎం. ఆనందరాం మంత్రికి స్వాగతమిచ్చారు.

సమాచార, పౌరసంబంధశాఖా మంత్రి శ్రీ వాసుదేవరావు డిసెంబరు 9 న వరంగల్లును దర్శించినప్పుడు ఆయనకు అక్కడి సర్దార్‌వల్లభాయి పటేల్ సహపతి సంఘం కార్యదర్శి శ్రీ ఎ. రాజలింగం జాతీయ రక్షణ నిధికిగాను విరాళంగా రూ.516 ల చెక్కును అందజేశారు.

విజయవాడలో డిసెంబరు 11 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారుల సంఘం ప్రారంభోత్సవం జరిగినపుడు వారు అప్పటికప్పుడే సేకరించిన రూ. 119 లు జాతీ రక్షణ నిధికిగాను సమాచార. పౌర సంబంధశాఖా మంత్రి శ్రీ ఎ. వాసుదేవరావుగారికి అందజేశారు.

జిల్లా పరిషత్తులో పనిజేసే 2,500ల ఉద్యోగులు ఒక రోజు జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా యివ్వడానికి నిర్ణయం తీసుకొన్నారని పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్తుకార్యదర్శి అయిన శ్రీ ఎం. నారాయణరావు చెప్పారు. జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ అల్లూరి బాపినీడుగారు ఉద్బోధించినట్లుగా, ఉద్యోగులు తమ పనులను నిర్విరామంగా చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

పశ్చిమ గోదావరి జిల్లా సమాచార, పౌరసంబంధ శాఖ అధికారులు. ఉద్యోగులు ఒకరోజు జీతాన్ని జాతీయ రక్షణ నిధికిగాను విరాళంగా యివ్వడానికి నిర్ణయం చేశారు.

మహబూబునగర్ మాడల్ బేసిక్ పాఠశాల ఉపాధ్యాయులు రూ. 431 లు, విద్యార్థులు రూ. 275లు జాతీయ రక్షణ నిధికిగాను విరాళంగా సేకరించారు,

మహబూబునగర్ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల విద్యార్థులు రూ. 701 ల చెక్కును జాతీయ రక్షణ నిధికిగాను జిల్లా కలెక్టరుకు అందజేశారు. ఈ కళాశాలలో పనిచేసే ఉద్యోగులు ఒక రోజు జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా యివ్వడానికి నిర్ణయించారు.

చిత్తూరు జిల్లా కార్మిక శాఖ అధికారి శ్రీ ఎన్. రాయల్ ప్రసంగిస్తూ తమ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఒక రోజు జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా యివ్వడానికి నిర్ణయం తీసుకొన్నారని చెప్పారు,

సాలూరు తాలుకా కార్యాలయం ఉద్యోగులు ఒక రోజు జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా యివ్వడానికి నిర్ణయించారు.

గాంధీ ఆసుపత్రిలో సివిల్ సర్జనులు, అసిస్టెంటు సర్జనులు హౌస్‌సర్జనులు, ఇతర డాక్టర్ల సమావేశం జరిగింది ఆసుపత్రి సూపరింటెండెంటు డా. ఎన్. ఆర్. వి. స్వామి అధ్యక్షత వహించారు. జాతీయ రక్షణ నిధికిగాను ఒక రోజు జీతాన్ని విరాళంగా యివ్వడానికి డాక్టర్లందరూ నిర్ణయం చేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి దినోత్సవం సందర్భంగా వసూలు చేసిన రూ. 2,500 లు జాతీయ రక్షణ నిధికి విరాళంగా యివ్వడానికి కూడా నిర్ణయం చేయబడింది.

దేశ రక్షణకై ముస్లింల ప్రతిజ్ఞ:

ఏలూరులోని ముస్లింలు డిసెంబరు 0 వ తేదీన ఒక సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వానికి తమ హృదయపూర్వక సహాయం అందజేయగలమని ప్రతిజ్ఞచేశారు.

స్థానిక స్త్రీ సంక్షేమ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు దాని అధ్వర్యంలో ఉన్న సంస్థలలో పనిచేసే ఉద్యోగులు ఒక రోజు జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా యివ్వడానికి నిర్ణయించారు.

తాడేపల్లిగూడెం మున్సిఫ్ శ్రీ వి సత్యనారాయణరాజు, జిల్లా కలెక్టరు శ్రీ గోవిందరాజన్‌కు డిసెంబరు 10 న తమ ఒక నెల జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా అందజేశారు.

బ్లాకు సహాయక పౌర సంబంధశాఖ అధికారుల జిల్లా సంఘం జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఒక రోజు జీతాన్ని యివ్వడానికి నిర్ణయించింది.

విజయవాడ మున్సిపల్ సిబ్బంది తీర్మానం

విజయవాడ పురపాలక సంఘం సంస్థలకు చెందిన, సభ్యులు, కమీషనర్ శ్రీ ఆర్. ప్రసాదరావు అధ్యక్షతన సమావేశమైనారు. ఛైర్మన్ డా॥ గద్దె పూర్ణచంద్రరావు, వైస్ ఛైర్మెన్ శ్రీ దళవాయి సుబ్బరామయ్య, కౌన్సిలర్ శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావు ప్రభృతులు ప్రసంగించారు.

దేశం విజయం సాధించే వరకు పురపాలక సంఘం తాలుకు అన్ని అసోసియేషన్ల ఆఫీసర్లు, నెలకు ఒక రోజు జీతం వంతున రక్షణ నిధికి విరాళం యివ్వడానికి అంగీకరించారు. ఈ మొత్తం నెలకు రూ 10 వేలు అవుతుంది.

6వ తేదీ జరిగిన సమావేశంలో బిల్లు కలెక్టర్లు రూ. 11—00 తమ కరువు భత్యం విరాళంగా ఇచ్చారు.

మంగళగిరి సి. కె. హైస్కూలు:

మంగళగిరి సి. కె. హైస్కూలు సిబ్బంది, విద్యార్థులు రూ 116—41 ప్రధాన మంత్రికి రక్షణ నిధికి పంపారు.

గుంటూరు జిల్లా కో—ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ సిబ్బంది సంఘం ప్రధాన మంత్రికి రూ. 201 విలువగల డ్రాఫ్టును రక్షణ నిధికి పంపించారు.

నల్గొండ జిల్లా నాగారం సమితి మినిస్టీరియల్ సిబ్బంది జాతీయ రక్షణ నిధికి ఒక రోజు జీతం విరాళం ఇవ్వడానికి ఏకగ్రీవంగా అంగీకరించారు.

విజయవాడ ప్రగతి నికేతన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రిన్సిపాల్ శ్రీ చంద్రశేఖరి అధ్యక్షతన సమావేశమై దేశరక్షణ నిధికి రూ. 116 లు విరాళాన్ని ప్రధానికి చెక్కు రూపంలో పంపారు.

విజయవాడ శ్రీనివాస బాల విద్యాలయం బాలలు తమ తల్లి దండ్రులు తమకిచ్చే డబ్బును ప్రోగుచేసి జవానులకు మిఠాయి పంచడానికి, అధ్యాపకులు యుద్ధనష్టం నుండి దేశంకోలు కొనునంత వరకు ఒక రోజు వేతనాన్ని రక్షణనిధికి పంపడానికి తీర్మానించారు.

మొవ్వ పంచాయతీ సమితి:

భారతదేశంపై పాకిస్తాన్ దురుద్దేశంతో యుద్ధం ప్రకటించిందన్న వార్త వినగానే కృష్ణాజిల్లా మొవ్వ పంచాయతీ సిబ్బంది బి. డి. ఓ. అధ్యక్షతన 4వ. తేదీ సమావేశమై సరిహద్దులలో వీరోచితంగా పోరాడుతున్న జవానుల సహాయార్థం ఒక రోజు జీతాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ రకంగా వసూలయిన రూ. 601 లను ప్రధానికి చెక్కు ద్వారా పంపారు.

జాతీయ రక్షణ నిధికి గాను రూ. 1116 విరాళం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ సెక్రెటేరియెట్ సిబ్బంది సహకార సొసైటి డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది.

ఈ సొసైటీ అధ్యక్షుడు శ్రీ పి. ఎస్. ఆర్. సి. ప్రభు ఈ మొత్తానికి చెక్కు ముఖ్య మంత్రికి అందజేశారు.

నిజామాబాదు జిల్లా పరిషత్ ఇంజనీరింగు శాఖ సిబ్బంది ఒకరోజు జీతం రూ. 1000 రక్షణ నిధికి విరాళం యిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు కూడా ఒక రోజు జీతం విరాళమిచ్చారు.

తెలంగాణా పాలఉత్పత్తి దారులు తమకు ఒకరోజు అందే మొత్తం రూ. 65 వేలను రక్షణనిధికి సమర్పించేందుకు గాను ముఖ్యమంత్రికి అందచేస్తున్నట్లు పాల ప్రాజెక్టు కేంద్ర డైరీ మేనేజరు డాక్టరు ఎమ్. పూర్ణచంద్రరావు, పాల సేకరణ అధికారి డా. సంజీవరెడ్డి డిసెంబరు 11 న వెల్లడించారు.


దేశరక్షణపైన చలనచిత్ర ప్రదర్శనములు

సమాచార, పౌర సంబంధ యాత్రిక శాఖ యుద్ధకాలంలో రక్షణకు సంబంధించిన చలనచిత్రముల ప్రదర్శనను ఏర్పాటు చేసింది, ఈ చలనచిత్రములు ప్రతిరోజు సాయంత్రం 7 గంటలకు హైదరాబాదు రాష్ట్ర సమాచార కేంద్రం అవరణలో ప్రదర్శించ బడినవి. "భారత దేశంలో బంగ్లాదేశ్ శరణార్థులు" "ది గన్నర్స్, "మన ప్రాంతీయ సైన్యం" అనే చిత్రాలు డిసెంబరు 12 న ప్రదర్శించ బడినవి, వీటిని చూటడానికి చాలామంది ప్రజలు వచ్చారు. డిసెంబరు 14 న పౌరుల విమాన దళం పౌర సైన్యం, భారత దేశంలో రక్షణ కొరకు పరికరాలు అనే చలనచిత్రాలు ప్రదర్శించ బడినవి.

బంగ్లాదేశ్

హిందూ, మహమ్మదీయ సంస్కృతుల సమ్మేళనం

ప్రభాకర్ మాచ్వే



'బంగ బంధు' ముజీబుర్ రహమాన్

రెండు మాసాల క్రిందట నేను కలకత్తాలో శ్రీ హుస్సేన్ అలీని సందర్శించాను. శ్రీ అలీ ఉన్న హాలు ప్రఖ్యాత కవులు రవీంద్రనాథ్ టాగూరు, నజ్రుల్ ఇస్లాం భారీ వర్ణ చిత్రాలతో అలంకరించబడి ఉండడం నేను చూశాను. ఈ ఇద్దరు కవులలో ఒకరు హిందువు, మరొకరు మహమ్మదీయుడు. కానీ, బంగ్లాదేశ్ మేధావులు ఈ కవులు ఏ మతంలో జన్మించారన్న విషయం గురించి ఏనాడూ ఆలోచించలేదు. కొంతకాలం క్రిందట పాకిస్తాన్ ప్రభుత్వం ఢాకా కేంద్రంనుంచి రవీంద్రనాథ్ టాగూర్ రచించిన గీతాలు ప్రసారం కావడాన్ని నిషేధించింది. కానీ, బంగ్లాదేశ్ ప్రభుత్వం మాత్రం రవీంద్రనాథ్ టాగూర్ రచించిన ఒక గీతాన్ని ఆ దేశ జాతీయ గీతంగా ఎన్నుకొన్నది. బంగ్లాదేశ్ ప్రజలకు మతంగురించి సంకుచిత అభిప్రాయాలు లేవని చెప్పడానికి ఇదొక గొప్ప తార్కాణం.

ఎందరో శాస్త్రవేత్తలు, కవులు, రచయితలు, దేశభక్తులు జన్మించిన పవిత్ర భూమి బంగ్లాదేశ్. జె.సి. బోస్, పి.సి. రాయ్, మైకెల్, మధుసూదన దత్తు, జీవానంద దాస్, చిత్తరంజన దాస్ వంటి ప్రముఖులు ఈ పవిత్ర భూమిలోనే జన్మించారు. వీరందరూ ఇతర మతస్థుల పట్ల గొప్ప సహనం చూపించారు. నిజానికి ఖురాను కూడా ఇతరులపై మతాన్ని బలవంతంగా రుద్దడాన్ని నిరసించింది. ఎవరు నమ్మిన మతాన్ని వారు అవలంబించవచ్చని ఖురాను ఘోషించింది. బంగ్లాదేశ్ ప్రజలకు ఈ సూక్తులలో ప్రగాఢ విశ్వాసం ఉన్నది. పరమత సహనం అనే గొప్ప సంప్రదాయానికి ప్రతీకలు బంగ్లాదేశ్ ప్రజలు. బంగ్లాదేశ్‌లో పాకిస్తాను నియంతల పాలన పట్ల వ్యతిరేకత వ్యక్తంచేస్తూ నేటి ప్రసిద్ధ బంగ్లాదేశ్ కవి షంసూర్ రెహ్మాను ఇలా వ్రాశారు. 'శత్రువు నా స్వగృహంలో ఉండడంవల్ల నాకు శాంతి కరువైంది. నా స్వదేశంలోనే నేను పరాయి దేశస్థుడిలా ఉండవలసి వచ్చింది.'

ఈ పవిత్ర భూమిలోనే బహు భాషా ప్రవీణులైన డాక్టర్ షహీదుల్లా జన్మించారు. (జూలై 1885_1969). డాక్టర్ షహీదుల్లా అరబిక్, పర్షియన్, సంస్కృతం, పాలీ భాషలలో గొప్ప ప్రావీణ్యం గడించారు. పాకిస్తాను సైనిక ప్రభుత్వం డాక్టర్ షహీదుల్లాకు ఢాకా విశ్వ విద్యాలయం ఉపాధ్యక్ష పదవిని ఇవ్వజూపింది. ఈ పదవిని అంగీకరించడమంటే పాకిస్తాను సైనిక నియంతల వలెనే బెంగాలీ భాషనూ, హిందువులనూ గుడ్డిగా ద్వేషించడమేనని ఆయన గుర్తించి, ఆ పదవిని తృణప్రాయంగా తిరస్కరించారు.

శ్రీ దినేష్ చంద్రసేను సంకలనం చేసిన, 'మైమెన్‌సింగ్ గేయాలు' అనే పుస్తకంలో ముస్లిం ఫకీర్లు ఉచ్చరించిన బెంగాలీ మంత్రాలు, వాడిన గేయాలు ఉన్నాయి. ముస్లింలు కూర్చిన 402 వైష్ణవ పదాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి.

1542 లో చైతన్యుడి జీవిత చరిత్ర పద్యరూపంలో వెలువడింది. ఈ గ్రంథంలో హరిదాసు అనే కవి వ్రాసిన పద్యం అర్థం ఇది ; మతాలు భిన్నమైనా అందరూ పూజించేది ఒక పరమాత్ముడినే. ఖురాను ఐనా, పురాణాలయినా ఈ సత్యాన్నే చెప్తాయి. బంగ్లాదేశ్ ముస్లింలకు ఒక గొప్ప సంప్రదాయముంది. ఈ సంప్రదాయం ప్రకారం, ముస్లిం కవులు రాధా కృష్ణుల గురించీ, విష్ణుమూర్తి గురించీ భారత పురాణాలలో ఉన్న కథలను

ఆధారంగా చేసుకొని పద్యాలు వ్రాసి, వాటిని గానంచేస్తారు. ఈ విషయంలోనే నౌఖాలీకి చెందిన అబ్దుల్ హకీం అనే ముస్లిం కవి మరొక్క అడుగు ముందుకు వేశాడు 18 వ శతాబ్దంలో జీవించిన ఈ కవి 'నూర్‌నామా' అనే గ్రంథంలో ఇలా వ్రాశాడు. 'బెంగాల్'లో పుట్టి. పెరిగినవాడు బెంగాలీ భాషనే ఎలా అవహేళన చేస్తాడో నేను అర్థం చేసుకోలేక పోతున్నాను. మాతృభాషను ప్రేమించలేనివారు స్వదేశంలో ఉండేకన్నా పరదేశంలో జీవించడమే మేలు.

బంగ్లాదేశ్ కవిత

శ్రీ శక్తి చట్టోపాధ్యాయ సంకలనం చేసిన పూర్వ బంగ్లా శ్రేష్ఠ కవిత, అనే పుస్తకానికి వ్రాసిన ఉపోద్ఘాతంలో బంగ్లాదేశ్ కవిత ప్రధానంగా మూడు విధాలుగా సాగిందని శ్రీ సేవవ్రత చౌధురీ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఉత్సాహవంతులైన కవులు, కవయిత్రులు ఎంతో మంది ఉన్నారు. దావూత్ హైదర్ అనే కవి ఇలా వ్రాశారు; ''భారత ప్రజలతో శాంతియుతంగా ఏక కుటుంబీకులుగా జీవించాలని బెంగాల్ ప్రజల కోరిక. ద్వేషాన్ని పెంచుకొన్నందువల్ల ఒరిగేదేముంది?''

బంగ్లాదేశ్ కవయిత్రులు, కవులకు ఏ మాత్రం తీసిపోలేదు బేగం లతీఫా హిలాలీ, జహనారా అర్జు, కారీ లతీఫా హక్ జేబున్నీసా జమాత్. అస్మా అబ్బాస మెహెరున్నీసా మొదలయినవారు సుప్రసిద్ధ బంగ్లాదేశ్ కవయిత్రులు.

బంగ్లాదేశ్ కవి కాజీ నజ్రుల్ ఇస్లాం వ్రాసిన ఒక గీతం అర్థం ఇది ''హిందూ, మహమ్మదీయ మతాలు ఒకేకొమ్మకు పూసిన రెండు పుష్పాలు ఈ రెండు మతాలు ఒకే తల్లికి చెందిన రెండు నేత్రాలు.''

కాజి నజ్రుల్ ఇస్లాం అడుగు జాడలలోనే నడిచిన బేగం సూఫియా కమత్ అనే కవయిత్రి ఆ మహాకవికి కృతజ్ఞతలు తెలుపుకొంటూ ఇలా వ్రాసింది : కవిత్వంలో ఒక క్రొత్తమార్గం చూపింది అదే మార్గంలో పయనించిన నిన్ను మేమెప్పుడూ మరచిపోము.

బంగ్లాదేశ్ వచన సాహిత్యము

మోహిత్ ఆచార్య రాము నిర్వహిస్తున్న చిన్నకథల పత్రికలో ''షట్‌దశ్'' (16 చిన్న కథలు) "ఛోటే గల్ప్" (చిన్న కథలు) అనే పుస్తకాలపై సమీక్ష వ్రాస్తూ. బంగ్లాదేశ్ యువ రచయితలు మామూలు ప్రజల జీవితంలోని యధార్థ సంఘటనలను చిన్న కథలుగా చిత్రించారని పేర్కొన్నారు. తులసి చెట్టును గురించిన ఒక కథ బంగ్లాదేశ్ ప్రజల మతసామరస్యానికి ఒక గొప్ప ఉదాహరణ.

''పూర్వ బంగ్లా సంప్రతిక్ గల్ప్'' (నేటి తూర్పు బెంగాల్ చిన్న కథలు) అనే గ్రంథానికి శక్తి చట్టోపాధ్యాయ ఉపోద్ఘాతం వ్రాశారు. ఈ గ్రంథంలో హిందూ, మహమ్మదీయ రచయితలు వ్రాసిన 45 గొప్ప కథలు ఉన్నాయి. ఆనంద శంకర రాయ్ నారాయణ్ గంగోపాధ్యాయ్, సమరేశ్ బాసు, కమలకుమార్ ముజుందార్, సంతోష్‌కుమార్ ఘోష్, జ్యోతీంద్ర నందివంటి హిందూ రచయితలు, హసన్ అజీజుల్ హక్, మహబూబ్‌నాదిక్, మహమద్ నియాజ్, సయ్యద్ ముజ్తాబా అలీ వంటి ముస్లిం రచయితలు వ్రాసిన చిన్న కథలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

కథారచన నవలారచనలలో పేరు పొందిన రచయితలలో దాదాపు అందరూ బంగ్లాదేశ్‌లోనే జన్మించారు. రాధాశంకర్ బెనర్జీ, మానెక్ బెనర్జీ, స్వరాజ్ బందోపాధ్యాయ, గౌరీ కిశోర్ ఘోష్‌లు బంగ్లాదేశ్‌లో జన్మించిన ప్రముఖ నవలా రచయితలు. మణిక్ బెనర్జీ వ్రాసిన ప్రఖ్యాత బెంగాలీ నవలను హిరేన్ ముఖర్జీ "బోట్‌మెన్ ఆఫ్ పద్మ" అనే పేరుతో అనువదించారు.

దేశ విభజన జరిగిన తర్వాత బెంగాల్‌లోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల రచయితలు "ఏక్ సంగే" అనే పేరుతో ఒక కథల సంపుటిని ప్రచురించారు.

అన్యాయంగా అసహాయులైన ప్రజలను చంపడం తప్పని ఖురాన్ చెప్తున్నది. బంగ్లాదేశ్‌లో పాకిస్తాన్ సైనిక నియంతల అత్యాచారాలకు వందల సంఖ్యలో రచయితలు, మేధావులు బలి అయ్యారు. పాకిస్తాన్ జరిపిన ఈ హత్యాకాండకు కూడా ఖురాన్ సూక్తి వర్తిస్తుంది. న్యాయంకోసం ఎదురు తిరిగిన బంగ్లాదేశ్ ప్రజలను బలప్రయోగంద్వారా అణచివేయగలమనుకోవడంలో పాకిస్తాన్ నియంతల అవివేకం అర్థమవుతుంది. మాక్సింగోర్కీ అన్నట్లు సత్యాన్ని రక్తపుటేరులలో ముంచివేయడం సాధ్యంకాదు. బంగ్లాదేశ్ ప్రజలపై పాకిస్తాన్ సైన్యం జరిపిన అత్యాచారాలు, బంగ్లాదేశ్, భారత ప్రజల ఐకమత్యానికి భంగం కలిగించలేదు.

హిందూ, ముస్లిం రచయితలు పరస్పరం పెంచుకొన్న కక్షలు కృత్రిమమైనవి. ఈ కక్షలు పెరగడానికి కారణం ఇతరులే. కర్జన్ బెంగాల్‌ను విభజించినపుడు హిందూ, ముస్లింల మధ్య ఏర్పడిన అనైక్యతకూడా ఎక్కువకాలం లేదు. ఆ తర్వాత 1947 లో జరిగిన విభజనకు కూడా బలమైన కారణంలేదు. బెంగాలీలు నవీన దృక్పథంకల ప్రజలు. ఇతర మతాలగురించి వారికి సంకుచిత అభిప్రాయాలు లేవు.

కల్పనా దత్తా అనే రచయిత "చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడి" అనే పుస్తకం వ్రాశారు. ఈ పుస్తకంలో ఆమె తమ సాహస చర్యలగురించి వ్రాశారు. విప్లవకారులుగా చెప్పబడే ఎందరో బెంగాలీలు ఈనాడు అంతర్జాతీయ దృక్పథంగల నక్సలైట్లుగా మారారు. ఇతర మార్గాలగురించి సంకుచిత అభిప్రాయాలు లేకపోవడంవల్లనే వారు అంతర్జాతీయ దృక్పథం అలవర్చుకోగలిగారు.

బదురుద్దీన్ ఒమర్ అనే రచయిత "పూర్వ బంగాల్ సాంస్కృతిక సంకట్" (తూర్పుబెంగాల్ సాంస్కృతిక రంగంలో ఏర్పడిన సంక్షోభం) అనే పుస్తకం వ్రాశారు.

తూర్పుబెంగాల్ సాంస్కృతిక రంగంలో సంక్షోభం ఏర్పడడానికి మతం ఎలా కారణ భూతమయిందో వివరిస్తూ ఈ పుస్తకంలో ఒకచోట రచయిత ఇలా వ్రాశాడు. "రవీంద్రనాథ్ టాగూర్ బ్రహ్మసమాజ మతస్థుడు. అయినా ఆయన హిందువుగానే భావించబడ్డాడు ఇందువల్ల రవీంద్రనాథ్ టాగూర్‌కు స్థానంలేకుండా పోయింది మైకేల్ మధుసూధన దత్తు క్రిస్టియను. కానీ ఆయనకూడా హిందూమతాన్ని ఇతివృత్తంగా చేసుకొని కథలు వ్రాశారు. దానితో ఆయనంటేకూడా గిట్టకుండా పోయింది. ఇక బంకిమ్ చంద్ర, శరత్ చంద్రలగురించి చెప్పనక్కరలేదు. శరత్ చంద్ర నాస్తికుడు. నజ్రుల్ ఇస్లాం ముస్లిం అయినప్పటికి భారత దేశ అభిమాని కావడంవల్ల ఆయనంటే కూడా పడలేదు భారత దేశాన్ని అభిమానించే ఇతర ముస్లిం రచయితలందరూ ఇస్లాం మతానికి వ్యతిరేకులని నిర్ణయించబడ్డారు. ఇందువల్ల వారికికూడా సాంస్కృతిక రంగాలలో స్థానం లేకుండా పోయింది."

ఇందువల్ల హిందూ, ముస్లిం రచయితలు పరస్పరం పెంచుకున్న కక్షలు కృత్రిమమైనవని స్పష్టమయింది. సర్వమానవ సౌభ్రాతృత్వంకోసం ప్రపంచ ప్రజలందరు సంఘటితంగా పురోగమిస్తున్న ఈ సమయంలో కృత్రిమంగా సృష్టించబడిన మతంలాంటి అడ్డుగోడలు నిలువలేవు.

పాకిస్తానీల అనాగరిక ప్రవృత్తి

ఢాకాలోని బంగ్లా అకాడమీ డైరెక్టరూ, చిట్టగాంగ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరూ ఐన శ్రీ సయ్యద్ అలీ హసను 'క్వెస్ట్' అనే పుస్తకంలో పాకిస్తానీల గురించి ఇలా వ్రాశారు.

"పాకిస్తాను సైనికాధికారులు దయ, మానవత్వం లోపించిన అనాగరికులు వారిని రాతియుగంనాటి మానవులతో పోల్చవచ్చు. ఏడేళ్ళపాటు వారితో నివసించడంవల్ల ఆ ప్రజలు ఎలాంటివారో నేను బాగా గమనించాను. పాకిస్తాను ప్రజలలో స్వార్థం, దురహంకారం బాగా పేరుకొని పోయాయి. వివిధ సంస్కృతులు సంప్రదాయాల గురించి తెలుకోందామన్న ఆసక్తిగాని వారిని గౌరవిద్దామన్న భావంగానీ వారికి లేవు. ఇట్లాంటి ప్రజలే క్రూరులుగానూ, అకారణంగా హత్యలుచేసే దుష్టులగానూ, మారుతారు"

బెంగాలీభాష వాఙ్మయాలపట్ల బెంగాలీలకు ఉన్న అభిమానాన్ని ఉరూ్దభాష వాఙ్మయాలకూ ఇస్లాంమత నమ్మకాలకూ పరిమితం చెయ్యవలసిందిగా కోరి వారు బెంగాలీ ప్రజలకు తీరని అపకారం చేశారు. మతోన్మాది ఐన మౌలానా అక్రింఖాన్ మరో మెట్టు పైకిపోయి హిందూ పురాణాలకూ ఇతిహాసాలకు సంబంధించిన ప్రస్తావనలే బెంగాలీ సాహిత్యంలో చేయవద్దని బెంగాలీ రచయితలను కోరారు.

జెస్సోర్ విషాదగాథ

జెస్సోర్‌లోని వివిధ ప్రాంతాలలో పాకిస్తాన్ సైనికులు పెట్టిన మందుగుండ్లు పాతరలనూ, ప్రేలుడు పదార్థాలను వెతికి నిర్మూలించడానికి సైనిక ఇంజనీర్లు తీవ్రంగా కృషిచేశారు. ఈ చర్య అక్కడి ప్రజలు సురక్షితంగా ఉండేందుకు తీసుకొనడం జరిగింది.

ఒకప్పుడు జెస్సోర్‌లో 35 వేల మంది నివసిస్తూ ఉండేవారు. మన సైనిక దళాలు జెస్సోర్‌ను వశపర్చుకున్నప్పటికి అక్కడ పదివేల మంది మాత్రమే బ్రతికిఉన్నారు. జెస్సోర్ నుంచి ఒక వేళ వైదొలగవలసి వస్తే ఆ పట్టణాన్ని అక్కడి విమానాశ్రయాన్ని, కంటోన్మెంటునూ సర్వనాశనం చేయాలని పాకిస్తాన్ సైన్యం ఆలోచించింది అయితే మన సైనికులు ఆ పట్టణాన్ని అనుకున్న దానికంటె అతివేగముగానూ, అనుకోనంత ఆకస్మికంగానూ కైవసం చేసుకొనడంలో పాక్ పన్నాగాలు సాగలేదు.

మన సైన్యాలు జెస్సోర్‌ను ఆక్రమించుకున్న వెంటనే అ ప్రక్క పల్లెలోని ప్రజలు ఆ పట్టణాన్నుంచి పారిపోయిన ప్రజలూ జెస్సోర్‌కు తిరిగి రావడం మొదలైంది. పాక్ సైనికులూ, రజాకారూ కలిసి మొత్తం ఆ పట్టణంలో కనీసం 2 వేల మంది ప్రజలనైనా చంపివేశారని ఆ మృత దేహాలను సమీపంలోని భైరవి నది ఒడ్డున పాతిపెట్టినారని అక్కడి ప్రజలు సైన్యాధికారులతో చెప్పారు ఆ చంపి వేయబడ్డ వారి అస్థిపంజరాలు ఆ నది ఒడ్డున కన్పిస్తాయి.

చాందినిబజార్, కపూరియా పట్టణంలోని 400 దుకాణాలను పాక్ సైనికులు దోచుకున్నారని పరిశీలకులు తెలియజేశారు. ఆ బజారులోని ఒక మసీదును కూడా సైనికులు పాడు చేశారు. ఆ పట్టణంలోని స్త్రీలను చాలా మందిని పాక్ సైనికులు చెరచడం జరిగింది. కొందరు స్త్రీలను చంపివేశారు.

ఎంతో మంది స్త్రీలను పాకిస్తానీలు బలవంతముగా తీసుకొని వెళ్లారు. ఏప్రిల్ నుండి జెస్సోర్‌లో పాక్ సైనికులు క్షమించరాని నేరాలు ఎన్నింటినో చేశారని రోమన్ క్యాథలిక్ మిషనుకు చెందిన ఫాదర్ ఫ్రాన్సిస్ సైనిక పరిశీలకులతో అన్నారు. ఏప్రిల్ 1వ తేదీన కాథలిక్ మిషన్‌లో జరిగే ప్రార్థనా కార్యక్రమం పాక్ సైనికుల కాల్పులవల్ల మధ్యలో ఆగిపోయింది. పాక్ సైనికులు మిషనుపై దాడిచేసి ఫాదర్ మెలియాను ఇంకా కొందరిని నిర్దాక్షిణ్యంగా చంపారు మితిమీరిన కాల్పులు జరుగుచుండడంవల్ల శవాలను శ్మశానానికి తీసుకువెళ్ళడం కూడా సాధ్యపడలేదు. అందువల్ల శవాలను మిషన్ ప్రాంతంలోనే పాతిపెట్టాలిసి వచ్చింది.

భారత సైనికులను భారతదేశం నుంచి వచ్చిన ప్రియమైన స్నేహితులు అని వర్ణించారు ఫాదర్ ఫ్రాన్సిస్. దురాగతాలనూ, అణచివేత చర్యలనూ అంతం చేయటానికి దేవుడు మిమ్ములను పంపించాడు భారత సైన్యం రాకతో ప్రభవించిన నూతన శకంలో సర్వ మానవ సమానత్వం, ప్రేమ వెల్లివిరుస్తాయనటంలో నాకేలాంటి అనుమానమూ లేదు అన్నారు ఫాదర్ ఫ్రాన్సిస్.

విజయేందిర

శ్రీ జోపుడ్డి

పూర్వదిశా దాస్య నిశావలయాన్ని
చీల్చే ఓ సూర్య భగవాన్ !
సేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రాణం పో
షేక్ ముజీబుర్రహమాన్ !

ప్రజా ప్రహ్లాదుల్ని పరాభవించడానికి
ప్రజాస్వామ్య గజస్తంభాన్ని తన్నిన
నిర్దాక్షిణ్య నిరంకుశత్వ హిరణ్యాక్షుణ్ణి
నిలువునా చీల్చే విజయోజ్వల నరసింహా !

పదిహేనుకోట్ల బంగ్లాదేశ ప్రజాకరాలు
ప్రజాద్రోహి వక్షం చీల్చే వజ్రశరాలు
బంగ్లావీరులు కార్చే ప్రతి రక్తబిందువు
వలసాధిపత్యాన్ని ముంచెత్తే విప్లవసింధువు

సీతను చెరగొన్న రావణునికి
నీతిని చెరగొన్న హిట్లర్‌కు
అమాయిక ప్రాణాలను బలిగొన్న
మాయావి బకాసురునికి
సత్యాన్ని సమత్వాన్ని ధర్మాన్ని
చిత్రహింస పెట్టిన దుర్యోధనునికి
పట్టిన గతే పడుతుంది
నిను చెరబట్టిన
నరహంతక నియంతలకు

ప్రజాస్వామ్య ప్రగతీందిర
స్వాతంత్ర్య సమర దీపేందిర
బంగ్లాదేశ ప్రజావిజయేందిర
భారతీయ మాననీయ స్నేహేందిర

శాంతికేతన క్రాంతి రథాలపై
నవ్యాశా దివ్యాశయ పథాలపై
కదలి వచ్చే రదుగో
నీ కలలను పండించడానికి
పారతంత్ర్యాన్ని బంగాళాఖాతంలో
లోతుగా పాతిపెట్టడానికి

ముక్తివాహిని దేశభక్తి తరంగాలు
స్వాతంత్ర్య భావ విద్యుత్ విస్ఫులింగాలు
నింగినీ నేలను ఆవరిస్తున్నాయి
బంగ్లాదేశ వీర విప్లవ జెండాలపై
ఖండ ఖండాలలో తాండవిస్తున్నాయి.

మతం అనే నల్లమందు వేస్తే
స్వేచ్ఛా సింహం నిద్రపోదు
బూటకాల నాటకాల వేషాలకు
ఓటు హక్కు మోసపోదు

స్త్రీల మానభంగం చేసే
శిశువులను కూడా హత్యచేసే
పశుత్వాన్ని ఎదిరిస్తున్నారు
పరశురాములై పసివాళ్లు పడుచువాళ్లు
కొడవళ్లవలె నడుములు వంగిన
ముదుసలివాళ్లు
అసిధారా తీక్షణేక్షులు
సత్యభామాతుల్య భామినులు

రోషం పౌరుషం పర్జన్యాలై
గర్జిస్తున్నాయి గగనమండలంలో
అరువుతెచ్చుకున్న బలంతో
పరుగులెత్తే పట్టాలపై
నీరుకాదు నిప్పుకణాలు వర్షిస్తున్నాయి

చెట్లకొమ్మల మాటునుంచి
కొండకొమ్ముల చాటునుంచి
స్వాతంత్ర్య ఖండనరాములు
శత్రువాలిమూకలను కూలుస్తున్నారు
దీక్షా కోదండపాణులై
రక్షా శంఖం పూరిస్తున్నారు

నీవు వ్యక్తివికావు - ప్రజా శక్తివి
నీవు రాగదీపానివేకాదు - త్యాగరూపానివి
నీవు ప్రవచించిన స్వేచ్ఛావాక్కులు
మానవాళికి మరువరాని ముక్కులు

అధికార మదోన్మత్తులు
అధర్మ విషనిర్భర చిత్తులు
నిన్ను అంతం చేయలేరు
కోటికోటి హృదయ పద్మాలనుంచి
నీ వెలుగు రేఖల్ని వేరు చేయలేరు
విజయం నీదోనోయ్
అంతిమ విజయం నీదేనోయ్

స్నేహభావ బంధాలలో
చిర సంస్కృతి గ్రంథాలలో
రవీంద్ర కవీంద్రుని
రమ్య కవితా జ్యోత్స్నికలలో
భారత బంగ్లా మైత్రి
కలకాలం వెలగాలోయ్.

"స్వప్రియం తు పరిత్యజ్య"

తిరుమల రామచంద్ర

ఉత్తిష్ఠత సం నహ్యధ్వం
ఉదారాః కేతుభిస్సహ ।
సర్పా ఇతరజనాః
రక్షాంస్యమిత్రా నమధావత ।
ఈశాం వో వేదరాజ్యం
త్రిషంధ్యే అరుణైః కేతుభిః సహ
అథర్వర్యకాం ॥, సూక 10, నం ।

"లేవండి. జండా చేతపట్టుకొని శత్రువులను వెన్నాడండి." అని యుద్ధం వచ్చినప్పుడల్లా కవులు కంఠమెత్తి ముందుకురికారు.

మానవ పరిణామంలో స్వంత ఆస్తి పుట్టినప్పుడే యుద్ధం పుట్టింది. దానితో మిత్రులు, అమిత్రులు పుట్టారు. సౌహార్ద్ర దౌర్హార్దం పుట్టాయి. వీరాలాపాలు, విక్రమోద్ధతులు పెరిగాయి వాటితోపాటే శాంతివాంఛ కూడా అవతరించింది.

మనకు ఒకరి భూమిమీద ఆశలేదు: ఒకరి ధనముమీద కాంక్షలేదు: ఒరుల గొప్పతనం కూడా ఓర్వలేని తనంలేదు ప్రశాంత వాతావరణంలో ప్రజలందరికీ కావలసిన సుఖమయ జీవన సాధనాలను సృజించుకోవాలని మనకోరిక. అందుకనే మన విదేశాంగ నీతికి అలీనం అలంబనం, శాంతి సమ్యగ్లక్ష్యం

అయినప్పటికీ, ఇరుగుపొరుగున ఇలాటి లక్ష్యాలు లేనంత కాలం మన ఆశయాలకు అఘాతాలు కలుగుతూనేఉంటాయి భారత దేశం స్వతంత్రమయిన ఈ ఇరవై యయిదు సంవత్సరాలలో అనేక పర్యాయాలు మనశాంతికి భంగం కలిగింది. మన అభ్యుదయానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. ఒకనాడు మన అంగంలో అంగమై రెండు పుష్కరాలక్రిందట విడిపోయిన మనసోదరులకు అక్కడి పాలకులు సుఖజీవనం సున్నచేశారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను చెరపట్టారు. బ్రతుకులు మెరుగు పరచుకోడానికి మనసోదరులు ప్రయత్నించినప్పుడల్లా వారిమనసుల్లో మన పై విద్వేషం నూరి పోశారు. కసినీ, కార్పణ్యాన్నీ నింపారు. వారిసుఖమయ జీవితానికి మనమే అవరోధాలు కల్పిస్తున్నట్టు నమ్మించారు.

ఆరేళ్ళ క్రిందట ఈ కసి పెరిగి పెరిగి యుద్ధంగా పరిణమించింది. ఆనాటి యుద్ధరంగంలో జన నష్టంతోపాటు నూరుకోట్ల వరకు ధననష్టం జరిగింది. మనలాగే శాంతినికోరే మహాదేశం సోవియట్ యూనియన్ కృషిఫలితంగా తాష్కెంట్ ఒప్పందం జరిగి, యుద్ధం ముగిసింది.

మన పొరుగు దేశంలో గొర్రెలు తినేవారు పోయి బర్రెలు తినేవారు వచ్చారు. కసి తిరిగి కాలకూటంలా పెరిగింది. కాని, వ్యాకరణంతో ఆకలి తీరదని మురారి ఏనాడో చెప్పినట్టు కసితో కడుపునిండదని, మన సోదరులు గ్రహించారు. పాలకులు సృష్టించిన భయభీతి వాతావరణంలో కూడా తమ ఆశయాలను నిర్ద్వంద్వంగా ప్రకటించారు. స్వేచ్ఛా స్వాతంత్ర ప్రశాంత వాతావరణంలో సుఖమయ జీవితావకాశాలు, ఇరుగు పొరుగు వారిచే స్నేహ సౌహార్ద్రాలు కావాలని కోరారు, ఈ కోరిక పాలకులకు భయం పుట్టించింది ద్వేషం, యుద్ధం సిరలూ ధమనులుగా రూపొందించిన పాలకులు మతిచెడి, ధృతి చెడి తమ ప్రజల మీదికే విరుచుకుపడ్డారు. ఊహ ఉడిగి పోయినప్పుడు అన్ని విధాల అశక్తుడయినప్పుడు మాత్రమే ఎవ్వడైనా దౌర్జన్యానికి దిగుతాడు. వాదబలం తగ్గినప్పుడే కదా, 'శేషంకోపేన పూరయేత్' అనేనానుడి పుట్టింది: అశక్త దౌర్జన్యానికి పాల్పడిన పాలకులను నివారించలేని నిరాయుధులు అభయం కోసం మనను శరణుజొచ్చారు.

" రక్ష్యత్వం వై ప్రజాధర్మం
క్షత్రధర్మస్తు రక్షణం,
కునృపైః పీడితా: తస్మాత్
ప్రజా: సర్వత్ర పాలయేత్
(భారతం, అనుశాసనిక)

దుష్టపాలకులు ప్రజలను పీడించినప్పుడు ఆ ప్రజలను అన్ని విధాల ఆదుకోవడమే ధర్మమని మహాభారత అనుశాసన పర్వములో భీష్ముడు నాటి ధర్మరాజునేకాక, ధర్మాన్ని అభిమానించే నేటి పాలకులను కూడ అనుశాసించాడు. అందుకనే, ఒకరు కాదు, ఇద్దరు కాదు, కోటి మంది పీడితులు, బంధువులను భార్యా బిడ్డలను కోల్పోయిన ఆర్తులు మన దేశానికి వచ్చినప్పుడు, అది ఎంతటి భారమైనా భరించడానికి మనం సిద్ధమయ్యాము.

ఆరేళ్ళ క్రిందట మనతో యుద్ధంలో ఏమీ సాధించలేక పోయిన పొరుగు దేశపు నియంతలు ఈసారి తమ ప్రజలపైన ప్రత్యక్ష యుద్ధమే కాకుండా మన ఆర్థిక వ్యవస్థమీద పరోక్షయుద్ధం కూడా ప్రకటించారు. శరణార్థుల పోషణ కోసం నెలకు దాదాపు నూరు కోట్ల రూపాయలు వ్యయమవుతున్నా మనం ఎనిమిది నెలల పాటు సహించాం. ఇది చాలదన్నట్టు పొరుగున ఉన్న దురంత నియంతలు మనమీదనే యుద్ధం ప్రకటించారు.

ఇలాటి దశలో ఆది నుంచి శాంతి పరిరక్షణకు ప్రజల సుఖమయ జీవితానికి మనలాగే అంకితమైన ఒక్క సోవియట్

యూనియను తప్ప మారే మహాపాలకులూ ఈ నియంతలను ఆదేమన్న పాపాన పోలేదు.

ఆత్మరక్షణ కోసం ఆయుధాలు చేపట్టాము. మన సైనికులు వీరులు సన్నద్ధులయ్యారు. మన జాతి గౌరవాన్ని చేబూని శత్రువులను చెండాడారు ఈ యుద్ధంలో. ఋగ్వేదం గిరుల అథర్వణ వేదంలో

"అనిరాంతో వేద రాజ్యం
త్రిషంధే అరుణై: కేతుభి: సహ"

అని చెప్పినట్లు అపార కేతనధారి అయిన సోవియట్ యూనియను మనతో సౌహార్ద్రం ప్రకటించిన నాడే విజయం తథ్యమని తేలిపోయింది.

ఈ యుద్ధం మన స్వార్థం కోసం చేయడంలేదు. మనకు ఎవరి భూములమీద, ధనంమీద ఆకాంక్షలేదు. కాని, మన దేశానికి కాందిశీకులుగ వచ్చిన వారిని సురక్షితంగా వారి దేశానికి పంపడం, అక్కడ వేలన తర్వాత కూడా వారికి సురక్ష కల్పించడం మన కర్తవ్యం మహాభారత ఆదేశం కూడా అదే.

"కారణాదేవ యోద్ధవ్యం
నాత్మనః పరదోషతః
సుయుద్ధే ప్రాణమోక్షశ్చ
తస్య ధర్మాయ ఇష్యతే"

(అనుశాసనపర్వం)

ఒక ప్రత్యేక కారణం వుంటే తప్ప యుద్ధం చేయవద్దని మహాభారత ఆదేశం. ఇప్పుడు మనం అకారణంగా యుద్ధం చేయడంలేదు. మన దోషాలను కప్పిపుచ్చుకోడానికి ఇతరుల దోషాలను ఎత్తి చూపడానికిగాని యుద్ధం చేయడంలేదు.

"భయార్తానాం భయత్రాతా
దీనానుగ్రహ కారణాత్
కార్యాకార్య విశేషజ్ఞః
నిత్యం రాష్ట్రహితే రతః

(అనుశాసనపర్వం)

అని చెప్పినట్లు భయార్తుల భయ నివారణ కోసం, దీనులను ఆదుకోవడం కోసం, దేశహితం కోసం, కార్యాకార్యాలు తెలిసి ఈ యుద్ధానికి పూనుకొన్నాము.

ఈ యుద్ధంలో మన పరమాశయం ఒక్కటే. మనలాగే మన పొరుగువారుకూడా ప్రశాంతవాతావరణంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో తమ సుఖమయ జీవితంకోసం పాటుపడే పరిస్థితులు కలగాలి. అంతే మనకు కావలసింది. అంతేకాని వారి భూమి మనకు వద్దు. వారిసంపద మనకు వద్దు. అయితే వారిశ్రేయస్సు మనకు కావాలి. వారి స్నేహం మనకు కావాలి. ఆ భూమిలో మనకు శాంతి కావాలి. ఉభయ ప్రజల మధ్య సహకారం కావాలి. అందుకనే శాంతి స్నేహ సహకారాలకు అంకితమైన భారత-సోవియట్ యూనియన్లు శాంతి స్నేహ సహకార సంధిని కుదుర్చుకున్నాయి.

ఈలాటి శాంతి స్నేహ సహకారాలే సకల జాతుల మధ్య సహజీవనానికి పునాదులు కావాలని మన ఆకాంక్ష.

అయినప్పుడు అనాదిగా శాంతి స్నేహ సహకారాలు పునాదిగా కవితలు, కావ్యాలూ అల్లిన మన భారతీయ రచయితలు ఈనాడుకూడా తమ మేధా శక్తిని దీనికి అంకితం చేయవలసి ఉంటుంది. వేద ఋషులవలె మన కవులుకూడా నేడు సౌహార్ద్ర దౌరార్ద విచక్షణ చూపవలసి వుంది. ప్రజల మనస్సుల్లో స్నేహాన్ని నిలిపి సహకారాన్ని పెంచి, శాంతిని కుసుమింపజేయవలసిన బాధ్యత మన పైన ఉంది. ధర్మంకోసం న్యాయంకోసం ఇరుగుపొరుగుల శ్రేయస్సుకోసం తప్పనిసరిగా తలపెట్టిన ఈ యుద్ధంలో జాతినేత్రి శ్రీమతి ఇందిరాగాంధికి మన ప్రజలందరి సహకారం సంపాదించవలసిన బాధ్యత మన రచయితలది. కనిపించని మామిడి తోటల్లో వినిపించని కోయిలల కుహూ రవాల ఊహాలు కట్టిపెట్టి భారత ప్రజల సహకారవనంలో పుంస్కోకిలలు కావాలి.

శ్రీమతి గాంధి ఈ నాడు భారత ఉపఖండంలో

"ప్రజానాం రక్షణార్థాయ
ప్రజాహితకరో భవేత్
ప్రజాకార్యం తుతత్కార్యం
ప్రజాసౌఖ్యం తుతత్సుఖం
ప్రజాప్రియం ప్రియం తస్య
స్వహితం తుప్రజాహితం
ప్రకార్థం తస్య సరస్వం
ఆత్మార్థం నవిధీయతే"

అని భారతంలో భీష్ముడు ధర్మరాజునకు ఉపదేశించిన సిద్ధాంతాలనే ఆచరణలో పెడుతున్నది. తరతరాలుగా మన జాతి సంచయించిన మంచి అంతా ఈనాడు ఆచరణలో ఉన్నంతగా ఏనాడూ లేదు. ఇందుకు ప్రధానబాధ్యురాలయిన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి అభినందనీయురాలు. మనం ఆమె సహచారిణులైనందుకు గర్విదాం.

"స్వప్రియంతు పరిత్యజ్య
యద్యల్లోకహితం భవేత్"

అని అనువచించినట్టు స్వలాభాన్ని విడనాడి ఈ క్లిష్ట సమయంలో లోకహితంకోసం గొంతెత్తుదాం.

★

మన సైనికవీరుల సాహసగాథలు

భారత నౌకాదళం సాహసోపేత చర్య

పాకిస్తాన్‌పై రెండవ రోజు యుద్ధంలో మన పశ్చిమ తీర నౌకా దళానికి చెందిన యుద్ధ నౌకలు కరాచీ రేవుకు సమీపంలో మూడు పాక్ యుద్ధ నౌకలను ముంచివేసినవి. అవి కాక ఒక నౌక దెబ్బతిన్నది, మరొక నౌక పారిపోయింది.

పాక్ నౌకా దళంలో మొత్తం 5 డిస్ట్రాయర్ నౌకలు, రెండు సబ్ మెరైన్ విధ్వంసక నౌకలు, ఒక క్రూయిజర్, ఒక సబ్ మెరైన్ మాత్రమే ఉన్నాయి. మూడు నౌకలు మునిగి పోవడం వల్ల పాక్ నౌకా బలానికి తీవ్ర నష్టం కలిగింది.

5వ తేదీ ఉదయం మన యుద్ధ నౌకలు అతి సాహసంతో కరాచీ రేవు సమీపంలో పాక్ యుద్ధ నౌకలపై దాడిచేసి విజయం సాధించాయి. ఈ విజయం ఫలితంగా భారత యుద్ధ నౌకలు కరాచీ రేవువద్దగల పాక్ గస్తీ నౌకావలయాన్ని ఛేదించి, రేవుపై బాంబులు వేయగలిగాయి.

పాక్ ముష్కరుల్ని హడలెత్తించిన భారత కమాండర్

పంజాబులో అమృతసర్ రంగంలో రాణియా పికెట్ ఇన్‌ఛార్జిగావున్న హెడ్ కానిస్టేబుల్ మోహిందర్ సింగ్ డిసెంబరు 3న, 8 మంది పాకిస్తాను సైనికులను చంపివేశాడు.

3వ తేదీ రాత్రి రాణియా గస్తీ స్థావరంపై పాకిస్తాన్ సేనలు భారీ యెత్తున దాడిజరిపినపుడు భారత సేనలు శత్రు మూకలను త్రిప్పి కొట్టాయి. అప్పుడు పాక్ సైనికులు చాలా మంది చనిపోయారు.

అదే రాత్రి పాకిస్తాను రెండవసారి ఉద్ధృతంగా దాడి చేసింది. మోహిందర్ సింగ్ తన కమాండ్ క్రిందగల జవాన్ల సహాయంతో ఈ దాడిని త్రిప్పి కొట్టాడు.

డిసెంబరు 4, తెల్లవారుజామున పాకిస్తాన్ జరిపిన చివరి దాడిలో మోహిందర్ సింగ్ తన బంకర్‌నుంచి బయటకు దూకి, తన జవాన్లకు ప్రోత్సాహమిస్తూ, కేకలు వేస్తూ శత్రువులపై తన తుపాకీతో కాల్పులు జరిపాడు. ఒక బంకర్ నుండి మరొక బంకర్‌కు ఆయన దూకుతుండగా శత్రువుల మెషిన్‌గన్ కాల్పులకు గురైనారు. గాయం తగిలినా లెక్కచేయక, భయంకరమైన పెద్దపులివలె విజృంభించాడు. ఆయనవద్ద తుపాకీలో తూటాలు అయిపోయిన సమయంలో ఒక పాక్ సైనికుడు ఆయన వున్న బంకర్ వద్దకు ప్రాకుతూ వెళ్ళగా మోహిందర్ సింగ్ తన తుపాకి చివరతో శత్రువు తలపైన గట్టిగా కొట్టి చంపివేశాడు. ఇంతలో మరొకవైపునుంచి మెషిన్‌గన్ కాల్పులు జరుపగా ఆ గుండ్లు తగిలి శ్రీ సింగ్ వీర మరణం చెందాడు.

పదుగురి కోసం ప్రాణత్యాగం చేసిన వీర యోధుడు

పది మంది ప్రాణాలు కాపాడడంకోసం తన ప్రాణాలు బలి ఇచ్చేవారు లోకంలో ఎంత మంది ఉంటారు? కాని భారత రక్షణ దళాలలో అటువంటి వారున్నారు.

కానిస్టేబుల్ జగత్ సింగ్ సరిహద్దు భద్రతా దళంలో పని చేస్తున్నారు. ఫిరోజ్‌పూర్ రంగంలోని సట్లెజు వంతెన వద్ద కానిస్టేబుల్ జగత్ సింగ్ బృందం ఉన్నది. డిసెంబరు 3న, రాత్రి శత్రు పదాతి దళం భారీ కవచ దళం సహాయంతో ఆకస్మికంగా ఈ బృందంపై దాడి చేసింది శత్రువుల సంఖ్య మన సంఖ్యకంటే చాలా ఎక్కువగావుంది. మనవారిని లొంగిపొమ్మని శత్రువు కోరాడు. అందుకు జగత్ సింగ్ సమ్మతించలేదు ఎదురు నిలిచి కాల్పులు జరిపాడు. కొంత సేపటికి అతనివద్ద మందుగుండు సామగ్రి అయిపోయింది. అయినా నిరాశ చెందక, సట్లెజు నదిలో ఈదుకుంటూ వెళ్ళి, సమీపంలోని సైనిక స్థావరం నుండి మందుగుండు సామగ్రి తెచ్చాడు కొంత సేపటికి అదీ అయిపోయింది. మరల నదిమీద ఈదుకుంటూ వెళ్ళి అతి కష్టంమీద కొద్దిగా మందుగుండు సామగ్రిని తెచ్చాడు. మూడవసారి నదిని దాటటానికి ప్రయత్నించాడు. అతను అలా దాటుతుండగా శత్రువులు ఇరువైపులా కాల్పులు జరపడం వలన చనిపోయాడు

శ్రీ జగత్ సింగ్ వీరమరణం పొందినా, అతని సాహసోపేత చర్యవలన దళంలో పది మంది ప్రాణాలు కాపాడగలిగారు.

మునవార్ తవీ తీరంలో అమర గాథ

డిసెంబరు 8–9 తేదీలలో మునవార్ తవీ నదికి పడమటి గట్టుపై బాహాబాహి యుద్ధం జరిగిన సందర్భాలలో వున్న స్థావరాన్ని వదిలే కంటె తన సైనికులతో సహా అసువు లర్పించడానికే జాట్ రెజిమెంట్‌కు చెందిన మేజర్ సంసిద్ధులైనారు.

యుద్ధంలో గాయపడిన మేజర్‌ను తీసుకొని పోవాలని జవాన్లు ప్రయత్నించారు.

అయితే ఆ మహా వీరుడు ఇలా అన్నాడు.

"నేను మీతో కలిసి జీవించాను మీతోనే నా ఈ స్థావరం దగ్గరే మరణిస్తాను."

ఆ శౌర్యశాలి. పాకిస్తాన్ సైనికదాడులను ప్రతిఘటించారు.

"జై భగవాన్, జాట్ బలవాన్" అంటూ ఆ త్యాగధనుడు యుద్ధ విమాన దాడులతో చివరి వరకు శత్రువుతో పోరాడారు.

మాతృ భూమి కోసం అమరుడైన ఆ మేజర్, ఆయన సైనికులు అసువులర్పించిన తరువాత మాత్రమే శత్రువు స్థావరాన్ని పట్టుకొనగలిగారు.

సాహస కార్యం

బాబానాసక్ రంగంలో పాకిస్తాన్ నిర్మించిన ఎత్తైన ఉక్కు స్తంభాన్ని పేల్చివేయ గలనని తన కమాండర్‌తో పందెం కట్టి డఫేదార్ కుంజన్ నాయర్ గెలిచారు.

డేరా బాబానాసక్ వంతెన పడమటి చివర 110 అడుగుల ఎత్తున శత్రు సైనికులను పసిగట్టడానికి పాకిస్తాన్ ఉక్కు స్తంభాన్ని నిర్మించింది. అది భారత సైనిక దళాలకు తలనొప్పిగా తయారైంది.


ఆ స్తంభాన్ని పేల్చివేసే సవాలును రెజిమెంట్ స్వీకరించింది. కడచిన బుధవారం ఉదయం అందుకు బయలుదేరింది. మొదటి రౌండులోనే 110 అడుగుల ఉక్కు స్తంభాన్ని పేల్చి వేశారు.

విజయం సాధించిన శతఘ్ని నిర్వాహకుడు డఫేదార్ కుంజన్ నాయర్ పందెం గెలిచాడు.

మృత వీరుని తండ్రి ఆదర్శం

ఇటీవల పోరాటంలో మృతిచెందిన పారాచూట్ దళం సెకండ్ లెఫ్టినెంట్ భారత్ మసంద్ తండ్రి శ్రీ గోపాల్ దాస్ మసంద్ దేశ రక్షణకు తన ఇద్దరు కుమారులను కూడా పంపడానికి సంసిద్ధతను తెలియ జేశారు.

"దేశ రక్షణ కృషిలో నా కుమారుడు తన ప్రాణాన్ని కోల్పోయినందుకు గర్విస్తున్నాను" అని ఆయన, తన ఇంటికి సానుభూతి తెలియజేయడానికి వచ్చిన మధ్యప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ భగవత్ సాబుకు చెప్పారు.



డిసెంబరు 3 వ తేదీ రాత్రి విశాఖపట్టణం వద్ద మునిగిపోయిన పాకిస్తాన్ జలాంతర్గామి "ఘాజీ"

వదంతులు: వాటి దుష్ఫలితాలు

పోటూరి శ్రీరాములు

> శాంతి కాలంలో ఎంతటప్పు, మరో
> నిగ్రహం అవసరమో, యుద్ధకాలంలో కూడా
> అంత అవసరమే. మన దేశంలో మతాల
> పోరు, ఇతర అశాంతి పరిస్థితులు కల్పించా
> లనే దురుద్దేశంతో పశ్చిమ పాకిస్తాను
> ప్రభుత్వం, అనుమానాలు, భయాల్ని పుట్టించి
> దానికి ప్రోత్సహించివేసే ప్రయత్నం
> చేస్తుంది. వారు పన్నిన వలల్లో మనం
> చిక్కుకోకూడదు. దేశంలో ఐకమత్యం, ఆదర్శ
> దీక్ష మనం గట్టిగా నిలబెట్టుకోవాలి.
>
> ఇందిరాగాంధీ

వదంతులు వ్యక్తికీ సంఘానికీ కూడా హానిచేకూరుస్తాయి. మనిషి ఆలోచనాశక్తిని వక్రమార్గంలో మళ్ళించడమే వదంతి కారణం. భయం అనేది ప్రబలమైన ఓ మానసిక ఉద్రేకం. అది అందరినీ చీకాకుపరుస్తుంది. వదంతులు మనిషిలో భయాన్ని రేకెత్తించి అతని ఆలోచనల్ని చెడుమార్గం పట్టిస్తాయి. వదంతుల్ని వ్యాపింపజేసేవాళ్ళు బాధ్యతారహితమైన మాటల్ని చెప్పి విద్యాగంధం లేని అమాయకుల మనసుల్లో భయాన్ని బెదురునూ కలిగిస్తుంటారు. తెలివిగల ప్రజలు కూడా సాధారణంగా నిజానిజాల్ని గ్రహించలేక పోతే అటువంటి వార్తలు వినడానికి, అబద్ధాలనే ఆసక్తిగా వినడానికి ఇష్టపడతారు. తగినంతగా ఆలోచించేవాళ్ళు చాలా తక్కువ. అమాయకులైనవారు ఈ వార్తల్ని విని తమకు తోచిన విధంగా చిలవలూ పలవలూ కల్పించుకొని ఆందోళనచెందుతారు. వదంతులు ఒక్కొక్క పర్యాయం అపాయకరమైనవి కూడాను. వదంతులు భయాన్ని ఉత్పాదం చేస్తాయి. ఆ భయం ప్రజల మనస్సుల్లోకి ప్రాకి వారి హృదయాల్లో క్రమక్రమంగా స్థిరంవేసుకుంటుంది. అటువంటి మనస్తత్వం గలవారు తమ నిజజీవితంలో ప్రతి విషయానికీ భయపడి పోతుంటారు. తమ నీడను చూసుకొని తామే జడుసుకుంటుంటారు.

సిపాయిపై వదంతుల ప్రభావం

వదంతుల ప్రభావాన్ని వర్ణిస్తూ ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రవేత్త ఇలా వ్రాశాడు: "యుద్ధసమయంలో ఎప్పుడు ప్రమాదం జరిగినప్పుడూ లేక అపజయాల్ని ఎదుర్కొంటూ ఉన్నప్పుడూ సిపాయిలకు ఒకరకమైన పక్షవాతం వస్తుంది. దీన్ని ఒక విధంగా మానసిక పక్షవాతం అనవచ్చు. దీనివల్ల శరీర భాగాలకు ప్రమాదం రాదుకానీ అవి మామూలుగా పనిచేయలేవు. అలాటి సిపాయిల మనస్తత్వాన్ని పరిశీలించగా వారు కోపం భయానక యుద్ధ దృశ్యాలనూ అక్కడ జరిగే దారుణ హింసాకాండనూ చూసి కొన్ని సమాక్రాంతులలోనూ రేగింది. వారు బయటికి మాత్రం తమ భయాన్ని వెల్లడించరు. తమ తోటివారి ముందు తమ ధైర్యసాహసాల్ని ప్రదర్శించాలని ఆకాంక్ష తమ భయాన్ని అంగీకరించకుండా నిరోధిస్తుంది. ఆ సిపాయిలు తమ వీరత్వాన్ని గురించి సహచరులతో గొప్పలు పలుకుతారు. ఒకసారి యుద్ధ పరిసరాల ముందటనే ఒక ఫిరంగి గుండువచ్చి పేలింది. ఆ శబ్దం వినగానే అతను మూర్ఛపోయాడు. నిజంగా గుండుదెబ్బ తగలకపోయినా భయంచేత అతడు నోరు తెరువలేని అలాగే అచేతనంగా పడిపోయాడు. అతగాడికి భయంకరంగా మానసిక పక్షవాతం వచ్చింది. మానసిక చికిత్సద్వారా అతని మనస్సులో దాగివున్న భయాన్ని తొలగించిన తర్వాత అతని నోరు యధాప్రకారం మాటపడలేదు. ఇలాగే ... భయం అనే మానసిక గ్రంధి మన మనస్సులో అసాధారణ భయాన్ని రేకెత్తిస్తుంది.

వదంతులు అంటురోగాల్లాంటివి

మానసిక వికారాలు కూడా అంటురోగాల్లాంటివి. ... మోసుకపోయే క్రిములు ... మనిషి ఒక్కరిమాత్రంచేతనే ... ఏదో ఒక పార్టీకానీ వర్గంకానీ ... కోడి లేదా ఎవరైనా శత్రువే ఒక ... భయాందోళను వ్యాపింపజేయాలని ఎత్తు వేశాడనుకోండి. ... పత్రికలు మొదలైన ప్రచారసాధనాల ద్వారా ... ద్వారా కనీ అబద్ధపు ప్రచారం చేయడం ప్రారంభిస్తాడు. అటువంటి తప్పుడు వార్తలు సులభంగా మనుష్యుల ఆలోచనల మీద విషపూరితమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. ప్రజల్లో వ్యాపిస్తుంది

అమాయకులూ విచక్షణాజ్ఞానం లేనివారునూ. ఒక్కసారి ఈ అబద్ధపు వార్తలు చెవినబడితే చాలు వారు వాటికి అనేక రంగులు కల్పించు కొని భయభ్రాంతులకు లోనౌతారు. ఈ అసత్యవార్తలు ఒకరినుంచి మరొకరికి, ఒక కుటుంబంనుండి రెండో కుటుంబానికీ, చూస్తుండగానే వీధులూ, నగరాలూ చివరకు దేశం నలువైపులా వ్యాపించిపోతాయి. ఈ అవాంఛనీయమైన కల్పనలు పౌరులహృదయాల్లో నాటుకొని రణరంగంలో పోరాడే సిపాయీల మనోధైర్యాన్ని క్షీణింపజేస్తాయి. వారిని ప్రయోజనశూన్యులుగా చేసివేస్తాయి. ఈ వదంతుల మూలంగా క్షణాలలో పట్టణాలకు పట్టణాలూ నగరాలకు నగరాలూ ఖాళీ అయిపోయి నిర్జనంగా మారిపోతాయి. మనిషిలో సహజంగా వుండే ధైర్యసాహసాలు విక్రమపరాక్రమాలు, కార్యశక్తి నిర్వీర్యమైపోతాయి.

ఈ కారణాల వలనే నేటి అత్యవసర పరిస్థితిలో మనం వదంతులంటే ఎంతో అప్రమత్తతతో వుండాలి. వదంతులు వినటం కానీ, వాటిని అలా అలా ప్రాకేటట్లు చేయడంకాని పనికి రాదు. అటువంటి పుకార్లు ఏమైనా వెర్రితలలు వేయగానే వాటిని త్రుంచివేయాలి. అవి నిరాధారాలని ఋజువుచేయాలి. ప్రజల ధైర్య స్థైర్యాల్ని పెంచే వార్తలను విపులంగా ప్రచారంచేయాలి. విజయం మనదే అన్న భావాన్ని, ఆశనూ కల్గించాలి. సరైన ఆలోచనలను ప్రచారం చేయడంవల్ల ప్రజల్లోవున్న భయమూ, పిరికితనమూ దూరమౌతాయి. అప్పుడే నిజంగా భయంకర పరిస్థితుల్లో చిక్కుకున్నప్పుడు కూడా వారు యే మాత్రం జంకు గొంకూ లేక వాటిని ఎదుర్కోగలుగుతారు.

చరిత్ర తార్కాణం

ఒక వాస్తవాన్ని వ్యాపింపజేయడం ద్వారా ఓడిపోబోతోన్న ఒక దేశం ఆ ఓటమిని గెలుపుక్రింద ఎలా మార్చగలిగిందో ఒక వుదాహరణ చెబుతాను. రెండవ ప్రపంచ యుద్ధంలో ఇంగ్లీషుసేన డంకర్కు రంగంలో జర్మనీవారి ధాటికి నిలబడలేక ఇంగ్లీషు ఛానెల్ని దాటిరాగా ఇంగ్లాండు దేశంలో నలుమూలలా నిరాశా నిస్పృహలు వ్యాపించాయి. అప్పటికే జర్మనీకి వ్యతిరేక దేశాలు యావత్తూ ఇంచుమించుగా అస్త్ర సన్యాసం చేసివేశాయి. ఏ దేశపు సైన్యం కూడా జర్మనీవారి ముందు నిలబడలేక పోయింది. అలాటి సంకట పరిస్థితిలో యింగ్లీషువారు సందిగ్ధావస్థలో పడ్డారు. అప్పుడు బ్రిటన్ ప్రజల్లో పాతుకుపోయిన భయాన్నీ నిరాశనూ తొలగించే ప్రయత్నంచేసి వారి మనస్సుల్లో క్రొత్తగా ఆశాజ్యోతి కలిగించి ఉత్సాహోద్రేకాల్ని రేకెత్తించకపోయే పక్షంలో వారి అపజయం విజయంగా మారేదికాదు.

అట్టి పరిస్థితుల్లో యింగ్లీషువారి హృదయాల్లో ఆశాబీజాల్ని నాటి, ఎట్టి పరిస్థితుల్లోనూ విజయలక్ష్మి తమదేనన్న భావాన్ని కలిగించారు. చిన్న చిన్న యుద్ధాల్లో ఓడినా పెద్దపెద్ద యుద్ధాల్లో ఎప్పుడూ విజయం తమదేనన్న ఒక విశ్వాసాన్ని వ్యాపింపజేశారు. విషాద మేఘాలు అల్లుకున్న నిరాశావాదులంతా ఒక్కసారి ఆశావాదులుగా మారిపోయారు. దానివల్ల కలిగిన మంచి ఫలితం వారు హిట్లరుకు ముందు జోహార్లు అర్పించలేదు. ధైర్యంగా ఎదురొడ్డి నిలచి జర్మనులతో పోరాడసాగారు. బయట పరిస్థితులు గూడా వారి విజయానికి అనుకూలించాయి. ఏ రష్యా అంతవరకూ వారికి బద్ధ శత్రువుగా వుందో అదే వారికి పరమ నేస్తంగా మారి జర్మనీతో పోరాడసాగింది. ఇటు అమెరికా కూడా అండగా నిలబడింది. ఈ విధంగా అపజయం తథ్యం అనుకొన్న దేశానికి విజయం సిద్ధించింది. బైటి సహాయం ఎంతవున్నా మానసిక ధైర్యం లేకపోతే ఇంగ్లాండు జర్మనీని ఎదుర్కోలేక పోయేదే.

ఏ మాటలో మీకు నమ్మకంలేదో సంపూర్ణంగాదేన్ని మీరు విశ్వసింపరో అది యితరులకు ఎప్పుడూ చెప్పకండి. దాన్ని మీరు అంగీకరించనూవద్దు. అలాటి మాట పిరికివాడి హృదయాన్ని ఇట్టే తోడేస్తుంది. దానివల్ల దేశానికి జరిగే కీడు యింతా అంతా కాదు. గోరంతల్ని కొండంతలుగా చేసేవారినీ, తలాతోకాలేని కథల్ని అల్లే వారినీ దరిదాపులకు రానీయకండి. వదంతులు వ్యాపింపజేసి వాటి ద్వారా ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించి వాళ్ళ భయంతో సతమతమౌతుంటే చూస్తూ ఆనందిస్తారు వీళ్ళు.

వదంతుల్ని ప్రచారం చేయడంలో శత్రువుకు కూడా ప్రమేయం వుండవచ్చు. అందుచేత ఒక విషయానికి చిలువలూ పలువలూ అల్లిచెప్పేవారిపై నిఘావుంచండి. యుద్ధకాలంలో ప్రజాహితమైన మాటలే పనికి వస్తాయి. మనిషి ఆలోచనా సరళిలోనే ఒక దృఢమైన విశ్వాస పూరితమైన మార్పుతేవడానికి ప్రయత్నించాలి. మనం అజేయులమనీ శత్రువులను నిర్జించగలమనీ మన శక్తి మీద మనకు అపారమైన నమ్మకాన్ని కలిగించాలి. సంఘ విద్రోహుల మాటల్ని మూటగట్టి ఆవల పెట్టండి. నిజాన్ని వెలికితీసి బైట పెట్టండి.

యుద్ధం వున్నాసరే, లేకున్నాసరే

ఆహార ధాన్యాలు పొదుపుచేయండి

బంగ్లాదేశ్ అడుగుజాడల్లో సింధ్ దేశ్

పీడిత బెంగాల్ ప్రజల ఆశలు ఫలించి, కలలు నిజమై బంగ్లాదేశ్ అవతరించడంతో సింధ్ దేశ్ సాధనోద్యమం శీఘ్రంగా పుంజుకొని బలపడుతున్నది. ఇది అనతికాలంలో ఇస్లామాబాద్ ప్రభుత్వానికి పక్కలో బల్లెం కాగలదని అనుకొంటున్నారు.

స్వపరిపాలనాధికారంతో సింధ్ రాష్ట్రం ఏర్పాటు కావాలన్న కోరికతో ఈ సింధ్ దేశ్ సాధన ఉద్యమం ప్రారంభం అయింది. ఈ రెండు ఉద్యమాలకూ ఇది ఒక్కటే సామ్యం కాదు. ఇంకా మరికొన్ని పోలికలు ఉన్నాయి.

బెంగాలీల లాగానే సింధీలకూడా తమపట్ల వివక్ష చూపడం, తమ సంస్కృతి సర్వనాశనం చేస్తున్నారనీ చాలా కాలంగా ఘోషిస్తున్నారు. కాని వారి గోడు విన్నవారు లేరు, పాకిస్తాన్ పాలక వర్గం, వారిని రాజకీయంగా అణచివేయడం, వారిని అవహేళన చెయ్యడంతో అగ్నిలో ఆజ్యం పోసినట్లు అయింది.

సింధీభాషను నిర్లక్ష్యంచేసి ఆ భాషపట్ల వివక్ష చూపినందువల్ల 1970 సంవత్సరారంభంలో సింధ్‌లోని హైదరాబాదు, కరాచీ, సుక్కూర్, ఇంకా ఇతర అనేక పట్టణాలలో పెద్దఎత్తున అల్లర్లు నిరసన ఉద్యమాలు ప్రారంభం అయ్యాయి. అప్పుడు సైన్యాన్ని పంపించవలసి వచ్చింది. పాఠశాలలు, కళాశాలలూ చాలా కాలం మూసివేశారు.

సింధ్ నాయకులలో కాజీ మహమ్మద్ అక్బర్, హాఫీజ్ ముబారక్ అలీ షా, పఠాన్ ముశీదా మహాజ్ వంటి ప్రముఖులను పాక్ ప్రభుత్వం అదుపులోకి తీసుకొని జైళ్ళలో వేసింది. ప్రజలతో కలిసి దౌర్జన్యాలకు పాల్పడ్డారనీ, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్నారనీ ఆరోపణలు జరిగాయి.

ఇతర భాషా గ్రంథాలనూ, పరుల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలైన శిలాఖండాలనూ దగ్ధపటలం చేయాలనే దురహంకారంతో అక్కడ అనేక దౌర్జన్యాలు జరిగాయి. సింధ్‌లోని హైదరాబాదులో సింధ్ భాషా, సాంస్కృతిక పరిశోధన విభాగానికి చెందిన పెద్ద గ్రంథాలయాన్ని కొందరు దుష్టులు ఉట్టి పుణ్యానికి తగుల పెట్టారు. ఈ సంవత్సరం జనవరిలో వారీ ఘాతుకం చేశారు పోలీసు నివేదికలో కూడా ఇది ఎవరో కావలసి తగులబెట్టిన సంఘటనగా పేర్కొనబడింది. ఒక కిటికీ పగులగొట్టి అందులో నుంచి పెట్రోలులో ముంచిన గుడ్డలు వస్తువులను కాల్చివేసే ఆమ్లం నింపిన సీసాలు, పేలుడు పదార్థాలు లోపలకు విసిరివేసి వాటి సహాయంలో గ్రంథాలయానికి నిప్పు అంటించారు ఫలితంగా ఎన్నిటికీ తీరని తీవ్రనష్టం జరిగిపోయిందని సింధీ అధ్యయన విభాగం అధిపతి గగ్గోలు పడుతూ ప్రకటనలు చేశారు.

జాతీయ కార్యక్రమాలకు సంబంధించిన వివిధ రంగాలలో సింధీలను అణచివేసి, పైకి రానీయకుండా చేసిన సందర్భాలు అనేకం కావడంవల్ల ఈ ఉద్యమం తలయెత్తింది. ఇందుకు ఒక చిన్న ఉదాహరణ చెప్పాలంటే కరాచీ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ గులామ్ ముస్తఫా షా (సింధ్‌కు చెందినవారు) తమ విశ్వవిద్యాలయంలో అనువైన అర్హతలు గల సింధీలను ఉద్యోగాలలో చేర్చుకొన్నందుకుగాను ఆందోళనచేసి ఆయన తమ పదవికి రాజీనామా ఇవ్వమని వచ్చింది. ఇక ఉద్యోగాల విషయంలో 'సెటిల్మెంట్' శాఖ, స్టేట్ బ్యాంకు, కరాచీ అభివృద్ధి వ్యవహారాల శాఖలో ఇలా వివక్ష చూపారని ప్రజలు ఫిర్యాదు చేశారు సైనిక పాలన వ్యవస్థలో పెద్ద పదవుల నధిష్ఠించిన వారు కూడా సింధీలను అసహ్యించుకోవడం, వారి కట్టూ, బొట్టూ చూచి వారి దుస్తులు ధరించేపద్ధతి చూచి బహిరంగంగా అవహేళన చేయ్యడం పరిపాటి అయ్యింది. వాస్తవానికి సింధీలను వారి మాతృ దేశంలోనే విదేశీయులుగా చూడడం, అలా అన్యాయం చెయ్యడం జరిగింది.

జాతీయ పరిపాలనా వ్యవస్థలో, ప్రభుత్వ యంత్రాంగంలో తమకు న్యాయంగా రావలసిన వాటాకూడా దక్కనివ్వడం లేదని ఈ సంవత్సరం జూన్ మాసంలో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ తాలూకు సింధీరాష్ట్ర సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ సంఘం తరపున అనేకమంది ప్రముఖ సింధీ నాయకులు పాక్ పాలక వర్గాన్ని గట్టిగా విమర్శించారు. ఈ కారణాలను పురస్కరించుకొనే సింధీ ప్రముఖ నాయకుడు శ్రీ యూసుఫ్ లుహారీ విద్యార్థుల సమావేశంలో ప్రసంగిస్తూ సింధీ ప్రాంతాన్ని ఇకముందు నుంచి 'సింధీదేశ్' అని వ్యవహరించాలని కోరారు. ఈ సంవత్సరం మార్చి నెలలో అఖిల సింధ్ న్యాయవాదుల సమావేశం సైనికపాలన వెంటనే రద్దు కావాలనీ, ప్రభుత్వాధికారం ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులకు వెంటనే బదలాయించాలనీ, ఈ విషయంలో ప్రభుత్వవైఖరి చాలా గర్హనీయంగా ఉన్నదనీ తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మానంలో బంగ్లాదేశ్ పట్ల సానుభూతి, మద్దతు వెల్లడిచేయడం జరిగింది.

సింధు నదీ జలాలలోని పంపిణీ విషయంలో సింధ్ పశ్చిమ పంజాబుల మధ్య కావేషాలు పెరిగి పరాకాష్టకు చేరుకొన్నాయి. పశ్చిమ పంజాబులో ఈ నదిని కలుపుకొంటూ ఈ కాలువల త్రవ్వకం అన్యాయమని కేంద్రానికి సింధ్ నిరసన తెలియజేసింది. ఈ కాలువల త్రివ్వకం ఫలితంగా సింధ్‌లో 8,00,000 హెక్టార్ల పంట భూములు పాడైపోయి బంజరు భూములుగా మారిపోగలవని ప్రజలు భయపడిపోయారు, కాని సింధ్ నాయకులు ఎంత గోలపెట్టినా వారిమాట లెక్కచేయక కాలువల త్రవ్వకం, తద్వారా సింధు నదీ జలాల అపహరణ కొనసాగుతూనే ఉన్నది.

ఆత్మగౌరవముగల అనేకమంది సింధీ నాయకులు స్వదేశం విడిచి పోవలసి వచ్చింది. వీరిలో ఒకరు సింధ్ యునైటెడ్ ఫ్రంట్ అనే పార్టీ అధ్యక్షులు శ్రీ జి. ఎమ్. సయ్యద్. ఆయన అఫ్గనిస్థానంలో స్థిరపడాలని నిర్ణయించుకొన్నారు. ఈ యేడాది మార్చి మాసారంభంలో పాకిస్తాను విడిచిపెట్టి హజ్ యాత్రకు వెళ్లారు; కాని ఆ తర్వాత పాకిస్తానులో రాజకీయ పరిస్థితి మెరుగుపడి, ప్రజాప్రతినిధులకు పాలనాధికారం చేతిక్కేదాకా అక్కడికి తిరిగి వెళ్లకూడదని నిర్ణయించుకొన్నారు.

అగ్రశ్రేణి జాతీయ నాయకులలో ఇలా ప్రవాసం పోయి అఫ్గనిస్తానులో తలదాచుకొన్న వారిలో శ్రీ సయ్యద్ రెండవవారు. సరిహద్దు గాంధీ ఖాను అబ్దుల్ గఫర్ ఖాను ఇలా వెళ్లిన మొదటి వ్యక్తి. ఆయన అనేక సంవత్సరాలుగా అఫ్గనిస్తానులో ప్రవాసం ఉంటున్నారు.

బలూచీస్తానులో కూడా పూర్తి స్వపరిపాలనాధికారాలు గల రాష్ట్రం ఏర్పాటు కావాలని ఖాను అబ్దుల్ సమద్ ఖాన్ నాయకత్వాన ఇప్పుడు క్రొత్త ఉద్యమం ఒకటి ప్రారంభం అయింది. ఆయన అనుయాయులు ఖారాన్, మాక్రాన్, కాలత్, అస్బెల్లా ప్రాంతాలుకూడా కలుపుకొని స్వపరిపాలనాధికారాలతో బలూచీస్తాను ఏర్పాటు కావాలని కోరుతున్నారు. వారి కోరికలను కాలరాచి వారి నాయకుడైన ఖాను అబ్దుల్ సమద్ ఖానును పాక్ పాలకులు కారాగారంలో బంధించారు. ★

వేదవాక్కు

కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి

గీ॥ హితులనుండి అభయము మాకెసగుగాక
అరులనుండియు నభయంబు నెరయుగాక
పరిచితులనుండి అభయంబు పరగుగాక
అభయమపరిచితులనుండి యగునుగాక

పగలు రేయిని నభయంబు నెగడుగాక
అన్నిదిక్కులు మిత్రంబు లగునుగాక
మిత్రదృష్టిని ప్రాణులు మెలగుగాక
ఎల్లరను మిత్రులటుగనియెదముగాక

ముదమున బరస్పరము మెదలెదముగాక;
ఐన, నెవడేని శత్రుత్వ మూనెనేని
ద్రోహమును జేసెనేని దురూహతోడ
తెగడెనేని ముప్పును మాకు దెచ్చెనేని

మదమడచి వారి నణచి వేసెదముగాక;
సత్క్రియాబాధకులు దుష్టశత్రుగణము
మాకు నాఘాత మొసరింప మసలిరేని
వీరతన్ శూరతన్ వారి విరిచి అదిమి

తరిగివేయుట ముఖ్యకర్తవ్యమగును
యుద్ధమందు పరాక్రమ ముగ్రమగుచు
పొంగు మాముందు దిక్కులు మోకరిల్లు
శత్రుసేనల నురుమాడి సాహసమున

విజయ కాహళి మ్రోయించి పృథుశక్తి
మాతృభూమి సంకటముల మాన్పకొరకు
ఎన్ని కష్టములైన సహించి వీర
రణమొనర్తుము విజయసారథుల మగుచు

వేదవాక్కిది యెపుడేని వితథమగునె?

ఆయుధాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి

గడచిన ఐదు సంవత్సరాల కాలంలో మనదేశంలో దేశ రక్షణకు అవసరమయిన ఆధునిక ఆయుధ సామగ్రి ఉత్పత్తి బాగా పెరిగింది. ఈ విషయంలో మన కాళ్ళమీద మనం నిలబడాలి అనే ఆదర్శంతో కృషి జరుగుతున్నది. చిన్నతరహా ఆయుధాలు, వాటికి కావలసిన మందుగుండు సామగ్రి ఉత్పత్తిలో పూర్తి స్వయం సమృద్ధి సాధించబడింది.

సైనికులకు కావలసిన 'వైజయంత' టాంకులు, తుపాకులు, శతఘ్నులు, నౌకాదళానికి అవసరమయిన హెలీకాప్టర్లు, మిసిలీలు అమర్చిన ఫ్రిగేట్ నౌకలు, వైమానిక దళానికి అవసరమయిన మిగ్ విమానాలు, హిందూస్తాన్ జెట్ ఫైటర్లు, రివాణా విమానాలు, అలోటీ హెలికాప్టర్లు మొదలగు అత్యాధునిక ఆయుధ సామగ్రి మనదేశ రక్షణ ఉత్పత్తి కర్మాగారాలలో ఇప్పుడు తయారవుతున్నది.

ఈ అధునిక ఆయుధాలలో కూడా మన దేశంలో దొరికే పదార్థాలనే వాడకంచేసే కృషి అంతకంతకు ఎక్కువవుతున్నది. అనతికాలంలోనే ప్రముఖమయిన ఈ రంగంలో మనం స్వయం సమృద్ధి సాధించగలుగుతాం. కొన్ని నెలల క్రితమే హైదరాబాదులో భారత్ డైనమిక్స్ లిమిటెట్ అనే సంస్థ ఏర్పడింది. దీనిలో టాంకులను ధ్వంసం చేసే మిసిలీల వుత్పత్తి జరుగుతుంది.

రక్షణ మంత్రిత్వశాఖ అధ్వర్యాన ఇప్పుడు 30 ఆయుధోత్పత్తి కర్మాగారాలు, ఎనిమిది పబ్లిక్ రంగ సంస్థలు పనిచేస్తున్నాయి. 1970–71 లో వీటిలో రూ. 250 కోట్ల విలువగల ఆయుధ సామగ్రి ఉత్పత్తి అయింది. ఈయేడు ఈ మొత్తం రూ. 300 కోట్ల వరకు ఉండవచ్చు.

మన సైన్యానికి కావలసిన ఆయుధ సామగ్రి, మందుగుండు సామగ్రి చాలావరకు ఈ ఆయుధోత్పత్తి కర్మాగారాలలో ఉత్పత్తి అవుతుంది. ఈ ఆయుధాలలో ప్రసిద్ధిచెందిన ఇషాపూర్ సెమి ఆటోమాటిక్ రైఫిళ్ళు, పర్వత ప్రాంతాలకోసం కొత్తగా తయారయిన తుపాకులు, స్టెన్‌గన్లకంటే మేలయిన కొత్తరకం కార్బయిన్లు, బాగాదూరం కాల్చగల శతఘ్నులు, టాంకుల విధ్వంసనకు ఉపయోగపడే 106 మి॥మీ॥ ఆర్. సి. ఎల్. తుపాకులు, వాటికి సంబంధించిన మందుగుండు సామగ్రి మొదలగునవి ఉన్నవి. వైజయంత టాంకుకు అమర్చే 105 మి॥మీ॥ తుపాకులుకూడా ఇక్కడ వుత్పత్తి అవుతున్నవి. ఇంకా 81 మి॥మీ॥ శతఘ్ని బాంబులు, ఎగిరే మందు పాతరలు, జలాంతర్గామి విధ్వంసన సామాగ్రి, కృప్‌మన్ బ్రిడ్జింగు సామగ్రి మొదలగు ఆయుధ సామగ్రి కూడా ఇప్పుడు వీటిలో తయారవుతున్నది. 1969–70 లో మనుష్యలను దింపే పారాచూట్ల తయారీ ప్రారంభమయింది. బ్రేక్ పారాచూట్ల ఉత్పత్తికి కృషి జరుగుతున్నది.

కొన్ని ప్రత్యేక తరహా టాంకులకు, ఫీల్డు గన్నులకు కావలసిన మందు గుండు సామగ్రి ఉత్పత్తి, బ్రాండు మోర్టారు బాంబుల వుత్పత్తికి కావలసిన యంత్రాల స్థాపన జరిగింది. మిసిలీకి సంబంధించిన కొన్ని దృశ్య పరికరాలు మొదటిసారిగా మనదేశంలో వుత్పత్తి చేసుకొన్నాం.

మూడు టన్నుల, ఒక టన్ను బరువుగల ఆధునిక గస్తీ వాహనాలకి జబల్‌పూర్‌లో ఒక నిర్మాణాగారం ఏర్పాటు చేశారు. ఇక్కడ వుత్పత్తి ప్రారంభమయింది. వైజయంత టాంకుల ఉత్పత్తి క్రమంగా అధికమవుతున్నది. ఈ టాంకు విలువలో 60 శాతంవరకు దేశంలో లభ్యమయ్యే సామగ్రినే వాడుతున్నారు. దీనిలో అమర్చిన ఆయుధాలన్నీ మనదేశంలో తయారయినవి. వచ్చే రెండు మూడు యేళ్ళలో దాదాపు 85 శాతంవరకు మన దేశంలో లభ్యమయ్యే సామగ్రితోనే ఈ టాంకు నిర్మాణం జరుగుతుంది.

ఆవడి ఫాక్టరీలో కొత్త రకాల ఉత్పత్తి జరుగుతూవున్నది. సాయుధమయిన రికవరీ వాహనాలను ఇప్పుడు ఇక్కడ తయారు చేస్తున్నారు. వీటిని పూర్తిగా భారతీయ సాంకేతిక పరిజ్ఞానంతోనే తయారు చేస్తున్నారు.

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థలో జెట్ ఫైటర్లు, హెచ్. ఎఫ్–24 విమానాలు మిగ్ 21 విమానాలు నాట్ విమానాలు, జెట్ ట్రెయినరు విమానాలు, హెచ్ జె టి–16 విమానాలు, అలోటి హెలికాప్టర్లు, రివాణా విమానాలు తయారవుతున్నవి. తేలిక రకం విమానాలు, హెలికాప్టర్లు ఉత్పత్తి చేయటానికి బెంగుళూరులో ప్రత్యేకంగా మరొక ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారు. ఎస్. ఎ–316 అనే కొత్తరకం హెలికాప్టర్ల ఉత్పత్తికి కృషి జరుగుతున్నది. ఎక్కువగా దెబ్బతీయడానికి పనికివచ్చే కొత్తరకం మిగ్ విమానం కూడా తయారుచేయడానికి ప్రయత్నం జరుగుతున్నది. విమానాలకు పనికి వచ్చే విడి భాగాలు పరికరాలు ఇప్పుడు దిగుమతి చేసుకుంటున్నాం. 1972 చివరకు వీటని కూడా లక్నోలో ఉత్పత్తి చేయడం ప్రారంభమవుతుంది.

మన సాయుధ సైనిక దళాలకు అవసరమయ్యే ఆధునికమయిన ఎలక్ట్రాన్ పరికరాల ఉత్పత్తి భారత్ ఎలక్ట్రానిక్ సంస్థలో జరుగుతున్నది. సైన్యం ఉపయోగించే కమ్యూనికేషన్ పరికరాలు చాలావరకు ఈ సంస్థ తయారుచేస్తుంది. ఘజియాబాద్‌లో రాడార్, మైక్రోవేవ్ సామాగ్రి వుత్పత్తి కోసం ఒక కొత్త ఫ్యాక్టరీ నిర్మాణంలో వుంది. ఇక్కడ 1973 లో వుత్పత్తి ప్రారంభమవుతుంది.

బొంబాయిలోని మజగాన్ డాక్‌లో లీడర్ యుద్ధనౌకల నిర్మాణం కొనసాగుతున్నది. ఇది ఆధునికమయిన యుద్ధనౌక. ఈరకం మొదటి నౌక 'నీలగిరి' త్వరలోనే జలాలలో ప్రవేశిస్తుంది. రెండవ యుద్ధ నౌక, మూడవ యుద్ధ నౌక కూడా నిర్మాణంలో వున్నవి. ఈ నౌకలో మిసిలీలు, హెలికాప్టర్లు అమర్చి, విమాన విధ్వంసక, జలాంతర్గామి విధ్వంసక ప్రక్రియలకు వీటిని ఉపయోగిస్తారు.

సంక్రాంతి సంభ్రమం

--కల్యాణసింగ్

శంకర భగవానుడు తన వాహన మైన బసవన్నను పిలిచి ఒక సందేశం ఇచ్చి భూలోకానికి పంపించాడు. "అబ్బీ, ప్రతిరోజూ అభ్యంగనం చేయమనీ నెలకొకసారి భోజనం చేయమనీ ఆ లోకంలో వాళ్లకు నా ఆజ్ఞగా చెప్పిరా" అని పంపించాడు. బసవన్న వినిపించుకోవడంలోనే పొరపాటు జరిగిందో లేకపోతే కైలాసంనుంచి భూలోకానికి వచ్చే లోపల అతని జ్ఞాపక శక్తిలో లోపమే కలిగిందో, ఏమైతేనేమి శంకరుని సందేశం తెలియ జెప్పడంలో తారుమారై పోయింది. "మీరు ప్రతిదినమూ భోజనం చేయాలి, నెలకొకసారి తలంటుకోవాలి. ఇది శివుని ఆజ్ఞ," అన్నాడు బసవన్న. ఆ సంగతి తెలిసిన పరమేశ్వరుడు బసవేశ్వరుని మీద ఆగ్రహించాడు. ప్రతి దినమూ భోజనం చేయాలంటే ఎంత ఆహారం కావలసి వస్తుంది. అందుచేత నువ్వు భూలోకానికి వెళ్ళి ఏరువాక (ఆషాఢ శుద్ధ పూర్ణిమి)నాడు పొలాలు దున్నడం ప్రారంభించి సరిపడినంత పంట మకర సంక్రాంతి నాటికి సిద్ధపడేటట్టు మానవులకు సహాయపడు. నువ్వు చేసిన పొరపాటుకు ఇది శిక్ష అన్నాడు సాంబశివుడు.

బసవన్న చేసిన పొరపాటునకు అతనికే కాదు మానవులందరికీ ఎంతో శ్రమ కలిగింది. నెల కొకసారి భోజనం అయితే అంత శ్రమ ఉండేది కాదు. ప్రతి దినమూ భోజనం చేయ వలసి రావడంతో విపరీతంగా కృషి చేయ వలసి వచ్చింది. కృషి అంటే వ్యవసాయం. ఆ రెండు శబ్దాలకూ ప్రయత్నం అని అర్థం. మానవ జాతి మనుగడకు ఆహారోత్పత్తి మొట్టమొదటిదీ, అన్నిటికంటె ముఖ్యమైనదీ ఐన ప్రయత్నం అయింది. అందుకనే వ్యవసాయం అంటే ఆహారోత్పత్తికి అవసరమైన వ్యవసాయం (ప్రయత్నం) అనే అర్థం రూఢి ఐపోయింది.

బసవన్నతో పాటు మనుష్యులు కూడా చాలా పాటు పడవలసి వచ్చింది. బసవన్న పొలం దున్నులాడు. సరే ఇల్లు అలకగానే పండుగ కాదు అన్నట్టు భూమి దున్నినంత మాత్రం చేత పంట పండదు కదా. వానలో నాని ఎండలో చెమటోడ్చి పగలంతా కష్టపడి పైరు పంటకు రావడానికి వచ్చిన తరవాత కోసి గాదెలలో చేర్చేవరకూ రైతు పడవలసిన శ్రమ ఇంతా అంతా కాదు.

ఏరువాక పూర్ణిమకు దుక్కి ప్రారంభించి మకర సంక్రాంతికి నూర్పిడి అయ్యే వరకూ ప్రతి రోజూ రైతుకు వ్రతమే. అన్నం బహుకుర్వీత తద్వ్రతమ్ అని ఘోషించారు మన పూర్వులు. పంట ఇంటికి చేరగానే వ్రతం పూర్తి అయినట్టు. అందుచేత వ్రతం ముగిసి పారణం చేసే మహా పర్వదినం మకర సంక్రాంతి.

బసవన్న చేసిన పొరపాటు ఫలితంగా ఇన్ని పాట్లు పడవలసి వచ్చింది. జరిగి పోయిన దేదో జరిగిపోయింది. పాపం మనతో పాటు అతడు కూడా ఒళ్లు వంచి పని చేశాడు కదా. అందుకనే అతనికీ అతని సంతతికీ కృతజ్ఞత తెలియజేస్తూ మనం కనుమునాడు పశువుల పండుగ ఉత్సాహంతో జరుపుకొంటాం.

శివుడు బసవన్న ద్వారా మనుష్యులకు తెలియజేసిన విధులు రెండు—స్నానమూ, భోజనమూ. ఐతే వాట తరుచుదనం మాత్రం తారుమారయింది. దక్షిణాదిని సంక్రాంతి ప్రధానంగా భోజనాల పండుగ అయితే ఉత్తరాదిని ఇది ముఖ్యంగా స్నానాల పండుగ అయింది. ఉత్తర ప్రదేశ్‌లో త్రివేణి సంగమ స్నానమూ వంగ దేశంలో హుగ్లీనది సముద్ర సంగమం అయ్యేచోట గంగా సాగర స్నానమూ మకర సంక్రాంతినాడు ప్రసిద్ధమయ్యాయి.

మకర సంక్రాంతి పంటల పండుగ కదా. అది సూర్యునికి సంబంధించిన పండుగ కూడా. ఎందుకంటే పంటలకూ, సూర్యునికీ దగ్గర సంబంధం ఉంది. ఉత్తరాయణంలో సూర్యుడు నీటిని భూమి నుంచి ఆవిరిగా మార్చి మేఘోత్పత్తికి కారకుడవు తున్నాడు. మేఘాలవల్ల వర్షం, వర్షంవల్ల పంటలు పండుతాయి. ఉత్తరాయణంలో సూర్యుని ద్వారా ఆకాశంలోనికి పోయిన జలం దక్షిణాయనంలో రస రూపంగా, అన్న రూపంగా భూమిలో ప్రవేశిస్తుంది. అన్నం సూర్యాంశమని చెప్పబడుతూ ఉంది.

అన్నం సూర్య ప్రసాదం అని మనకు మహా భారతం వల్ల తెలుస్తూ ఉంది. ధర్మరాజు జూదంలో ఓడిపోయి అరణ్యానికి బయలు దేరాడు. నగరవాసులంతా ఆయన వెంట బయలు దేరారు. ఆయన కోరికను మన్నించి చాలా మంది నిలిచిపోయారు. కాని శనకాది మునులూ, బ్రాహ్మణులూ ఎంతో మంది ఆయన వెంట సాగిపోయారు. వారందరికీ ఆహారం లభించక ఉపవాసం చేయ వలసి వచ్చింది. ధర్మరాజు తన పురోహితుడు ధౌమ్యుని సంప్ర తించాడు. ఆయన ఇలా ఉపదేశించాడు : "యుధిష్ఠిరా, సూర్య భగవానుడే క్షుధాపీడితులకు అన్నం ప్రసాదించి వారి క్లేశాన్ని దూరం చేస్తున్నాడు. పూర్వ కాలంలో కార్త వీర్యార్జునుడు, వైన్యుడు, పృథువు, నహుషుడు మొదలైన చక్రవర్తులు సూర్యారాధనంవల్ల ప్రజల ఆకలి బాధను తొలగించారు. ధౌమ్యుడు యుధిష్ఠిరునికి సూర్యాష్టోత్తర శతనామం ఉపదేశించాడు. ఉపాసనా ఫలితంగా సూర్యుడు ప్రత్యక్షమయ్యాడు. ఒక అక్షయ పాత్రను ధర్మరాజునకు అనుగ్రహించాడు. ద్రౌపది ఉపవాస ముండి ఈ పాత్ర నుంచి వడ్డిస్తూ ఉంటే ఎన్ని వేల మందికైనా ఇష్ట మృష్టాన్నాలు లభించేవి. చివర ద్రౌపది భోజనం చేసిన తరవాత మాత్రం ఆనాటికి ఇక అక్షయ పాత్ర నిండు కొంటుంది.

సంక్రాంతినాటి సంకల్పం సూర్యపరంగా చెప్ప బడింది.

మకర సంక్రాంతి హేమంత ఋతువులో వస్తుంది. లోకులు చలిలో ఉహుహూ అని వణకే కాలం అది. వాతం ప్రకోపించే

తరువాయి 37వ పేజీలో

వెనుకబడిన తరగతులు ప్రత్యేక హక్కులు

శ్రీ జె. వీరాస్వామి

వెనుకబడిన తరగతుల ప్రత్యేక హక్కులను గురించి పరిశీలించే ముందు వెనుకబడిన తరగతులు అంటే ఎవరు? అనే ముఖ్యమైన ప్రశ్న ఉత్పన్నమౌతుంది. భారత దేశంలో వెనుకబడిన తరగతులవారు. మూడు తెగలుగా విభజింపబడ్డారు, షెడ్యూలు కులాలు. షెడ్యూలు జాతులు, తదితర వెనుకబడిన తరగతులను, వెనుకబడిన తరగతులని చెప్పుకొందాము. షెడ్యూలు కులాలు, షెడ్యూలుజాతులయొక్క జాబితానుఅఖిల భారతస్థాయిలో, భారత ప్రభుత్వం ఆమోదించింది. ఆసేతు హిమాచల పర్యంతం భారత దేశంలో ఆ కులాలు,జాతులవారు ఎక్కడ నివసిస్తున్నప్పటికి వారిని, ఆ జాబితాలలో చేర్చడం జరిగింది. ఇప్పుడు అమలులో ఉన్న ఈ జాబితాలను, తిరిగి పరిశీలించి యోగ్యతగల మరికొన్ని కులాలను జాతులనుచేర్చడానికినీ, యోగ్యతలేని కులాలను,జాతులను తొలగించదానికినీ వీలుగా ఒక బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్ట బడింది. ఆ బిల్లును, సంయుక్త కమిటీ పరిశీలించి, తమ నివేదికను పార్లమెంటుకు సమర్పించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆ బిల్లు, దానిపై నివేదిక ప్రాతిపదికగా క్రొత్తసవరణ శాసనం పార్లమెంటు రూపొందించవచ్చు.

ఇకపోతే వెనుకబడిన తరగతులు ఎవరు? వారిని ఎట్లా నిర్ణయించాలి అనే సమస్య వచ్చినప్పుడు, అది కొంచెం చిక్కు ప్రశ్నగానే కనబడుతోంది. వెనుకబడిన తరగతుల జాబితా ఎవరు రూపొందించాలి? కేంద్రమా? రాష్ట్ర ప్రభుత్వాలా? ఈ పశ్నలకు సంబంధించిన సమాచారం, భారత రాజ్యాంగంలో ఎక్కడా కనుపించదు. అయితే ఒక విషయం మాత్రం మనకు తెలుసు, 1953 లో రాజ్యాంగంలోని 341 వ అనుచ్ఛేదము మేరకు, శ్రీకాకా కలేల్కర్ అధ్యక్షతన, భారత అధ్యక్షులు, వెనుకబడిన తరగతుల కమిషను ఒకటి ఏర్పాటు చేశారు. ఈ కమిషను వారు 1955 వ సంవత్సరంలో తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు, వెనుకబడిన తరగతులకు సంబంధించి నంతవరకూ, ఈ కమిషను నివేదిక చాలా ముఖ్యమైంది. ఎందుచేతనంటే షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు మినహాయించి వెనుకబడిన తరగతులను ఏ ప్రాతిపదికపై నిర్ణయించాలి అనే విషయంలో ప్రమాణములు నిర్ధారణ చెయ్యడమే, ఈ కమిషను ఏర్పాటు చేయడంలో ముఖ్యోద్దేశం. కాని, ఈ కమిషను భారత దేశం అంతా పర్యటించినప్పటికి, దురదృష్టవశాత్తు స్పష్టమైన ప్రమాణాలను నిర్ణయించలేక పోయింది. సభ్యులు, విభిన్న అభిప్రాయాలు వెలిబుచ్చినప్పటికి హీనమైన సాంఘిక స్థితిగతులే వెనుకబడినతనానికి ముఖ్య ప్రమాణమని కమిషనులోనిఅధికసంఖ్యాక సభ్యులు అంగీకరించారు. ఇదిగాక, విద్య విషయములో వెనుకబడి ఉండడం, వ్యాపార పారిశ్రామిక రంగాలలో, తగినంత ప్రాతినిధ్యం లేకపోవడం, భూమిపై స్వామ్యపు హక్కులేకుండా, కౌలు వ్యవసాయం చేయడం గిట్టుబాటుకాని చిన్న చిన్న భూకమతాలు కలిగి ఉండడం, అనేవి కూడా వెనుకబడిన తనానికి ప్రమాణాలుగా తీసుకోవాలని, కమిషను తమ నివేదికలో పేర్కొంది. స్త్రీలనందరను వెనుకబడిన తరగతికి చెందిన వారిగా, కమిషను పరిగణించింది. వారు సూచించిన ప్రమాణాల ప్రకారం, 2,399 కులాలను, వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలని నివేదికలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వారు కమిషను నివేదిక పరిశీలించి, సమసమాజ నిర్మాణానికి, వర్ణవ్యవస్థ పెద్ద గొడ్డలి పెట్టుగా పరిణమించిందనీ, నివేదికలో సూచించినట్లు కుల ప్రాతి పదికపై వెనుకబడిన తరగతులను నిర్ణయిస్తే, కులతత్వం శాశ్వత రూపం దాల్చే ప్రమాదం ఉందనీ, కమిషను నిర్ణయించిన ప్రమాణం, ఆచరణ యోగ్యంగా లేదనీ, వాటిని అమలుపరచిన పక్షంలో కొన్ని కులాలవారు తప్ప, భారత దేశంలో అధిక జనాభాను, వెనుకబడినవారుగా నిర్ణయించవలసి ఉంటుందని భావించారు. అందుచేత, ఆచరణీయమైన ప్రమాణాలు కనుగొనే వరకూ, పరిస్థితుల ననుసరించి ప్రభుత్వ సహాయం అవసరమని తోచిన ప్రజలకు సహాయపడవలసిందనీ, రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీని ననుసరించి, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, తాము అనుసరిస్తున్న వెనుకబడిన తరగతుల జాబితాలను, కొన్ని మార్పులు, చేర్పులతో పాటిస్తూవచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పద్ధతి అనుసరింపబడ్డది. కాని కొత్త జాబితాలు ప్రచురించినప్పుడు, ముఖ్యంగా వృత్తి కళాశాలల్లో ప్రవేశం సంపాదించుకొనే సందర్భములలో, జాబితాలను న్యాయస్థానాలలో సవాలు చేయడం జరిగింది. తయారు

జేసిన జాబితాలు చెల్లనేరవని మూడు పర్యాయాలు న్యాయస్థానాల వారు తీర్పుచెప్పారు. ఈ లోపాన్ని సవరించే ప్రయత్నంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, 1968 వ సంవత్సరంలో వెనుకబడిన తరగతుల కమిషను నొకదానిని రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసింది. ఈ కమిషను రాష్ట్రవ్యాప్తంగా సమాచారం సేకరించి, తమ నివేదిక తయారు చేసింది. ప్రభుత్వం ఆమోదించిన వెనుకబడిన తరగతుల జాబితాను 1970 లో ప్రకటించింది. దీనినికూడా న్యాయస్థానంలో సవాలు చేయగా, జాబితా రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా లేదని కొట్టివేయబడింది. జాబితా చెల్లదని నిర్ణయించడానికి ముఖ్యంగా ఈ క్రింది కారణాలు చూపబడ్డాయి.

(1) 1921, 1931 నాటి జనాభా లెక్కలు ప్రాతిపదికగా తీసుకొని, జనాభా అభివృద్ధి రేటు ద్వారా వివిధకులాల జనాభా సంఖ్యను నిర్ధారణచేయడం సరియైన పద్ధతికాజాలదు. కొన్ని కులాలవారు మరియొక రాష్ట్రానికి తరలిపోయి ఉండవచ్చును.

(2) వెనుకబడిన కులాలలో కుటుంబ ఆదాయం లెక్కలోనికి తీసుకొనక పోవడం న్యాయ సమ్మతంకాదు.

(3) విద్యార్హతలలో ప్రాతినిధ్యం నిర్ణయించేముందు పై తరగతులలో సంఖ్యలోనికి తీసుకొని, క్రింది తరగతులలో సంఖ్య పరిగణించకపోవడం, సరియైన పద్ధతికాదు.

(4) వెనుకబడిన తరగతుల జాబితాలో చూపిన చాలా కులాలు, వాస్తవంగా వెనుకబడినవికావు, వారి వెనుకబడిన తనం షెడ్యూలు కులాలు, లేదా జాతులయొక్క వెనుకబడిన తనంతో పోల్చేవిధంగాలేదు.

(5) వెనుకబడిన తరగతులను నాలుగు వర్గాలుగా విభజించడం రాజ్యాంగ సమ్మతముకాదు.

(6) వెనుకబడిన తనాన్ని నిర్ణయించడానికి కులాన్ని మాత్రమే ఆధారంగా తీసుకోవాలని కమీషను భావించింది. ఇది న్యాయస్థానాల తీర్పులకు ఎంతమాత్రం అనుగుణంగాలేదు.

(7) 25 శాతము సీట్లు ప్రత్యేకించే సందర్భంలో బహిరంగ పోటీలో వెను బడిన తరగతుల వారికివచ్చిన సీట్ల సంఖ్యను మినహాయించక పోవడం న్యాయ సమ్మతంకాదు.

ప్రభుత్వం వెనుకబడిన తరగతులవారికి ఎంత సహాయము చేయాలని కృత నిశ్చయంతో ఉన్నప్పటికి, పైన ఉదహరించిన ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానపు తీర్పువల్ల లక్ష్యసాధనలో సఫలీకృతం కాలేక పోయింది, ఈ తీర్పును సవాలుచేస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలువేసింది,అప్పీలుపై విచారణ జరిగినతర్వాత తీర్పు చెప్పవలసివుంది. పర్యవసానం ఎట్లాఉంటుదో, ఇప్పుడు మనమెవ్వరం చెప్పలేము, ఊహించలేముకూండా. రాజ్యాంగ బద్ధమైన చర్యలు, ఈ విధంగా ఉండగా వెనుకబడిన తరగతులకు సహాయంచేయడానికి వీలుండేటట్లుగా రాజ్యాంగాన్ని సవరించాలని ఆందోళన ఒకటి మన రాష్ట్రంలో బయలుదేరింది.

దీనిపై, గౌరవ సభ్యులు బడ్జెట్టు సమావేశంలో తీవ్రఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కోరిక ననుసరించి, సెప్టెంబరు రెండవ వారంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన పరిషత్తు విడివిడిగా ఒకే తీర్మానాన్ని ఆమోదించారు. రాజ్యాంగంలోని 366 వ అనుచ్ఛేదాన్ని సవరించి "అందులో సాంఘికంగాను, విద్యా విషయంగాను వెనుక బడిన పౌరులు'' అనే దానిని స్పష్టంగా ప్రమాణ బద్ధంగా నిర్వచించి, 15, 16 అనుచ్ఛేదాలలో ఉదహరించిన సహాయాలు పొందడానికి వీలు కలుగజేయాలని, లేదా భారత అధ్యక్షునికే వెనుకబడిన తరగతుల జాబితాను ప్రకటించే హక్కు ఇస్తూ, అట్టి జాబితాను సవరించే హక్కు పార్లమెంటుకు సంక్రమింపజేస్తూ, న్యాయస్థానాలలో ఆ జాబితాను సవాలు చేయడానికి వీలులేకుండా, పరిరక్షించాలని శాసనమండలి ఈ తీర్మానంలో కోరింది. కేంద్ర పార్లమెంటు, తీర్మానాన్ని పరిశీలించి, రాజ్యాంగానికి తగిన సవరణ తీసుకొని వచ్చినట్లయితే వెనుకబడిన తరగతులవారికి, ఇతోధిక సహాయంచేయడానికి, ప్రభుత్వాలకు వీలౌతుంది. ఈ తీర్మానం మంచి తరుణంలో ఆమోదింప బడింది. ఎందుచేత నంటే, రాజ్యాంగం 24, 25వ సవరణలు ప్రగతికి నిరోధంగా ఉన్న చర్యలను అధిగమించడానికే ఉద్దేశింపబడ్డవి. పీడిత ప్రజానీకాన్ని పునరుద్ధరించే రాజ్యాంగ లక్ష్యాలు అమలుజరిపే విధానంలో కలిగే ఇబ్బందులు తొలగించడానికి పై సవరణలు తేబడ్డాయి. నూతనమైన ఈ పరిణామ చరిత్రలో భాగంగానే, ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి ఆమోదించిన తీర్మానం పరిగణింపబడాలి. ఈ చర్యకు ఇటు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమూ, అటు ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలీ అభినందనీయులే! దీనిపై కేంద్ర ప్రభుత్వమూ, పార్లమెంటూ ఏలాంటిచర్య తీసుకోదలచాయో, మెలకువతో వేచిచూద్దాం.

ప్రత్యేక హక్కులు

వెనుకబడిన తరగతుల పరిగణన, వారిని నిర్ణయించడంలో గల సాధకబాధకాలు పరిశీలించిన తర్వాత ప్రత్యేక హక్కులను గురించి ప్రస్తావించవలసి ఉంటుంది. ప్రత్యేక హక్కులు అనడం కంటే, ప్రత్యేక రక్షణలు అంటే బాగుంటుందని నా అభిప్రాయం. రాజ్యాంగ సమ్మతమైన రక్షణలు వెనుకబడిన తరగతుల వారికి ప్రస్తుత పరిస్థితులలో అవసరమా? లేదా? అనేది చర్చనీయాంశం. ఈ సమస్యపై మన రాజ్యాంగము యొక్క ఉపోద్ఘాతం పరిశీలిస్తే, రాజ్యాంగ సభవారు ఎంత దూరదృష్టితో భారత రాజ్యాంగ లక్ష్యాని నిర్ణయించారో తెలుస్తుంది. ఉపోద్ఘాతంలో మూడవ లక్ష్యం అంతస్తు, అవకాశాలలో సమానత్వం కల్పించడం భారత దేశ పురోభివృద్ధికి, ఇది చాలా ముఖ్యమైన చారిత్రాత్మక సంకల్ప, అవకాశం కల్పించడంలో, సమానత్వం సాధిస్తే, భారతీయ ప్రజా బాహుళ్యానికి అది సరిపోదు. సమానత్వం ఉన్నచోట సమాన అవకాశం కల్పించడంలో అర్థం ఉంది. భారతీయ సమ నిర్మాణానికి, అదిసరిపోదు. శాశ్వతమైన వైవిధ్యాలు, అసమానతలు జీర్ణించుకున్న సమాజానికి సమాన అవకాశం ఒక్కటే కలుగజేస్తే సరిపోదు సరిగదా, అది పైగా వ్యత్యాసాలను పెంచడానికి పైవారు అధిగమించడానికి, క్రిందివారు అణగారిపోవడానికి దోహదం చేస్తుంది. అట్లా జరుగకుండా ఉండడానికే రాజ్యాంగ లక్ష్యం

సుస్పష్టంగా ఉపోద్ఘాతంలో చెప్పబడింది. భారత దేశంలో వెనుకబడినతనం అనేది, కేవలం ఆర్థికమైనలోటు పాట్లపై ఆధార పడిందికాదు. హిందూసమాజంలో, వ్యక్తులయొక్క మేధస్సు, శక్తి స పద, ఆరోగ్యం, ప్రవర్తన, గుణగణాలతో సంబంధంలేకుండా ఎక్కువగా వారికులాన్ని బట్టియే, వారికి అంతస్తు సంక్రమిస్తుంది. ఇది చాలా దురదృష్టకరమైన పరిస్థితి. వైదిక నాగరికతకే తల వంపులు తెచ్చేది, వర్ణవ్యవస్థ. ప్రారంభంలో వృత్తిరీత్యా, వర్ణవ్యవస్థ ఏర్పడినా కాలానుగుణంగా, వేళ్ళుతలలు వేసి, సమాజంలో నికృష్టమైన ఎత్తు పల్లాలు సృష్టించింది. పరపరిపాల నలో, ఈ వ్యత్యాసాలు రూపుమాపడానికి తీసుకొన్న చర్యలు సమగ్రమైనవికావు. సర్వ స్వతంత్ర ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యమైన మన భారత దేశంలో, కులం మూలంగా వచ్చిన అంతస్తులను సరిదిద్దకపోతే సమసమాజాన్ని, మనం ఎన్నటికి నిర్మించుకోలేము. దీనిని దృష్టిలో పెట్టుకొని, అంటరానితనం నిర్మూలించడానికి, వెట్టిచాకిరి మాన్పించడానికి నిర్దిష్టమైన ఏర్పాటు రాజ్యాంగంలో సూచింపబడింది. కష్టించి పనిజేసి, పండించినవాడు భూమిపై ఎట్టి హక్కులేకుండా, కౌలుదారుగా మాత్రం ఉంటు న్నాడు. దేవాలయాలకో, గ్రామానికో, చాకిరి చెయ్యడానికి వందలాది సంవత్సరాల క్రితం ఇవ్వబడ్డ భూములపై ఈ నాటికి హక్కు భుక్తం లేకుండా, చాకిరి మానితే భూమి లాగుకొనే పద్ధతి సరియైనదిగా గన్పడదు. ఈ పద్ధతులను మట్టుపెట్టడానికే భూసంస్కరణలు ఉద్దేశింపబడ్డాయి. అలాగే విద్యాలయాలలోనూ విద్యార్థి వేతనాలు మంజూరు చేయడంలోనూ, తదితర ప్రజా హిత కార్యక్రమాలన్నింటా, నిర్ణీతమైన పరిధిలో వెనుకబడిన తరగతులవారికి అవకాశాలను ప్రత్యేకించాల్సి ఉంటుంది. దీనికి దోహదం చేస్తూ రాజ్యాంగంలో 15, 16, 46వ పరిచ్ఛేదములలో, సంరక్షణలు, ఆదేశాలు ఇవ్వబడ్డాయి. వీటినిపూర్తిగా అనుసరించి అమలు పరిస్తే, వెనుకబడిన తరగతులు క్రమంగా పురోగతి పొందగలుగుతాయి. లేకపోతే భారత సమాజం చీడపట్టిన చేనులాగే, ఫలితం సాధించ లేకుండా పోతుంది. ఈ విషయాన్ని మనం ఎంత తొందరగా గమనిస్తే అంత మంచిది. దానివల్ల వెనుకబడిన తరగతులు రక్షింప బడడమే కాకుండా దేశ ప్రజల సమైక్యత పెంపొందు, జాతీయ శక్తి సంపదలు బలీయమై భారత దేశం గౌరవ ప్రపత్తులు సంపాదించుకొంటుంది. ★

నీరాజనం

వక్కలంక లక్ష్మీపతిరావు

అదిగో! ఆంధ్రతపఃఫలం బగు విశాలాంధ్రక్షమాలక్ష్మి ! అ
ల్లదిగో స్వీయయశః కథామల తటిన్యంభో విహారక్రియా
భ్యుదితానంద నటద్ధిశాంత గజరాజోత్తంస సంరంభ స
మ్మద మొప్పారఁగ స్వాగతం బిడి ఘటింపన్ రండు
పుష్పాంజలుల్ !

అమృతవాగ్వృష్టి గురిసి సుమాక్షతలను
జల్లుఁడాంధ్రీ పురంధ్రిపై స్వాంత మలర ;
స్వీయ సౌభాగ్యవైభవశ్రీల తోడ
హైదరాబాదు విచ్చేసె నాంధ్రి యదిగో !

రాయలనాఁటి యాంధ్రప్రశస్తి నుతింపఁ
గనినట్టి యష్టదిగ్గజములార !
బహుళాంధ్ర సూక్తి ప్రపంచమ్ము నిర్మించి
పాలించు కవి సార్వభౌములార !
ఆంధ్రభాషాయోష కందలమ్ములు పట్టి
చరితార్థులైన రాట్చంద్రులార !
ఆంధ్రరాష్ట్రమునకై యసువుల నర్పించి
కీర్తిగాంచిన త్యాగమూర్తులార !

ఓ యాంధ్రీ! భువనైకమోహనుఁడు నెహ్రూ హైదరాబాదులో
నీ యీ దివ్య గృహప్రవేశమునకుం జేసెన్ శుభారంభమున్ ;
డాయన్ వచ్చితె పూర్వవైభవములోడన్? నిత్య కళ్యాణివై
నీ యౌన్నత్యము నష్టదిగ్గజములుం గీర్తింప వర్ధిల్లుమా !

ఎన్నోయేండ్లెడబాసి యెవ్వరికి వారేయైన నీ బిడ్డలం
గన్నుల్ చల్లగ నొక్కచోఁ గనెడు భాగ్యం బిచ్చెనే తల్లి ! యీ
కన్నీ రేటికి? వేఱుకాపురము లింకన్ మాని నీ సాక్షిగా
నన్నాదమ్ముల మేక మైతిమి విశాలాంధ్రా ! విశాలాశయా!

తెలుగు కవులు : జాతీయ సమైక్యత

— శ్రీ గుంటి పుండరీకాక్షయ్య

మన దేశం భారత దేశం. మన జాతి భారత జాతి. భారత దేశంలో హిమాలయాల నుండి కన్యాకుమారి వరకు వివిధ భాషలు, సంస్కృతులు, నాగరికతలు, సంప్రదాయాలు నెలకొని వున్నాయి. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల వంటి అనేక మతాలు మన దేశంలో వున్నప్పటికీ మనదంతా భారత కుటుంబమే. కులాలు వేరైనా, ప్రాంతాలు వేరైనా మనదంతా భారత సంతతే. పూసలలో దారంలా విభిన్నత్వంలో ఏకత్వాన్ని స్పష్టంచేసి అన్ని జాతుల లోను, మతాలలోను కల మానవతను, వ్యక్తిత్వపు విలువలను గుర్తింపజేసి మానవజాతి నంతటిని ఏక మొనర్చుటయే కవి కర్తవ్యం. కవి జాతిని జాగృతం చేసే వైతాళికుడు గాన అతడు భారతీయుల హృత్కుహరాలలో ఐకమత్యం, ప్రేమ, ఆత్మీయత, అవగాహన నెలకొనేటట్లుగా రచనలు చేసి జాతిలో ఉత్తేజం కలిగించాలి.

భారత దేశంలో నేడు అక్కడక్కడ మతకల్లోలాలు, వేర్పాటు ధోరణులు చెలరేగి సంకుచిత దృష్టి ప్రబలిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. అగ్నికి ఆజ్యం తోడైనట్లు కొందరు 'విప్లవం' పేరుతో మానవతా వృక్షాల్ని మొదలంట నరికి మానవులకు నిలువ నీడలేకుండా చేయటానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి తరుణంలోనే కవి బాధ్యత గురుతర మవుతుంది. జాతిలో అక్కడక్కడ రగుల్కొన్న విద్వేషానలాన్ని కవి తన కవితామృతంతో పోకార్చాలి. మానవునికి మధ్య మానవతనే వంతెనగా నిర్మించాలి. భారత జాతి సమైక్యతను నిండుగుండెతో గానం చేయాలి. తెలుగు దేశంలో గురజాడ మొదలు నేటి ఆధునిక తెలుగు కవులు జాతీయ భావాల వ్యాప్తికి, దేశభక్తి నెలకొనటానికి దోహదం చేశారు. చేస్తున్నారు కూడ.

మన ఆంధ్రదేశంలో యిప్పటికీ కులభేదాలు వెర్రి తలలు వేస్తూనే వున్నాయి. మానవుడు వైజ్ఞానికంగా చంద్రమండలంలో అడుగు పెట్టనప్పటికీ, యీ కుల భేదాలు పరిశీలిస్తుంటే, యింకా సామాజికంగా వెనుకబడి వున్నాడనే అనిపిస్తుంది. ఏ నాడో తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారన్నట్లు:

"వైదికు లన్నచో మొగమువాడ్చు నొకండు
నియోగ భోగముల్ ఖేదము గూర్చు నొక్కనికి,
గిట్టదు గిట్టదు కమ్మవారి భాగ్యోదయమన్న గొందఱకు,
...సమ్మోదము నీదు కాపుల సమున్నతి యొక్కని కేమిపాపమో!

అందుకే గురజాడ అంటాడు—

"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచియన్నది, మాలయైతే మాలనే అగుదున్" అని

ఈ కులభేదాలు రూపుమాసి పోవటానికి కవులు తమ రచనల ద్వారా శక్తివంచన లేకుండా కృషి చేస్తూనే వున్నారు. డా. సి. నారాయణరెడ్డి గారంటారు.

"నింగి లోపల లేవు ఎల్లలు
సరధిని గనరావు ఎల్లలు
ఎందుకీ ధరణీ తలమ్మున
ఇరుకు వాడలు ఇనుప గోడలు?
అన్ని జాతుల కొకే సూర్యుడు
అన్ని నేలల కొకే చంద్రుడు
అయినచో జాత్యహంకారము
ఆటవిక తత్త్వమ్మ కాదా ?
ఏ కులము వెన్నెలది ? తెమ్మెర
లెట్టి జాతికి చెందినట్టివి?
అట్టిదే కద మానవత్వము
అన్నిటికి ఎత్తైన సత్యము"

మనిషికి మనిషికి మధ్య నెలకొన్న జాతి, కులమనే యీ యిరుకు గోడలు నశించిపోయి, మానవతా లతలు పెనవేసుకున్నప్పుడే మానవత వేయిరేకులై విడిగి విప్పారుతుంది. ఆ నాడే దేశాభ్యుదయానికి రాచబాట వేయబడుతుంది.

మనది చాల వెనుకబడిన దేశం. మనదేశం అభివృద్ధి చెందాలంటే ప్రజల కృషి ఎంతో అవసరం. ఆ కృషి ఫలించడానికి జాతీయ సమైక్యత చాల అవసరం. నిత్యం కక్షలతో, కార్పణ్యాలతో అనైక్యతలతో తల్లడిల్లే జాతి తన ముందున్న సమస్యల వైపు ఎప్పుడు దృష్టిని మళ్లిస్తుంది ? అందుకే ముందుగా ప్రతి భారతీయునిలో దేశాభిమానము, దేశభక్తి నెలకొనాలి. గురజాడ మహాకవి ప్రబోధించినట్లు దేశమును ప్రేమించాలి. మంచిని పెంచాలి. వ్యర్థ కలహాల్ని త్రుంచివేసి, కత్తి వైరాన్ని కాల్చివేయాలి.

"చెట్ట పట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడవ వలెనోయ్,
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్!"

(మిగతా 27వ పేజీలో)

ఏలేరు రిజర్వాయరు పథకం

— శ్రీ రావిపాటి మహానంద

తూర్పు గోదావరి జిల్లాలో అడ్డతీగల ఏజన్సీ ప్రాంతములో ఏలేరు నది ప్రారంభమైనది. ఈ నదికి ఏలేశ్వరము చేరుసరికి, చింతపల్లి, చోడవరం, చోద్యం ఏజన్సీల నుండి ఎన్నో వుపనదులు కలిసి యున్నవి. ఏలేశ్వరం వద్ద అడ్డకట్ట నిర్మించు ప్రాంతములో యీ నది పరీవాహక ప్రదేశము (Catchment area) 862 చదరపు మైళ్ళు. ఈ ఏలేశ్వరం గ్రామమునకు దిగువ సుమారు 368 చిన్న కాలువలు యీ నది నుంచి త్రవ్వబడి సుమారు 75,000 ఎకరములలో వరి సాగుబడి, 15,000 ఎకరములలో చెరకు పండించుచున్నారు. ఈ 90,000 ఎకరముల భూమి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ, పెద్దాపురం తాలూకాలకు చెందివున్నది. ఈ ప్రాంతమును ఏలేరు నది డెల్టా'గా పిలవ వచ్చును. ఈ సాగుబడి అంతయు 'ఏలేరు ప్రాంతములోని వర్షపాతముపైననే ఆధారపడి, ఏ విధముగాను స్వాధీనము లేని Open head Channels వలన జరుగుచుండుట వల్ల కొన్ని సందర్భములలో నీటి సరఫరాకు ఆటంకము కూడా కలుగుచున్నది. అదికాక సాధారణ సంవత్సరములలో కూడా, ఎగువ భాగమందున్న రైతులే అడ్డకట్టలు వేసి, నీటిని నిరోధించుచున్నందున, దిగువ భాగమందున్న రైతులు నీరు అందక బాధలు పడుటయు గలదు. ఈ పై పరిస్థితుల వల్ల పంటలు సరిగా పండక పోవుట వలన, సాలీనా 20 నుంచి 25 శాతము పంట నష్టము అంచనా వెయ్యబడినది. దీనికి మార్గముగా సరి అయిన విధములో నీటి సరఫరా చేయుటకున్నూ, వర్షాభావ పరిస్థితుల వల్ల ఏర్పడు అనావృష్టులను తొలగించుటకున్నూ, ఏలేరు నదికి ఏలేశ్వరం వద్ద అడ్డకట్టలు నిర్మించి, రిజర్వాయరు ఏర్పడునట్లు చేయుటకు గత ఇరవై సంవత్సరములుగా రైతులు ఆందోళన చేయుచున్నారు. ఈ రిజర్వాయరు నిర్మాణము వలన అసాధారణముగా వచ్చువరదలు నిరోధించి, వరదల వల్లనూ మురుగు నీటి వల్లనూ పంటలు నష్టపోకుండ కాపాడుటకున్నూ ఇప్పుడు సాగుబడిలో వున్న 90,000 ఎకరములు కాక, అదనముగా 10,000 ఎకరములు సాగుబడిలోనికి వచ్చుటకున్నూ యీ నిర్మాణము ఎంతయో అవసరము.

ఈ ఏలేరు నదిపై అడ్డకట్టలు (Dams) నిర్మాణమునకు ఏలేశ్వరం వద్ద ప్రదేశము చాలా కాలము క్రిందటనే ఇంజనీర్లు అనేక పరిశోధనలు చేసి నిర్ణయించినారు. రమణీయ శోభాయమానమైన చిరు నవ్వులు చిందించెడి ప్రకృతిలో, సహజమైన అడవుల మధ్య ఏర్పడు 11.60 చదరపు మైళ్ళవైశాల్యము గల నీటి సరస్సును, చేరువలో నున్న కొండలపై నుంచి నిర్మించు మళ్లింపు దారి (Diversion Road) నుంచి చూచుటకెంతయో ఆహ్లాదకరముగా, మానస సరోవరమును మరపించునదిగా వుండునని ఇంజనీర్లు, యీ ప్రాంతపు ప్రజలు ఏ నాటి నుంచియో కలలు గనుచున్నారు.

ఈ అడ్డకట్ట నిర్మాణము మట్టిలో నిర్మించు అయిదు అడ్డకట్టల (Earth Dams) తో కూడి కాంక్రీటు కట్టడపు Spit way Saddle లో నిర్మించుటకు నిర్ణయించ బడినది.

అడ్డ కట్టల నెం.	పొడవు (అడుగులలో)	సగటు భూమట్టము (A. G. L)	నదీ గర్భము యొక్క లెవల్.
1.	3043_0	166.50	156.60
2.	490_0	212.00	
3.	1542_0	238.20	
4.	578_0	234.90	
5.	1602_0	231.65	

Spill wayపొడవు 350._0"లు వుండి Saddle No.1 లో నిర్మించ బడును. హెచ్చుగా వున్న నీరు పోవుటకు 150 అడుగుల పొడవుగల Surplus weir Saddle No 2లో ఏర్పాటు చేయటకు కూడా నిర్ణయించ బడినది. ఇది అసాధారణ వరదల నుంచి యీ నిర్మాణమును కాపాడుటకు వుపయోగపడును. అసాధారణ వరదలు లక్ష క్యూసెక్కులు దాటక పోయినప్పటికీ లక్షా డెబ్బయి అయిదు వేల క్యూసెక్కుల వరదలనుఆపుటకు వీలుగా నిర్మించుటకు నిర్ణయించబడినది.

ఆయకట్టు–కాలవల నిర్మాణము

ఈ క్రింద ఉదహరించిన భూములు ఏలేరు రిజర్వాయరు వల్ల అభివృద్ధి పొందగలవు.

ప్రథమ పంట పండు భూములు			30,062 ఎ.
ప్రత్యేక రేటుగల పల్లపు భూములు			36,000 ఎ.
చెరకు పంటకు లోకలైజు కాబడు ప్రాంతము			14,000 ఎ.
మెట్టగా రిజిష్టరు కాబడిన పల్లపు భూములు			10,800 ఎ.
మెట్టభూమి	5391	వెరశి	10,077 ఎ
చెరువుల క్రింద	4586		
తిమ్మరాజు చెరువుక్రింద ఆయకట్టు			6,5`7 ఎ.
			1,07,476 ఎ

ఇంకను ఆయకట్టు వృద్ధి పరచుటకు ఇంజనీరింగు శాఖవారు పరిశోధనలు జరుపుచున్నారు. కాని ఇంకనూ ఆయకట్టు అభివృద్ధి పరచు కృషికంటే వున్న ఆయకట్టునే రెండవ పంట సాగుబడికి గాని, చెరకు మొదలగు వాణిజ్య పంటలు పండించుటకు గాని నిర్ణయించినచో, యిప్పుడు వున్న కాలువల ద్వారా నీటి సరఫరా జరిపి క్రొత్త కాలువల త్రవ్వకము అవసరము లేకుండా చేయవలెనని కూడా ఆలోచన గలదు.

ఈ రిజర్వాయరు నుంచి పైనుదహరించిన ఆయకట్టుకు తలకట్టు ద్వారములు(Head Sluices)1వ నెంబరు డామునకు 5వ నెంబరు డామునకు నిర్మించుటకు నిర్ణయించబడినది. తిమ్మరాజు చెరువును నింపుటకు 5వ నెంబరు డామువద్ద (Head Regulator) నిర్మించుటకు ప్రత్యేకముగా సర్వేలు జరుపబడినవి.

చెరువుల గర్భములు (Tank Bed Lands)

ఈ క్రింది విధానము వల్ల 64 చెరువులకు నీటి సరఫరా జరుగుచున్నది.

1. ఏలేరు విధానము	... ...	25 చెరువులు
2. నవరా విధానము	... ...	19 చెరువులు
3. గొట్టి ఖండి విధానము	... ...	20 చెరువులు
	మొత్తం	64 చెరువులు

ఈ చెరువుల భూముల విస్తీర్ణము 4686 ఎకరములుండును. వీటిక్రింద ఆయకట్టు 33,500 ఎకరములు. ఈ చెరువులన్నియు పైనుదహరించిన కాలువల వల్లనే నీటితో నింపబడుచున్నవి. ఈ చెరువులకు దాదాపు స్వతంత్ర పరీవాహక ప్రదేశము లేనేలేదు. ఈ చెరువుల క్రింది భూములను వంతుల ప్రకారం జరుగు నీటి సరఫరా వలన సాగుచేయుచున్నారు. వంతులురాని కాలములో యీ చెరువులలోని నీరు ఆయకట్టుకు సరఫరా జరుగును. కాని రిజర్వాయరు నిర్మాణము జరిగినచో నిశ్చయముగా ఆయకట్టునకు నీరు అందుటవలన ఈ వంతుల విధానంతో పనిలేదు.

ఈ రిజర్వాయరు స్కీమునకు దాదాపు 459 లక్షల రూపాయలు ఖర్చగునని అంచనా వెయ్యబడినది. దీనివల్ల చెరువు గర్భములు (Tank Bed Lands) అమ్మి వేసినను, భవిష్యత్తులో యీ రిజర్వాయరు నిర్మాణము వలన నిశ్చితమైన నీటిసరఫరా జరుపబడునని తలంచుటలో ఎట్టి సందేహము లేనందున, యీ చెరువు గర్భములవల్ల 200 లక్షల రూపాయలు లభించునని అంచనా. ఇదిగాక, మిగరా ధనము (Betterment Levy) గా కట్టవలెనని ప్రభుత్వము రైతాంగమును ప్రోత్సాహించుచున్నది.

ఆయకట్టు అభివృద్ధి, వరదల నిరోధము, వాణిజ్య పంటల ప్రోత్సాహముతోపాటు భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ప్రకృతి సౌందర్యముగల యీ ప్రాంతము మరింత శోభాయమానమై, యీ రిజర్వాయరు నిర్మాణము పూర్తి అయిన తర్వాత వినోద, విలాస యాత్రికులనుకూడా విశేషముగా నాకర్షించు ననుటలో సందేహములేదు.

సుమారు ఇరవై సంవత్సరములుగా, యీ ప్రాజక్టు నిర్మాణం చేస్తామంటూ ఎందరో వాగ్దానములు చేస్తూ, సరిగా కృషిచెయ్యని కారణముగా రైతాంగములో నిరాశ, నిస్పృహ కనబడుచున్నాది, అందువల్ల 4.9.71 తేదీన శాసన సభలో ఇరిగేషన్ మంత్రి శ్రీ సిద్దారెడ్డి గారు యీ సంవత్సరములో యీపని ప్రారంభిస్తామని తెలియచేసి నప్పటికీ, ప్రజలలో వుత్సాహం కనిపించుటలేదు. వాగ్దానములకంటే క్రియాత్మకంగా చేసి చూపినప్పుడే ప్రజలకు ప్రభుత్వము ఎడల విశ్వాసం కలుగును. అదృష్టవశాత్తు యిప్పటి మంత్రి వర్గంలో కూడా అప్పటి మంత్రిగారే వుండినారు. గనుక ఇది ప్రజల ప్రాజెక్టుగా భావించి, సాధ్యమైనంత తొందరలో పూజ్య నెహ్రూజీ చెప్పినట్లు యీ నవీన దేవాలయమునకు శంఖుస్థాపన చేయించి, పని ప్రారంభించి లోక కల్యాణమునకు తోడ్పడవలెనని కోరుచున్నాను.

*

(25వ పేజీ తరువాయి)

రాయప్రోలు సుబ్బారావుగారు జాతీయాభిమాని. మన దేశాన్ని గురించి :

"ఏ దేశమేగినా, ఎందు కాలిడిన
ఏ పీఠ మెక్కినా, యెవరెదురయిన
పొగడరా, నీ తల్లి భూమి భారతిని!
నిలుపరా, నీ జాతి నిండు గౌరవము"

ఇదే ధ్యేయము. ప్రతి భారతీయుని గుండె గుండెలో నినదించాలి. జాతి గౌరవాన్ని నిల్పటానికి ప్రతివాడూ పాటుపడాలి.

వేదుల సత్యనారాయణశాస్త్రిగారు ఒక పూవును గురించి వ్రాస్తూ ఎంత చక్కని జాతీయ భావాన్ని కూర్చారో చూడండి.

"నీచపు దాస్యవృత్తి మననేరని భారత
మాతృదేశ సేవా చరణమ్ములం
దసువు లర్పణ సేసిన వారి పార్థివశ్రీ.
వారు చోట, తదస్మృగుచులన్ వికసించి,
వాసనల్ వీచుచు రాలిపోవగ వలెం
ఉదుదాత్త సమాధి మృత్తికన్"

పూవు దేవుని పూజలకు తన్నుతానర్పించు కోదట ! స్త్రీల జడలలో ఇమిడిపోదట ! మాతృ దేశమునకై అసువులర్పించిన వారి సమాధి దగ్గర రాలిపోవలెనని అనుకుంటుందట ! చూడండి ఎంత చక్కని జాతీయ భావనో!


దువ్వూరి రామిరెడ్డిగారు ఆకాంక్షించినట్లు ఏనాటికైనా

"సకల మానవజాతి సంతతులు
వర్ణ భేదంబుల బాటింపబోక
యొక్క కడుపున బుట్టి యొక చన్ను బాలు
ద్రావిన రీతి"

మసల గలరని, ఆనాడే

"ఏక కుటుంబమై యీ ప్రపంచంబు
స్వర్గంబు భూమిపై స్థాపింపబడియె"


ననే ఊహ సార్థకమవుతుంది. ఆ మంచిరోజుకోసం ఎదురుచూద్దాం.




1



2



3



4

నగరంలో : వార్తా చిత్రాలు

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి


1. నవంబరు 9న రాష్ట్రపతికి విశాఖపట్నంలో పురపాలక సంఘంచే పౌరసన్మానం.

2. నవంబరు 8 న దిమిలిలో మెరైన్ కెమికల్ కాంప్లెక్స్ పనికి రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేశారు.


3 శ్రీకాకుళంలో నవంబరు 10న రాష్ట్రపతి అఖిల భారత గిరిజన సంక్షేమ మహాసభను ప్రారంభించారు.


4. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్ట్సు శాఖలో క్రొత్త భవనానికి నవంబరు 8 న రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేశారు.

5. విజయనగరం మహారాజా కళాశాల శత జయంత్యుత్సవాలను నవంబరు 9న రాష్ట్రపతి ప్రారంభించారు.



5







నగరంలో : వార్తాచిత్రాలు

నవంబరు 14వ తేదీన నెహ్రూ జయంతి సందర్భంగా పబ్లిక్ గార్డన్స్‌లో బాలల దినోత్సవం జరిగింది.

ముఖ్యమంత్రి తెల్లటి పావురాళ్లను ఎగుర వేశారు.

పిల్లల విచిత్ర వేషధారణలో స్త్రీ సంక్షేమశాఖ మంత్రిణి శ్రీమతి పద్మాభాస్కర రెడ్డి బహుమతులు పంచారు.

బాలభవన్ వారు రవీంద్రభారతిలో జరిపిన సంగీత, నృత్య నాటకోత్సవంలో సమాచార, పౌర సంబంధశాఖ మంత్రి శ్రీ ఎ. వాసుదేవరావు బహుమతులు పంచారు.



22-8

ప్రగతి పథంలో ఖమ్మం జిల్లా

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడి 1971 నవంబరు 1 నాటికి 12 ఏండ్లు అవుతుంది. పంచాయతీరాజ్ వ్యవస్థ ఖమ్మంజిల్లాలో ఏర్పడినప్పటి నుంచి ఈ ప్రాంతంలో సాంఘిక ఆర్థిక రంగాలలో చాలా గొప్ప మార్పు వచ్చింది. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు, పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు పరస్పర సన్నిహిత సహకారంతో పాల్గొనడం వల్ల ఇది సాధ్యమైంది.

ఖమ్మం జిల్లా జనాభా 13.69 లక్షలు. ఈ జిల్లాలో 1,239 గ్రామాలతో 13 పంచాయతీ సమితులు వున్నాయి. ఈ జిల్లా వైశాల్యం 6104 చ. మై. ఇందులో 50 శాతం భాగం అటవీప్రాంతం. జిల్లాలో ఖనిజ సంపద విస్తారంగా వుంది. దక్షిణ భారతదేశంలో బొగ్గుగనుల విషయంలో ఖమ్మం అగ్రస్థానం ఆక్రమించింది. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి విషయంలో కొత్తగూడెంలోని ప్రస్తుత థర్మల్ స్టేషను 1,000 మె. వా. సూపర్ థర్మల్ స్టేషన్‌గా అభివృద్ధి పరచబడినపుడు ఇది భారతదేశంలోనే కాక ఆగ్నేయ ఆసియాలో కూడా ప్రథమ స్థానం ఆక్రమిస్తుంది.

1954లో పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిన తరువాత సామాజికాభివృద్ధి కార్యక్రమాలు గ్రామ, బ్లాకు, జిల్లా స్థాయిలలో పంచాయతీ సంస్థలకు అప్పగించబడినాయి. అప్పటి నుంచి ఈ జిల్లా అనేక రంగాలలో ప్రశంసనీయమైన కృషిచేసింది.

వ్యవసాయం

జిల్లా ప్రజల ప్రధానవృత్తి వ్యవసాయం. 80 శాతం మంది తమ జీవనాధారానికి వ్యవసాయంపైననే ఆధారపడివున్నారు. కొన్ని సంవత్సరాల్లుగా దుర్భిక్ష పరిస్థితులు, తుఫానులు రావడంవల్ల 1966–67 నుంచి జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి నూతన విధానాలు అనుసరించబడుతున్నాయి. ఆధునిక శాస్త్రీయపద్ధతులలో వ్యవసాయం అభివృద్ధిపరచబడుతున్నది. రసాయనిక ఎరువుల వాడకం, సస్యరక్షణ కార్యక్రమాలు, మేలురకం విత్తనాలు వుపయోగించడం మున్నగునవి బహుళప్రచారంలో వున్నాయి. వ్యవసాయోత్పత్తులను అధికం చేయడానికి యెక్కువ దిగుబడినిచ్చే పద్మ, జయ, హంస మున్నగు వరి. వంగడాలు విస్తారంగా వుపయోగించబడుతున్నాయి.

నీటిపారుదల

వ్యవసాయాభివృద్ధి నీటిపారుదల సౌకర్యాలపైన ఆధారపడి వుంటుంది. అందువల్ల ఈ జిల్లాలో నీటిపారుదల సౌకర్యాలను అభివృద్ధి పరచడానికి ప్రత్యేక శ్రద్ధ వహించబడింది. మూడు మధ్య తరహా ప్రాజెక్టులు అంటే పాలేరు, వైరా, బైల్‌పల్లి గన్నవరం ప్రాజెక్టులు వున్నాయి. నాగార్జునసాగరు ఎడమకాలువ ఈ జిల్లాలో 85 మైళ్ల పొడవు వరకు ప్రవహిస్తుంది. ఈ కాలువ నిర్మాణం 1974లో పూర్తి అవుతుంది. అప్పుడు 3 లక్షల యెకరాలకు నీటిపారుదల సౌకర్యం లభిస్తుంది.

గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా

ఆధునిక పద్ధతిలో ఆర్థిక పరిస్థితి అభివృద్ధిచెందడానికి విద్యుచ్ఛక్తి అవసరం. ఈ విషయంలో ఈజిల్లా గణనీయమైన ప్రగతి సాధించింది. ఇంతవరకు 23 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాం చేయబడింది. ఇంకా అనేక గ్రామాలకు విద్యుత్ సౌకర్యాలు కల్పించడానికి సంకల్పించబడింది. ఈ జిల్లాలో గృహోపయోగాలకు, పరిశ్రమలకు, వ్యవసాయానికీ కలిపి మొత్తం 23,887 సర్వీసు కనెక్షనులు ఇవ్వడం జరిగింది. కొత్తగూడెంలో రూ. 30 కోట్ల ఖర్చుతో 240 మె. వా. థర్మల్ స్టేషను ఏర్పాటు చేయబడింది. ఇది చెప్పుకోదగిన ప్రగతి.

పరిశ్రమలు

పరిశ్రమల విషయంలో ఖమ్మం జిల్లా శీఘ్రగతిని అభివృద్ధిచెందింది. కొత్తగూడెం, ఎల్లందులలో బొగ్గుపరిశ్రమ, కొత్తగూడెంలోని బేరియం కెమికల్ ఫ్యాక్టరీ పారిశ్రామికాభివృద్ధికి దోహదం కలిగిస్తున్నాయి. జిల్లాలో ముడి యినుము విస్తారంగా లభిస్తుంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి ముడిఇనుము జపానుకు యెగుమతి అవుతున్నది. కొత్తగూడెంలో సాలీనా లక్ష టన్నుల దుక్క ఇనుము ఉత్పత్తి చేయడానికి కర్మాగారాన్ని స్థాపించేందుకు భారత ప్రభుత్వం ఒక పథకాన్ని ఆమోదించింది. కొత్తగూడెంలో రు. 8 లక్షల ఖర్చుతో పారిశ్రామికవాడ స్థాపించబడింది. ఇందులోని 12 యూనిట్లు పారిశ్రామిక వేత్తలకు కేటాయించబడినాయి. జిల్లాలో 10 పారిశ్రామిక సహకార సంఘాలు 325 లఘు పరిశ్రమల యూనిట్లు వున్నాయి.

పశుపోషణ

జిల్లాలో పశుసంపద విషయమై తగిన శ్రద్ధవహించబడింది. కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా పాడిపశువులు అభివృద్ధిపరచబడినాయి. జిల్లాలో మొత్తం 10 లక్షల పశువులు వున్నాయి. ఖమ్మం నేలకొండపల్లి, కల్లూరు, కొత్తగూడెం, మధిర, బూర్గుంపహాడులలో మొత్తం 6 కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయబడినాయి. కోళ్ల అభివృద్ధి విషయమై జిల్లా పరిషత్తు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది. 1970–71లో మేలుజాతికి చెందిన 7,600 కోళ్ళు పంచిపెట్టబడినవి. కొత్తగూడెం, తనికెళ్ల, సుజాతనగరం, శ్రీపురం గ్రామాలలో పశువైద్య చికిత్సాలయాలు నెలకొల్పబడి

నాయి. ఈ జిల్లాలో మొత్తంమీద 52 పశువైద్య సంస్థలు పనిచేస్తున్నాయి.

సహకారం

గ్రామీణ జీవితంలో నవ చైతన్యం కలిగించేవి పంచాయతీరాజ్ సంస్థలు, సహకారసంఘాలు. ఖమ్మం జిల్లాలోని అన్ని గ్రామాలకు సహకార సంఘాల కార్యక్రమాలు విస్తరించివున్నాయి. 800 సహకార పరపతి సంఘాలు, 5 భూమి తనఖా బ్యాంకులు వున్నాయి. భూమి తనఖా బ్యాంకులు, రైతులకు దీర్ఘ మధ్య కాలిక ఋణాలక్రింద వ్యవసాయాభివృద్ధికై రూ. 2.5 కోట్లు ఋణాలుగా ఇచ్చినాయి. ఈ జిల్లాలో ఏరియా డెవలప్‌మెంటు స్కీం ఒకటి రూపొందించబడింది. ఈ పథకం ప్రకారం రూ. 106 లక్షల ఖర్చుతో 600 బావులు 50 బోరింగు బావులు 100 ఎలక్ట్రిక్ మోటార్లు, 50 ఆయిలు ఇంజనులు ఏర్పాటు చేయటానికి ప్రతిపాదింపబడినది. ఈ పథకం క్రింద ఖమ్మం, కొత్తగూడెం, మధిర తాలూకాలలో 6,500 ఎకరాల భూమికి నీటిసౌకర్యాలు లభించగలవని అంచనావేయబడింది. ఈ పథకం క్రింద ఇంతవరకు రూ. 32.51 లక్షలు ఖర్చు పెట్టడం జరిగింది.

రవాణా సౌకర్యాలు

భద్రాచలంవద్ద గోదావరి నదిపైన పెద్ద వంతెన నిర్మించబడడంతో ఖమ్మం జిల్లాకు మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలతో రాకపోకల సౌకర్యాలు కలిగినాయి. గత 12 ఏండ్లలో కమ్యూనికేషన్ల విషయంలో గణనీయమైన ప్రగతి సాధించబడింది. జిల్లా పరిషత్తు, పంచాయతీ సమితులు, పబ్లిక్‌వర్క్స్ శాఖ కలిసి ఈ 12 ఏండ్ల కాలంలో మొత్తం 2,556 కి. మీటర్ల పొడవుగల రోడ్లను నిర్మించినాయి.

విద్య

గ్రామీణార్థికాభివృద్ధికి విద్యాప్రగతి జీవగర్ర వంటిది. విద్యా విషయాలు జిల్లా పరిషత్తు పంచాయతీ సమితులకు మార్చబడిన తరువాత విద్యాభివృద్ధికై రూపొందించబడిన పథకాలు అనేకం అమలుపరచబడినాయి. అనేక క్రొత్త పాఠశాలలు వెలసినాయి. విద్యార్థుల సంఖ్యకూడా పెరిగింది. బాలబాలికలకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనసదుపాయాలు కల్పించబడినాయి. వారికి పాలు సరఫరా చేయబడుతున్నవి. బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యార్థి ఉపకారవేతనాలు మున్నగునవి ఇవ్వబడుతున్నాయి.

1961లో ఖమ్మంలో కేవలం 10 హైస్కూళ్లు మాత్రమే వున్నాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిన తరువాత సెకండరీ స్కూళ్ళ సంఖ్య 10 నుంచి 108 కి పెరిగింది. ఖమ్మం, కొత్తగూడెంలలో 4 డిగ్రీ కళాశాలలు కాక జిల్లాలో మొత్తం 10 జూనియర్ కాలేజీలు, 2 ట్రెయినింగు స్కూళ్ళు, 108 హైస్కూళ్లు 113 అప్పర్ ప్రైమరీ స్కూళ్లు, 1,059 ప్రాథమిక పాఠశాలలు వెలసినాయి. వీటిల్లో విద్యార్థుల సంఖ్య సుమారు లక్షవుంది. కొత్తగూడెంలో మైనింగ్ పాలిటెక్నికల్ ఇండస్ట్రియల్ ట్రెయినింగు సంస్థ కూడా వుంది.


బలహీనవర్గాల సంక్షేమం

జిల్లాలో షెడ్యూలు తరగతులు, గిరిజనుల జనాభా 3.1 లక్షలు వుంది. తెలంగాణాలో గిరిజనుల జనాభా విషయంలో ఖమ్మం అగ్రస్థానం వహిస్తుంది. గిరిజనుల, ఇతర వెనుకబడిన వర్గాల ఆర్థిక, సాంఘిక, విద్యాప్రగతికై గట్టి చర్యలు తీసుకోబడినాయి. షెడ్యూలు తరగతులు, షెడ్యూలు కులాలకు చెందిన విద్యార్థుల శ్రేయస్సు కొరకు 31 ప్రభుత్వ హాస్టళ్లు, 32 ఇతర సబ్సిడీ హాస్టళ్లు నిర్వహించబడుతున్నాయి. ఈ హాస్టళ్ళవల్ల 2458 మంది విద్యార్థులకు లాభం చేకూరుతున్నది.

గృహనిర్మాణ పథకం

షెడ్యూలు తరగతులు, గిరిజనుల కొరకు 1971–72 లో 1,500 ఇండ్లు నిర్మించడానికి ప్రతిపాదించబడింది. ఈ ఇండ్ల నిర్మాణానికి గిరిజనులకు ఋణసౌకర్యాలు కల్పించబడుతాయి.

ఖమ్మంజిల్లా యాత్రాస్థలాలకు కూడా పేరుపొందింది. భద్రాచలంలోని ప్రసిద్ధదేవాలయం సంవత్సరం పొడుగునా లక్షలాది యాత్రికులను ఆకర్షిస్తున్నది.




* ఫిరోజ్ పూర్ వద్ద సెహ్రాజాలో పాకిస్తాన్ సైనికులు పారిపోతూ పది ట్రక్కులకు సరిపడే మందు గుండు సామగ్రి వదలి వెళ్లారు.



* దర్శన విముక్తమైన తర్వాత మనసేనలు బంగ్లాదేశ్‌లో కొత్చాంద్‌పూర్ వైపు పురోగమించాయి

* డేరాబాబా నానక్ వంతెన వద్ద జరిగిన యుద్ధంలో పట్టుబడిన పాకిస్తాన్ సైనికులు





అది శృంగగిరి, దానినే ఈనాడు శృంగేరి అంటారు.

శృంగేరి తుంగ భద్రానదీ తీరంలో వుంది. రెండు వేల యేండ్లకు ముందు ఆది శంకరుడా ప్రాంతానికి వచ్చాడు. అచ్చటున్న విభాండక వనాన్ని దర్శించాడు. ఆ ప్రాంత సౌందర్యాన్ని తిలకించి పులకించాడు. తన భవిష్యత్కార్యక్రమాని కచ్చటినుండే రూపురేఖలు దిద్దుకొన్నాడు.

శృంగేరి చాల ప్రశాంత వాతావరణంతో కూడుకొన్న ప్రాంతం. ఏకాగ్రతకది చక్కని ప్రదేశం. అందుకే ఆది శంకరుడా ప్రాంతాన్ని ఎన్నుకొన్నాడు. అచ్చట శారదా పీఠాన్ని స్థాపించాడు. తన శిష్యులకు అద్వైత మతాన్ని బోధించాడు. ఆ యద్వైత మత ప్రచారానికని తన శిష్యులలో నొకరినచ్చట ఆచార్యుణ్ణి గావించాడు.

ఆదిశంకరుడచ్చట సుమారు పండ్రెండేండ్లు వశించాడని అంటారు. ఆకాలంలోనే అతడు ఉపనిషత్తులకు, బ్రహ్మసూత్రాలకు గూడ భాష్యం వ్రాశాడని అంటారు.

ఆదిశంకరుడే గాక ఆనందాచార్యుడు గూడ అచ్చట తోటక వృత్తాల నల్లాడని, సురేశ్వరాచార్యుడు తైత్తిరీయ బృహదారణ్యోపనిషత్తులకు వార్తికాలు వ్రాశాడని, పద్మపాదుడు పంచపాదికను రచించాడని అంటారు. ఆనాటినుండి శృంగేరి అద్వైతమతానికొక కేంద్రంగా వుంటూవస్తున్నది.

అది పదునాలుగవ శతాబ్దంలో ప్రథమదశ. ఆనాడు శృంగేరి పీఠానికి శ్రీమాధవ విద్యారణ్యయతీంద్రుడు ఆచార్యత్వం వహిస్తున్నాడు. ఆదిశంకరుని తరువాత శృంగేరి పీఠ గురుపరంపరలో అంతటి మేధావి, అంతటి ప్రతిభావంతుడు, అంతటి పండితుడు రాలేదంటే అందులో అతిశయోక్తి ఏమీ లేదు.

విద్యారణ్య యతీంద్రుడదివరకే ఆదిశంకరుని జీవితాన్ని శంకర విజయమనే పేరుతో రచించాడు. పంచదశి అనే అద్వైత మతగ్రంథాన్ని, జైమినీన్యాయమాలను, పరాశరధర్మ శాస్త్రానికి పరాశర మాధవీయ మనే పేరుతో ఒక వ్యాఖ్యను, సర్వదర్శన సంగ్రహమనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించి గొప్పపేరు ప్రతిష్ఠల్ని సంపాదించాడు. ఆ నాటికే అతడు హైందవ తత్వ వేత్తగా పేరెన్నిక గని వున్నాడు.

విద్యారణ్యయతీంద్రుడే గాదు అతని సోదరులైన సాయణ, భోగరాజులు గూడా చాలా గొప్పవారు. ప్రజ్ఞావంతులు, శేముషీధురందరులు. మహా విద్వాంసులు, వారిలోసాయణుడు వేదాలకు భాష్యం వ్రాశాడు. ఆ భాష్యాన్నతడు తన సోదరుడైన విద్యారణ్య యతీంద్రునికి చూపి దానిపై అతని అభిప్రాయాన్ని తెలుసుకొనడానికి రెండు దినాల క్రితమే శృంగేరికి వచ్చాడు.

అది సాయం సమయం. ఆ సమయంలో శృంగేరి చాల ప్రశాంతముగా వుంది. సోదరులిద్దరూ తుంగభద్రా నదీతీరానవున్న ఒక వటవృక్షం క్రిందకూర్చొని వేద భాష్యాన్ని పరిశీలిస్తూవున్నారు ఆ భాష్యాన్ని పరిశీలించిన కొద్దీ విద్యారణ్యయతీంద్రుని మోము ఆనందంతో కళకళలాడ జొచ్చింది.

" ఇది నిజంగా ఒక అపూర్వమైన భాష్యం. ఇంతవరకు వేదాల కిలాంటి భాష్యాన్ని ఎవరూ వ్రాయలేదు'' అన్నాడు విద్యారణ్య యతీంద్రుడు సన్నగా నవ్వుతూ తాటి ఆకులు తిరగవేస్తూ.

ఆ మాటలు సాయణునికి ఎంతో ఆనందాన్ని కలిగించాయి.

"కలకాలం నిలువగల భాష్యమిది.'' అన్నాడు యతీంద్రుడు మరొకసారి.

''నన్నుత్సాహపరచడానికి శ్రీపాదులు అలా అంటున్నారను కొంటాను'' అన్నాడు సాయణుడు. కాని అతని మనస్సుమాత్రం ఆనందముతో నిండిపోయినది.

"ఉత్సాహపరచడానికి గాదు సాయణా. నిజమే చెబుతున్నాను. నిజంగా ఇది ఆచంద్రార్కమూ వుండి తీరుతుంది."

''ఇది వుంటే గదా నిలిచేది?" అన్నాడు సాయణుడు కొంత దీనంగా. ఏదో బాధ అతని మనస్సులో ప్రవేశించింది.

"ఎందుకలా అంటావు సాయణా?'' ప్రశ్నించాడు యతీంద్రుడు.

"హైందవ మతాన్నే తుడిచి పెడుతున్న మహమ్మదీయులు ఈ పీఠాలను. ఈ గ్రంథాలను, ఈ భాష్యాలను వుండనిస్తారా?'' సాయణుడొక నిట్టూర్పు విడిచాడు.

అతని మాటలర్థమయ్యాయి యతీంద్రునికి. అతడొక చిరునవ్వు నవ్వాడు.

''నా మాట లబద్ధమంటారా?'' ప్రశ్నించాడు సాయణుడు.

అబద్ధమని నేనను. కాని అది వారికంత సులభసాధ్యం కాదని మాత్రం నేననగలను''

"చూడండి. వారేవిధంగా దేవగిరిని ధ్వంసంచేశారో, కాకతీయ సామ్రాజ్యాన్ని నాశనంగావించారో, హిందూ దేవాలయాలను నేలమట్టం మొనరించారో, వేదగ్రంథాలను తగులబెట్టారో. ఆలాంటి వారు యీ పీఠాలను, యీ భాష్యాలను వుండనిస్తారా?'' ఆమాటలంటున్నప్పుడతని కంఠంలో ఒక విధమైన గద్గదిక తోచింది.

యతీంద్రుడు మరలా నవ్వాడు.

"హిందూమత చిహ్నాలను వారు ధ్వంసం, చేయగలరేమోగాని, హైందవ తత్వాన్నిగాని, హైందవ ధర్మాన్నిగాని వారేమీ చేయలేరు. అది ఎల్లప్పుడూ ఆలాగే వుంటుంది." అన్నాడు యతీంద్రుడు.

"మీకు విశ్వాసమున్నదేమోగాని, నాకుమాత్రం భయం వేస్తున్నది." అన్నాడు సాయణుడు.

"గతచరిత్రే నావిశ్వాసానికి కారణం. వేదమతాన్ని ఎవరూ నాశనం చేయలేరు. దీన్నినాశనం గావించడానికిదివరకే ఎన్నో మార్లు ప్రయత్నాలు జరిగివున్నవి. కాని అవియేవి ఇంతవరకు నెరవేరివుండలేదు. సోమకాసురుడు వేదాలను సంగ్రహించిన నాటినుండి యీ నాటివరకు ఎవరికీ వేదాలను నాశనం చేయడానికి వీలుకాలేదు. వేదాలున్నంతవరకు హిందూమతం నాశనంకాదు." అన్నాడు యతీంద్రుడు.

"ఆ కాలంవేరు. ఈ కాలంవేరు. నాడు ఆ మతాన్ని రక్షించడానికెందరో ప్రయత్నించారు కాని ఈ నాడెవరున్నారు? హైందవమతం ఈ నాడెంతో క్లిష్టదశ నెదుర్కొంటున్నది."

"అదిమాత్రం నిజమే. కాని యీ క్లిష్టదశ ఇకయెన్నాళ్లో వుండదు"

"ఆ పరిస్థితి కనబడడంలేదు. భవిష్యత్తంతా అంధకారమయంగానే వుంది"

"ఇప్పుడలాగే వుంటుంది. త్వరలోనే ఆశాకిరణం కనబడుతుంది"

"మీరాశావాదులు. మీరనుకొన్నట్లే జరగనీయండి."

విద్యారణ్యుడు, సాయణుడు మాట్లాడుకొనే నాటికి దక్షిణ హిందూస్థానమంతా మహమ్మదీయుల వశమైవుంది. రెండు దశాబ్దాల కాలంలో ఆ ప్రాంతంలోవున్న హైందవ రాజ్యాలన్నీ ముస్లిములకు పాదాక్రాంతమై పోయినవి.

దక్షిణాపథంలో ప్రధానమైన నాలుగు రాజ్యాలుండేవి. వాటిలో ఒకటి- యాదవుల పరిపాలనలో నుండిన దేవగిరిరాజ్యము. రెండవది కాకతీయుల ఆధిపత్యంలో వెలసిన ఓరుగల్లు రాజ్యము. మూడవది ద్వార సముద్రం రాజధానీ నగరంగా గలిగిన హొయసల రాజ్యము. నాలుగవది కాంచీపురం ప్రధాన నగరమైన చోళ రాజ్యము ఈ నాలుగు రాజ్యాలు బలమైనరాజ్యాలే. కాని వీటిని పరిపాలించే రాజులెన్నడూ ఒకటిగా లేరు. పైగా వారి మధ్య విద్వేషాలు పెరిగి యుద్ధాలు సంభవింప సాగినవి.

దేవగిరి యాదవులకు, ఓరుగల్లు కాకతీయులకు ఎన్నడూ పడలేదు. తరతరాలనుండి వారు పోరాడుకుంటూనే వున్నారు. కాకతీయ రుద్రదేవరాజుకు, దేవగిరి జైత్రపాలునికి జరిగిన యుద్ధంలో రుద్రదేవుడు మరణించాడు. ఆ తరువాత రుద్రదేవుని కుమారుడైన మహాదేవరాజు ప్రతీకారేచ్ఛతో దేవగిరి మీద దండెత్తాడు. ఆ సంగ్రామంలో మహాదేవరాజే సంహరించబడ్డాడు. అతని కుమారుడైన గణపతిదేవుడు బంధించబడ్డాడు.

గణపతిదేవుడు బంధించబడిన తరువాత కొన్ని సంవత్సరాలు దేవగిరి కారాగారంలోనే వుండవలసి వచ్చింది. ఆ తరువాత అతడు బంధవిముక్తుడైనప్పటికీ అతనికి దేవగిరి రాజులమీదనున్న కోపంచల్లారలేదు. అందువల్ల మరొకసారి దేవగిరి రాజులకు కాకతీయులకు యుద్ధం సంఘటిల్లింది ఆ యుద్ధంలో దేవగిరి రాజులు ఓడిపోయారు.

గణపతిదేవుని తరువాత అతని కుమార్తె రుద్రమదేవి కాకతీయ సామ్రాజ్యానికి అధిపతి అయింది. ఆమె కాలంలో గూడ దేవగిరికి, ఓరుగల్లుకు మధ్య యుద్ధమాగలేదు. ఒక స్త్రీ ఏకశిలానగరాన్ని పరిపాలిస్తున్నది గనుక, ఆమెను ఓడించడం సులభమని దేవగిరి యాదవరాజు కాకతీయ సామ్రాజ్యం మీదికి దండెత్తి వచ్చాడు అప్పుడతడు రుద్రమ్మచేత ఓడించబడ్డాడు. ఈ విధంగా దక్షిణాపథంలోనున్న బలమైన రెండు హిందూ రాజ్యాల మధ్య నిరంతరం పోరాటం జరుగుతుండడం వల్ల ఈ రెండు రాజ్యాలు బలహీనపడిపోయినవి.

అంతేకాదు కాకతీయులు చోళ రాజులతో గూడ నిరంతరం పోరాటం జరపసాగారు. హొయసలులతో విరోధాన్ని కొని తెచ్చుకొన్నారు. ఆ విధంగా చేయడంవల్ల తామందరూ బలహీన పడుతున్నామని ఆ రాజులు భావించలేదు. అల్లావుద్దీను సేనా నాయకుడైన మాలిక్‌కాఫర్ దేవగిరిని ముట్టడించినప్పుడే దక్షిణా పథానికి, ఈ ఢిల్లీ సుల్తానుల వల్ల రానున్న ప్రమాదాన్ని కాకతీయ సార్వభౌముడు గుర్తించి వుండవలసింది. కాని అతనలా చేయలేదు. దేవగిరి రామచంద్రదేవుడు మాలిక్‌కాఫర్ సైన్యాలచేత ఓడింప బడుతున్నప్పుడు, ఢిల్లీ సుల్తాను పతాకం దేవగిరిపై ఎగురవేయబడి నప్పుడు కాకతీయులు అమితానందం జెందారు. కాని ఆ తరువాత కొద్ది కాలంలోనే ఆ మాలిక్‌కాఫర్ ఓరుగల్లుమీద పడుతాడని వారు కలలోగూడ అనుకోలేదు.

కాకతీయులు మాలిక్‌కాఫర్ దాడిని త్రిప్పికొట్టగలిగినప్పటికీ తుగ్లక్ దండయాత్రను ఆపలేకపోయారు. తుగ్లక్ సేనలు ఏక శిలానగరం మీద దండెత్తినప్పుడు దేవగిరి యాదవులు అతనికి సాయంగా నిలవడమేగాక, ప్రతాపరుద్ర చక్రవర్తికి వ్యతిరేకంగా అతని సేనానులలో కొందరినీ, ఏకశిలా నగరాధ్యక్షుణ్ణి వశపరచు



కొని వారిద్వారా కుట్రగావించి, ప్రతాపరుద్రుణ్ణి ముస్లిం సేనలకు పట్టించి యిచ్చారు. ఆ విధంగా ఆ రాజ్యాలు రెండు తమ మధ్య వున్న విద్వేషాలకు ఆహుతియై మహమ్మదీయ రాజుల హస్తగత మైనవి.

బలమైన దేవగిరి. కాకతీయ రాజ్యాలు పడిపోవడంతో దక్షిణాప్రధానికున్న కోటగోడలు పడగొట్టబడినట్లయింది. అందువల్ల మిగిలిన చోళ హొయసల రాజ్యాలుగూడ సులభంగా ముస్లిములకు లొంగిపోయినవి.

ముస్లిములాక్రమించిన హైందవరాజ్యాలు చాలా ఇడుమలు బడవలసి వచ్చింది. మహమ్మదీయులు హిందువుల రాజ్యాల నాక్రమించుకొనడానికి మాత్రమే రాలేదు, ధనధాన్యాలను వజ్ర వైడూర్యాలను స్వాధీనపరచుకొనడానికి మాత్రమే దండయాత్రలు జరపలేదు, హైందవ మతాన్ని నిర్మూలించి మహమ్మదీయ మతాన్ని నెలకొల్పడానికి వచ్చారు. అందువల్ల వారు హిందూ దేవాలయా లను నేలమట్టం గావించారు. పూజారుల తలలు తరిగించారు. అగ్రహారాలను స్వాధీనం గావించుకొన్నారు. వేలాదిమంది హిందువులను మహమ్మదీయులుగా మార్పించారు. హిందూ మత గ్రంథాలను భస్మపటలం చేశారు. అయినా వారికి తృప్తి కలుగ లేదు.

రాజమహేంద్రవరంలో నుండిన చాల పురాతనమైన హైందవ దేవాలయాన్ని తుగ్లక్ సేనలు మసీదుగా మార్చినప్పుడు ఆ దేవాలయంలో నున్న అర్చకులతలల్ని తరిగి ఆ రక్తాన్ని ఆ దేవునిమీద కుమ్మరించినప్పుడు ఆ పట్టణ ప్రజలేకాక ఆ ప్రాంత ప్రజలందరు ఎంతో బాధపడ్డారు. ఆ విధంగానే ఇతర ప్రాంతా లలో అలాటి బీభత్సం జరిగినప్పుడు ప్రతివారు కళ్ళలో నీళ్ల నింపారు.

ఇన్నిటికంటే ప్రజల్ని కలచివేయగల దారుణ సంఘటన మరొకటి జరిగింది. ప్రతాపరుద్ర చక్రవర్తి బంధించబడిన తరువాత అతడు ఢిల్లీకి తీసుకొనిపోబడినాడని. అచ్చటవధించ బడి నాడని ఒక వదంతి ప్రబలింది. అది ప్రజలందరినీ మరింత బాధ పెట్టింది.

ఈ దుర్ఘటనలన్నీ జరిగినందువల్ల దక్షిణాపథంలో ఇక హిందువులకు రక్షణ వుండదనే భయం ప్రతివారిలోను ఏర్పడింది. అందుకనే సాయణుడు గూడ విద్యారణ్య యతీంద్రునితో ఆ విధంగా మాట్లాడారు.

దక్షిణ హిందూస్థానంలో హైందవ రాజ్యాలన్ని పతనమైనా యన్న విషయం శ్రీ మాధవ విద్యారణ్యయతీంద్రునికి తెలియక పోలేదు. హైందవమతం ఆనాడెదుర్కొంటున్న ప్రమాదాన్ని గూర్చిగూడ అతడు తక్కువ అంచనా వేయలేదు. ఆ పరిస్థితులలో హిందువుల రక్షించి హిందూమతోద్ధరణ చేయడం ఏలాగా అన్న విషయాన్ని గూర్చి అతడు ఆలోచిస్తూనే వున్నాడు. అత డొక

యతీ మాత్రమేగాదు, హైందవ మతోద్ధరణ కవసరమైతే ఏ త్యాగం చేయడానికైనా సిద్ధంగావున్న మహావీరుడు. రాక్షసులు మహర్షుల్ని బాధలు బెట్టి యజ్ఞ యాగాదులను నాశనం గావిస్తున్నప్పుడు. వాటి రక్షణకోసం బయలు దేరిన విశ్వామిత్రుని చరిత్ర నా యతీంద్రుడు మరచి పోలేదు, తానుగూడ నాడువిశ్వామిత్రుని పాత్రను వహించ వలసి వస్తుందని అతడు నిర్ణయించుకొనేవున్నాడు, కాని తన పాత్ర నిర్వహణ కనువుగా రామలక్ష్మణుల లాగా మరికొందరు తనకు కావలసి వున్నది. అందు కోసమే అతడు వేచి చూస్తున్నాడు అందుకనే సాయణాచార్యులుకున్న నిరుత్సాహమత నిలో లేకున్నది. నిరాశ అతన్ని తేరి చూడలేకున్నది. అతడు నిష్ఠాగరిష్ఠుడు కర్తవ్యపరాయణుడు. అందువల్లనే అతడు ధైర్యంగావున్నాడు,

అంతేకాదు. అతడు తన బాధ్యతను గూడ పూర్తిగా గుర్తించివున్నాడు. కాంతులను వెదజల్లే ఒక జ్యోతిలాగా జ్వలించి హిందువులకు, వారి మతానికి నాయకత్వం వహించి వారికి దారి చూపడానికే ఆనాడాది శంకరుడు శృంగేరిలో ఆ పీఠాన్ని నెలకొల్పి ఒక గురు పరంపరను సృష్టించి వెళ్ళాడన్న విషయం అతనికి తెలుసు. తానాగురు పరంపరకు చెందినవాడు గనుక, హైందవ మతోద్ధరణ అనే గురుతర బాధ్యత తన మీద వున్నదన్న విషయం గూడ అతనికి తెలుసు. అందుకనే అతడు భగవంతుని మీద భారం వేసి తన కర్తవ్యాన్ని గూర్చి ఆలోచిస్తూవున్నాడు. ఆ దేవదేవుడే దారిచూపగలడని ఎదురుచూస్తున్నాడు.

"సాయణా! మనమీదెంతో గురుతర బాధ్యత వున్నది దానిని మనం నిర్వర్తించితీరాలి.

ఆ పలుకులెంతో గంభీరంగా వున్నవి, సాయణుడు యతీంద్రుని వైపు చూచాడు. అతడెంతో గంభీరంగా వున్నాడు, ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"మనం హైందవమతాన్ని ఉద్ధరించి తీరాలి. ఆ దేవదేవుడా బాధ్యతను మన భుజస్కంధాలమీద పెట్టివున్నాడు." అన్నాడు యతీంద్రుడు.

"అది మనచేతనవుతుందా?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు సాయణుడు.

"ఎందుకు కాదు. అవుతుంది." అన్నాడు యతీంద్రుడు.

"రాజాధిరాజులు, సార్వభౌములు చేయలేనిపని మనం చేయగలమా? ముస్లిం సేనావాహినులకు మనం అడ్డుకట్టలు వేయగలమా?" సందేహంతో ప్రశ్నించాడు సాయణుడు.

"ఆనాడు విశ్వామిత్రుడేమిచేశాడో దానిని మనం నిర్వర్తింప వలసి వున్నది."

"నాకర్థంకాలేదు."

"విశ్వామిత్రుడొక మహావీరుడు. అతడెన్నో యుద్ధాలు గావించాడు కడకు సన్యసించాడు. కాని రాక్షసులు మహర్షుల్ని హింసిస్తున్నప్పుడు యజ్ఞయాగాదుల్ని ధ్వంసం గావిస్తున్నప్పుడు, నానాదుష్కృత్యాలను కొనసాగిస్తున్నప్పుడు ఊరకుండలేక పోయాడు. అతడొక మహర్షి అయిన తరువాత తానై విల్లమ్ముల్ని ధరించలేకపోయాడు. రామలక్ష్మణులచేత తాననుకొన్న కార్యాన్ని సాధింపజేశాడు. ఆ విధంగానే మనం గూడ చేయాలి. రామలక్ష్మణులకోసం యత్నించాలి." అన్నాడు యతీంద్రుడు. అప్పుడతని ముఖం ఎంతో తేజోవంతమయింది అతని కళ్లు జ్యోతులలాగా వెలుగొందినవి."

"విశ్వామిత్రుని కార్యనిర్వహణకు రామలక్ష్మణులనువారు లభించారు, కాని ఈనాడెవరున్నారు. రాజులందరూ నాశనం గావించబడ్డారు. వీరాధివీరులందరూ యుద్ధంలో ఆసువుల్ని గోల్పోయారు. ఈనాడు మిగిలియున్నదెల్లా సామాన్యప్రజలు. వారి మూలంగా ఢిల్లీసుల్తాను నెదిరించడం అంత సులభమైన కార్యమా?"

"కాదని నాకు తెలుసు, కాని రామలక్ష్మణులలాటి వారు లభించినప్పుడు అదేమంత కష్టంకాదు సులభంగా మరలా ప్రతిఘటనను కొనసాగించవచ్చు, సామాన్య ప్రజలలోనుండి వీరాధివీరుల్ని సృష్టించవచ్చు. ఏలాటి బలమైన శత్రువునైనా నాశనం గావించవచ్చు."

"మీరు తపస్సంపన్నులు, మీయభీష్టం తప్పనిసరిగా నెరవేరాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను." అన్నాడు సాయణుడు.

"అంతా ఆ దేవుని దయ." అన్నాడు యతీంద్రుడు.

[సశేషం]

[21 వ పేజీనుండి]

సంక్రాంతి సంభ్రమం

ఋతువు. నూనె, గుమ్మడి మొదలైనవి ఈ ఋతువులో సేవించ దగినవి.

సంక్రాంతి సంభ్రమం భోగి, పెద్ద పండుగ, కనుము ఈ మూడు రోజులదే కాదు. సంక్రాంతికి ముందు ఒక నెల అంతా— అంటే ధనుర్మాస మంతా—సంక్రాంతి సంభ్రమమే. ముగ్గులూ, గొబ్బిళ్లూ, బొమ్మల కొలువులూ, భజనలూ, విష్ణ్వాలయాలలో పొంగలి ప్రసాదాలూ, దాసరుల సంకీర్తనలూ, గంగిరెద్దుల వారి సన్నాయి వాద్యాలూ—అంతా ఇంతా సంభ్రమం కాదు.

సంపన్నులు ఆనాడు లేనాసి అనకుండా పేదలకు దానం చేస్తారు. ఎంత పాపం చేసినవారైనా సరే ఆనాడు ప్రాణం విడిచిపెట్టితే వారికోసం స్వర్గ ద్వారం తెరిచి ఉంటుంది. సంవత్సరమంతా గంజికైనా నోచుకోని నిరుపేదలకు పరమాన్నం తినే సంభ్రమం. శరీరం విడిచి పెట్టినవారికి స్వర్గం చేరుకోవాలనే సంభ్రమం. బ్రతికి ఉన్న వారికీ, చనిపోయిన వారికీ కూడా సంభ్రమమే మరి మకర సంక్రాంతి నాడు. *




భారతదేశం ప్రతి ఏడూ 35 కోట్ల రూపాయల విలువగల సిగరెట్ పొగాకును ఎగుమతి చేస్తోంది. మన యీ ఎగుమతుల స్థాయిని నిలబెట్టుకోవాలన్నా, యింకా యీ ఎగుమతుల్ని పెంపొందించుకోవాలన్నా, భారతీయ పొగాకు యొక్క నాణ్యత అంతర్జాతీయ మార్కెట్ల స్థాయితో సరితూగ గలగాలి.

భారతదేశంలో ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీవారే మొట్టమొదటిసారిగా–అంటే 1908 లోనే సిగరెట్లు తయారుచేసే పొగాకును పండించటానికి ప్రోత్సహించారు. 1920లో ఐ ఎల్ టి డి వారు వర్జీనియా పొగాకునూ, 1928లో ఫ్లూ క్యూరింగు పద్ధతినీ ప్రవేశపెట్టటం వల్ల పొగాకు పరిశ్రమలోనే ఒక విప్లవం వచ్చింది. ఈనాడు, యీరకపు పొగాకు మనదేశపు మొత్తపు పొగాకు ఎగుమతుల్లో నూటికి 90 పాళ్ళు ఆక్రమించింది.

ఐ ఎల్ టి డి వారు 1933లో మొదటి సారిగా సిగరెట్ తయారు చేసే పొగాకును ఎగుమతి చేసారు. మామూలు ప్రమాణంలో మొదలైన యీ ఎగుమతులు, యీనాడు ఏడాదికి 9.5 కోట్ల రూపాయల పైగా విలువగల స్థాయిని అందుకున్నాయి. ఈ ఎగుమతుల్ని సాధించటంలో ఐ ఎల్ టి డి వారికి వారి అనుబంధ సంస్థ, ఇండియా టొబాకో కంపెనీ లిమిటెడ్ వారు సహకరించి, దేశంలో పొగాకుకు ఒక స్థిరమైన మార్కెట్టును సమకూర్చారు. అంతర్జాతీయంగానూ, దేశంలోనూ పొగాకు గిరాకీలో వస్తూన్న మార్పుల్ని దృష్టిలో వుంచుకుని, ఎటు మొగ్గుతోందో పరిశీలిస్తూ, భారతదేశంలోని పొగాకు పరిశ్రమ అభివృద్ధి కోసం, యీ రెండు సంస్థలూ కృషిచేస్తున్నాయి. ఇదిగాక, 1959లో ఐ ఎల్ టి డి వారు భారత ప్రభుత్వముతోనూ, ఆంధ్ర, మైసూరు రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసి ప్రయోగాలు మొదలు పెట్టిన విషయం గమనార్హం. ఈ ఇసుక భూముల్లో పండిన పొగాకు పంట నాణ్యతలో అంతర్జాతీయ స్థాయికి వెళ్ళగలగటం యీ ప్రయోగాలు సఫలమైనాయన్నదానికి ప్రత్యక్ష నిదర్శనం.

ఈ ప్రాంతాలలో పండించే పొగాకు, ప్రయోగాత్మక స్థితినుంచి ముందుకు పోవటమే కాకుండా, యిది నాణ్యతలోనూ, దిగుబడిలోనూ కూడా అంతర్జాతీయ ప్రమాణాలకి పోల్చదగ్గదిగా ఉంది.



ఐ ఎల్ టి డి వారి దృష్టిలో, నాణ్యతను పెంచటం అంటే ఎగుమతులను పెంపొందించటం అన్నమాట.

ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్

తెలుగుతల్లి

— శ్రీ పులిచెర్ల సాంబశివరావు

తెలుగు తల్లి సకల సంపత్సమేత. ఈ సౌభాగ్యవతిని ప్రాచీనాంధ్ర కవులు పెక్కు చోటులకీర్తించినారు. సందర్భమును బట్టి మూలమున లేకున్నను రామాయణ, భారత, భాగవతాది మహా గ్రంథములలో తెలుగు దేశపు ప్రసంగమును కల్పించి చెప్పి తమ దేశ భక్తిని నిరూపించు కొన్నారు. తెలుగు దేశపు గాలిని, నీటిని, వృక్షములను సైతము మనోరంజకముగా శ్రీనాథుని వంటి కవులు వర్ణించినారు.

పరపాలనా ప్రభావమున ఆంధ్రులలో దేశభక్తి కొరవడినది. పర దేశముల మీదను, భాషల మీదను మోజు హెచ్చినది.

అట్టితరి తెలుగు గడ్డన పుట్టిన కవి కోకిలలు తెలుగు తల్లి వైభవమును వేనోళ్ల కీర్తించి జాతికి జాగృతిని కలుగ జేసినవి. ఆధునికముగా వచ్చిన ఖండ కావ్య ప్రక్రియ వారికెంతయు తోడ్పడినది.

అట్టి ఆధునికాంధ్ర కవులలో రాయప్రోలు సుబ్బారావు గారు ప్రథమ గణ్యులు. వారి "బహుధాన్య"లో ఉగాది తల్లి నిట్లు స్తుతించినారు.

"అతి చిరంతనావిచ్ఛిన్న మయిన ఆంధ్ర
జాతి భూత చరిత్రను సంస్మరించి,
తద్భవిష్యదభ్యుదయ సంధాన మెంచి
కలుపవమ్మ ! ఏకముగా, ఉగాది తల్లి"

వారి ప్రబోధ గీతము తెలుగు నాట అధిక ప్రాచుర్యము సంపాదించినది. ప్రాచీనాంధ్ర ప్రశస్తిని వేనోళ్ల చాటిన ఈ గీతమును చూడుడు.

"అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించు నాడు,
ఓరుగల్లున రాజ వీర లాంఛనముగా
బలు శస్త్ర శాలలు నిలుపు నాడు,
విద్యానగర రాజ వీధులన్ గవితకు
పెండ్లి పందిళ్లు కప్పించు నాడు,
పొట్నూరికి సమీపమున నాంధ్ర సామ్రాజ్య
దిగ్జయ స్తంభ మెత్తించు నాడు
...."

అని ప్రాచీనాంధ్ర దేశపుటౌన్నత్యమును చాటి,

"జ్ఞప్తి కెలయించు చున్నాడ, చావలేదు
చావ లేదాంధ్ర జన మహోజ్వల చరిత్ర
హృదయములు చీల్చి చదువుడో సదయులార :

అని ప్రబోధించినారు.

వారి "పుస్తకములో" 'నిండార బారు నఖండ గోదావరి' లో దాగిన చాళుక్య నాగరికతను, పాడైన పెనుకోట గోడల దీర్ఘ నిద్ర పోవు కాకతీయ ప్రాభవమును కొనియాడినారు. ఆ తెలుగు తల్లి అనుంగు బిడ్డల పరాక్రమాది గుణములను "ఆంధ్రమాత" లో నిట్లు స్తుతించినారు.

"ఆ చాళుక్య నృపాల రత్నముల నియ్యమ్మంది, శ్రీకాకతి క్ష్మాచక్రేశుల లాలనల్ వడిసి, కృష్ణ ప్రాజ్య సామ్రాజ్య పీఠీచంచజ్జయ కన్యలో సరస గోష్ఠిన్ ప్రొద్దు వోబుచ్చు నీ ప్రాచీనాభ్యుదయమ్ము నెన్నెదరు గర్వ స్ఫూర్తి తల్లీ ! సుతుల్.

వారి యితర కవితా ఖండిక లొక యెత్తు, "జన్మ భూమి" ఖండిక ఒక్కటే ఒక యెత్తు ! ఇది కదలించే కవిత్వము. నరాల నుప్పొంగ జేయు సత్తాగల కండ యున్న కవిత్వము. అందుకే ఈ విధమైన గీతాలలో నిది సర్వోత్కృష్ట మయినదని పేరు వడ్డది.

"ఏ దేశమేగినా, ఎందు కాలిడిన,
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనిన
పొగడరా నీతల్లి భూమి భారతిని,
నిలుపరా నీజాతి నిండు గౌరవము.

ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో,
జనియించినాడ వీ స్వర్గ ఖండమున :
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో,
నిను మోచె ఈ తల్లి కనక గర్భమున".

నీరసించి పోవు చున్న జాతికి ప్రాణ ప్రతిష్ఠ జేసి పుణ్యము కట్టుకొన్న ఈ గీతములు మరువ రానివి కదా !

ప్రబోధాత్మకమైన విశ్వనాథ సత్యనారాయణ గారి కృతులలో దేశ భక్తి పూరితమైన "ఆంధ్ర పౌరుషము" ఎన్నదగినది. తెలుగు గడ్డను, దాని ప్రాచీన వైభవమును చక్కగా వర్ణించినారు.

"గోదావరీ పావనోదార వాఃపూర
మఖిల భారతము మాదన్న నాడు,
తుంగభద్రా సముత్తుంగ రావము తోడ
కవుల గానము శ్రుతి గలయు నాడు,
పెన్నానదీ సముత్పన్న కైరవ దళ
శ్రేణిలో తెన్గు వాసించు నాడు,
కృష్ణా తరంగ నిర్ణిద్రగానము తోడ
శిల్పమ్ము తొలి పూజ సేయు నాడు

అక్షర జ్ఞాన మెరుగదో యాంధ్ర జాతి,
విమల కృష్ణానదీ సైకతముల యందు
కోకిలపు బాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చు కొన్నది పూర్ణిమా నిశల యందు

ఇట్లే విశ్వనాథ వారి 'వేగిక్షేత్రము' లో తెలుగు దేశపుటాచార వ్యవహారములు వర్ణింపబడినవి.

"ఏ రాజు పంచెనో యిచట శౌర్యపు పాయ
సమ్ములు నాగుల చవితి నాళ్ల,
ఏ యెఱ్ఱ సంజలో నెలమి పల్లవరాజ
రమణులు కాళ్ల బారాణు లిడిరో,
చిత్రరథస్వామి శ్రీ రథోత్సవములో
తెలుగు పిల్లలు కత్తి త్రిప్పి రెపుడో,
ఏ రెండు జాముల యినుని వేడిమి వచ్చి
కలసి పోయెనో త్రిలింగ ప్రభువుల"

ఇంత చక్కని తెలుగు దేశపు కమ్మని కథలు తలచినంత మాత్రమున హృదయముప్పొంగని తెలుగువాడుండడు గదా : అందుకే విశ్వనాథ వారీ ఖండిక లోనే

"ఇమ్మగ గాకుళమ్ము మొదలీ వరకుం గల
యాంధ్ర పూర్వ రాజ్యమ్ముల పేరు చెప్పిన,
హృదంతర మేలో చలించి పోవు,
నార్ద్రమ్మగు చిత్త వృత్తుల పురాభవ నిర్ణయ మేని
ఎన్ని జన్మమ్ములుగాగ నీతనువునన్
బ్రవహించునో యాంధ్ర రక్తముల్

అని యన్నారు. విశ్వనాథ వారి జీవునికి వేదన ఎక్కువ కాని, ఆ వేదనను వెల్లడించుట ఎంత కష్టము ! మహాకవికే ఇట్లుండ సామాన్యుల సంగతి వేరుగ జెప్ప వలెనా ?

"ఇది వినిపింతునంచు మదినెంచెద మిత్రులకున్,
గళస్థగాద్గదికము, లోచనాంత
బహుధా స్రుతబాష్పనదమ్ము, స్పందానాస్పద
హృదయమ్ము, నాపనికి జాలక చేసెడు, నన్ను
వింతగా నెద పదలించు కొన్నదిది యెక్కడి
పూర్వపు జన్మ వాసనో !"

అని ఆ మహాకవి తమ పూర్వజన్మ వాసనను వివరించారు.

తెలుగు తల్లి ముద్దుల బిడ్డడు చిరంజీవి జాషువా. "గడన కెక్కిన యాంధ్ర పుత్రుడను నేను" అని గర్వింప గల్గిన దిట్ట. సకల కళా సంపదలకు నాలవాలమైన తెలుగు దేశము విశ్వ విఖ్యాతి గడించినది. కళా రంగమున తెలుగు బిడ్డల పాండిత్యమును చాటు జాషువాగారి 'తెలుగుగడ్డ' పద్యములవశ్యము పఠనీయములు.

"పిసిని కాయను పట్టు వసనంబు నిమిడించు
చేనేత పనుల కాశీస్సు లొసగి
తుల లేని యల కొండపలి బొమ్మ పని వారి
పని తనంబునకు జీవనము చూపి
గడన కెక్కిన కూచిపుడి వారి వరకథా
కళి నాట్య కళ కింత కబళ మొసగి
అరవ దేశమున బావురుమంచు శోకించు
త్యాగయ్య గానంబు నాదరించి
మృదుల జాతీయ కవన శారదల సొగసు
సకల దేశాలలో ప్రదర్శనము జేసి
సంతరింపుము శాంతి సంసార సుఖము
దివ్య దాశయ సుమవల్లి ! తెలుగు తల్లి !

ఆ ప్రాచీన సంపదలు నశించినవి. ప్రాచీన వైభవమునకు చిహ్నములుగా నిలిచిన చరిత్రాత్మక ప్రదేశముల జూచి కన్నీరు విడువని సహృదయుడుండడుగదా ! వైభవోపేతముగా వెలు గందిన ఆ పవిత్ర ప్రదేశము లిపుడెట్లున్నవి ?

"తెలుగుంబాసకు వన్నె దెచ్చిన జగద్వీరుండు
మా కృష్ణరాయలు గట్టించిన వజ్ర దుర్గముల,
శుద్ధాంత ప్రదేశంబులన్ దల క్రిందై
తపమాచరించెడిని సంతానార్థమై గబ్బిగ
బ్బిలపుం గుబ్బెత లక్కటామొయిలు గప్పెం
బూర్వ మర్యాదకున్"

అని జాషువాకవి భావన చేసిరి.

తెలుగు వారికి ఆధునిక యుగమున నొక తెగులు సోకినది. అది స్వదేశమన్నను, స్వభాష యన్నను విరక్తి. దీనికి సరియైన మందు "రాష్ట్ర గానము". ఈ సాహిత్యౌషధమును రంగ రించినది శ్రీ తుమ్మల సీతారామ మూర్తిగారు. ఆంధ్రులలో ప్రబలిన తెలుగుదనము మీద నున్న ద్వేషాంధకారమును పటా పంచలు చేసిన ఘనత వీరికి దక్కినది. వీరు దేనినీ వదలి పెట్ట లేదు. మహా కవుల దగ్గర నుండి చలన చిత్ర నటుల వరకు అందరిని తడిమిరి. ఏ యితర జాతికిని తీసిపోని ఘనత ఆంధ్ర జాతికి కూడ కలదని వారు రూపించినారు. ముందు మన సంగతి, మన కవిత్వము, మన కళలు, మన చరిత్ర తెలిసికొనవలెనని ఆధునికాంధ్ర యువకులకు బోధించినారు.

తెలుగు తల్లికి జోహారు లర్పించుచు నిట్లు గానము చేసినారు.

"తెలుగు తల్లీ ! నీకు జోహారు
దేశమాతా నీకు జేజేలు
ఎల్లోర కొండ నీ యల్లారు గిమలే
కొల్లూరి కోహినూరు కొప్పులో బూవలే
కొల్లూరు గనులు నీకోశంబలే పండ్లు
పూనై పోవు నీ భోగమ్ము కన్నచో

ప్రాచీనాంధ్రవీరుల సాహస కృత్యములను మరచి, పాశ్చాత్యుల పరాక్రమాల కబ్బురపడుచు తమ నీచ స్థితికి దుఃఖించు వర్తమానాంధ్ర పుత్రునికి 'తెలుగుతేంక' ఇట్లు హెచ్చరిక కావించినారు.

కలదోయి! తెలుగుజోదుల తుటారి కటారి
చెలరేగి పగఱ బీర్చిన దినంబు

కలదోయి, తెలుగురాజులు గంగ గట్టుపై
దిండ్రించి పడగలెత్తిన దినంబు

కలదోయి, రేవురేవుల తెలుంగు సరంగు
మొనసి లంగర్లు దింపిన దినంబు

కలదోయి! తెలుగు పల్కుల వెలంది వెలంది
వెలుగువెల్లోడం బర్చిన దినంబు

కలదు కల దోయి! తెల్గు ప్రెగ్గడలు మున్ను
మిన్ను తాళంబు వైచి పేర్గన్న దినము
నేట నీ పాటు నెంచి కన్నీటి నిడకు
నిలుచునే కాలమొకరీతి తెలుగుబిడ్డ!

ఇతరులకిట్లు సలహా నిచ్చుట తేలికయే కాని, ప్రాచీనాంధ్రవైభవమును తలచుకొని కవియే చింతింపకుండ నూరకుండ లేక పోయినాడు.

"యేలపుట్టితినిపుడిసీ! యేటి బ్రతుకు
కటకటా దాటిపోయె బంగారు యుగము

అని తెలుగులెంక నంత చెందినాడు. ఇట కలిగినది నిజమైన బాధకాదు. ఆనందమే. గత వైభవమును స్మరించి యానందములో బాధ పడినాడంతే. ఆంధ్రుల మాతృభాషా విద్వేషమును జూచి కవి నిజముగా బాధ చెందినాడు. ఇంతకంటే పాపముండదు గదా, మరి! ఆంధ్రభాషా ప్రాశస్త్యము నిట్లుగ్గడించినాడు.

"తేజనరాలి మోవికి జిలేబికి బాలరసాల
మార్దవ
శ్రీ జనయిత్రికిన్ రుచులు చిందెడు తేనెకు
నాంధ్రవాణి కీ
రోజున దెల్గుబిడ్డలె విరోధులటే తెలవాని బాసపై
మోజట వారికిట్టి విధమున్ గని యెట్లు సహింతు
నక్కటా!

ఈ విధముగా నాధునికాంధ్రకవులలో పెక్కురు ఆంధ్రమాత ప్రాశస్త్యమును ప్రశంసనీయముగా ప్రస్తుతించినారు.

ఆధునికాంధ్ర వాఙ్మయమున నిట్టికవితా ఖండిక లసంఖ్యాకములు. తన శక్తికొలదిగ నారంభరు తెలుగు తల్లిని కీర్తించి తన దేశభక్తిని వెల్లడించిన సహసీయునే. తెలుగుదనము ఋణపడి యున్నాను.

ఈ కవితా ఖండిక లాధునికాంధ్ర యువకులలో గొప్ప చైతన్యమును గలుగ జేసినవనుటలో సందేహములేదు. యువతరము దేశ పురోభివృద్ధికై చేయు కృషికి కారణాలలో చైతన్యవంతమైన, దేశభక్తిపూరితములైన గీతములను కూడ పేర్కొనక తప్పదు,

తెలుగు తల్లిని కరుణశ్రీ గారితో మనమూ గొంతుకలిపి ఇట్లు ప్రార్థింతము.

"కనిపింపదేనేడు! కాకతీయ ప్రాజ్య
సామ్రాజ్య జాతీయ జయ పతాక

వినిపింపదేనేడు! విద్యానగర రాజ
సభలోని విజయ దుందుభుల మ్రోత

చెలగదేనేడు! బొబ్బిలికోట బురుజుపై
తాండ్రపాపయ తళత్తళల బాకు

నిప్పచ్చరంబయ్యెనే నేడు—వీరవ
ల్నాటి యోధుల సింహనాద లక్ష్మి

చెక్కుచెదరని— యనాడు మొక్కవోని
ఆంధ్ర పౌరుషమిప్పు డధ్వాన్నమాయె,
మరల నొకసారి వెనుకకు మరలి చూచి
దిద్దుకోవమ్మ! బిడ్డల, తెనుగుతల్లి.

సహకార రంగంలో సాధించిన ప్రగతి

స్వాతంత్ర్యం లభించిన నాటినుండి ఆర్థిక అభివృద్ధి సాధించడానికి ప్రజలు, ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తున్నారు. మన దేశానికి ప్రణాళికాయుతమైన ప్రగతి చాలా అనువైనదిగా భావించబడింది. ఆర్థిక ప్రగతి నిమిత్తం సహకార రంగాన్ని సాధనగా ఎంపిక చేశారు. మన ఆర్థిక సాంఘిక సంప్రదాయాలకు యిది బాగా అమరుతుంది. సహకారరంగాన్ని సరిఅయిన పద్ధతిలో సరి అయిన రీతిలో అనుసరించినప్పుడు సాంఘికన్యాయం చేకూర్చటంలో అది బాగా తోడ్పడుతుంది. ఏ వ్యక్తీ వ్యక్తిగతంగా ధనికుడుకావడాన్ని అది అనుమతించదు. ధనికుడు, బీదవాడు సమానత ప్రాతిపదికపై తమ పరిశ్రమకు లభించిన ఫలితాలను సమంగా పంచుకుంటారు, కార్యక్రమాలలో సమాన భాగస్వాములుగా ఉంటారు.

ప్రభుత్వ సహాయంపై ఎక్కువగా ఆధారపడేకన్నా స్వయం శక్తికి, స్వయంకృషికి నాలుగవ ప్రణాళికలో అధిక ప్రాధాన్యం యిచ్చారు. తమ స్వంతవనరులు, శ్రామికశక్తిని సమాజ అభివృద్ధికి వినియోగించుకునేందుకు వీలుగా తమ నాయకత్వాన్ని తామేరూపొందించుకొని సత్వర కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన బాధ్యతను సహకార రంగం గుర్తించింది.

సన్నకారు మధ్యకారు రైతులకు, బీదవారికీ మధ్యతరగతి ప్రజలకు తోడ్పడాలనే లక్ష్యంతో నిర్దేశించబడిన జాతీయ నాలుగవ ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని 1970_71వ వార్షిక ప్రణాళికను రూపొందించారు. ఈ కాలంలో సహకార సంఘాన్ని ప్రాంతీయ ప్రాతిపదిక పై పునర్నిర్మించారు.

1971_72 సంవత్సరంలో సహకార అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం రు.665,22 లక్షలు రు.441.35 లక్షలు ఆంధ్రకు రు.224, 17 లక్షలు తెలంగాణాకు టాయించారు.

రాష్ట్రంలో సహకార పరపతిరంగంలో రాష్ట్రస్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా లేక ప్రాంతీయ స్థాయిలో సహకార కేంద్ర బ్యాంకులు, గ్రామస్థాయిలో సహకార పరపతి సంఘాలతో కూడిన వ్యవస్థ నిర్వహించబడుతుంది.

1970 జూన్ ఆఖరునాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు విస్తరించిన 18.71 లక్షల సభ్యులతో 14.916 వ్యవసాయ పరపతి సంఘాలు పనిచేస్తున్నాయి. 1970_71లో యీ సంఘాలు వ్యవసాయ పనుల నిమిత్తం రూ. 2,651.81 లక్షల మేరకు ఋణాలను పంపిణీ చేశాయి.

రాష్ట్రంలో 25 సహకార కేంద్ర బ్యాంకులు ఉన్నాయి. 3,060 మంది సభ్యులతో 18,631 సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. 1970_71 సంవత్సరంలో రూ. 25 కోట్లమేరకు ఋణాలను మంజూరుచేశారు.

1963 సంవత్సరంలో ఆంధ్ర తెలంగాణాలలోని ఎపెక్స్ సంస్థలను కలిపివేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకును ఏర్పాటు చేశారు. ఈ ఏడు సంవత్సరాల కాలంలో యీ బ్యాంకు గణనీయమైన కృషిచేసింది. ఈ సంవత్సరంలో బ్యాంకు రూ. 41.26 కోట్లమేరకు రొక్కం రూపంలోను, డ్రాఫ్ట్ మొదలైన వాటి రూపంలోను ఋణాలను మంజూరు చేసింది. 1969_70 లో యీ బ్యాంకుకు నికరంగా రూ. 20.62 లక్షల లాభం సిద్ధించింది.

ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్ర భూమి తనఖా బ్యాంకు చతుర్థప్రణాళిక కాలంలో మొత్తం రూ. 150 కోట్ల మేరకు దీర్ఘ కాలిక రుణాలు ఇవ్వడానికి ఒక పథకం తయారుచేసింది. సాధారణ అభివృద్ధి పథకం క్రింద రూ. 95 కోట్లు రుణాల క్రింద పంపిణీ చేయబడుతాయి. అగ్రికల్చరల్ రీఫైనాన్సు కార్పొరేషను ప్రత్యేక అభివృద్ధి పథకాల కొరకు రూ. 55 కోట్ల మేరకు ఆర్థికసౌకర్యాలు కల్పిస్తుంది.

ఒక లక్షా పదివేలబావులు త్రవ్వడానికి 1,55,000 పంపుసెట్లు 4,770 ట్రాక్టర్లు కొనడానికి రుణాలు ఇవ్వాలని ప్రతిపాదించబడింది. చతుర్థప్రణాళికా కాలంలో భారీ మధ్యతరహా ప్రాజెక్టులక్రింద 3.78 లక్షల ఎకరాలభూమిని అభివృద్ధి పరచడానికి రు. 15కోట్లు, 27,276 యెకరాలలో పండ్లతోటలు పెంచడానికి రు. 1.66 కోట్ల రుణాలివ్వడం జరుగుతుంది.

ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టు

అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ అపెక్స్ సహకార సంఘం ప్రాథమిక భూమితనఖా బ్యాంకుల పని విధానాలను పరిశీలించి

అవి పనిచేసే పద్ధతి సంతృప్తికరంగా ఉన్నదని భావించిన తరువాత రు. 34.1 కోట్లు ఖర్చు కాగలదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరపతి ప్రాజెక్టును మంజూరు చేసింది. యిది మూడు విధాలుగా అభివృద్ధి కార్యక్రమాలకు సహాయపడుతుంది. నాగార్జున సాగరు, పోచంపాడు వంటి భారీ ప్రాజెక్టుల క్రింద భూమి అభివృద్ధి పర్చడం, బావుల త్రవ్వకం, పంపుసెట్ల ఏర్పాటు వంటి చిన్న తరహా నీటిపారుదల పనులను అమలుపరచి భూగర్భ జల సంపదను అభివృద్ధి పర్చడం, యాంత్రికంగా వ్యవసాయం చేయడం యీ మూడు మార్గాల ద్వారా వ్యవసాయాన్ని అభివృద్ధి పరచడానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరపతి ప్రాజెక్టు కృషిచేస్తుంది.

సహకార చక్కెర ఫ్యాక్టరీలు

సహకార చక్కెర ఫ్యాక్టరీలు నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్ ముందడుగు వేసింది. 1963 లో ఏటికొప్పాక సహకార చక్కెర ఫ్యాక్టరీ స్థాపించబడింది. సహకార చక్కెర ఫ్యాక్టరీల నిర్వహణ క్రమేణా అభివృద్ధి చెందుతున్నది. 1970-71 నాటికి మొత్తం 11 సహకార చక్కెర ఫ్యాక్టరీలు ఏర్పడినాయి. యిందులో 8 ఫ్యాక్టరీలు చక్కెరను ఉత్పత్తి చేస్తున్నాయి. 2 ఫ్యాక్టరీలు నిర్మాణ దశలో ఉన్నాయి. 1 ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభదశలో ఉంది. ఈ 8 ఫ్యాక్టరీలు 1970-71 సం॥ లో 6,11,882 టన్నుల చెరుకును ఆడి 62,325 టన్నుల చక్కెరను ఉత్పత్తి చేశాయి.

1971-72 లో మరొక 2 సహకార ఫ్యాక్టరీలు గుంటూరు జిల్లాలోని గురజాలలోను, నల్లగొండ జిల్లాలోని మిరియాలగుడాలోను రిజిష్టరు చేయబడినాయి. వీటితో సహకార చక్కెర ఫ్యాక్టరీల సంఖ్య 13 కు పెరిగింది. శ్రీకాకుళం జిల్లాలోని మందసాలో చక్కెర ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి భారత ప్రభుత్వం పర్మిటు ఇచ్చింది.

తృతీయ పంచవర్ష ప్రణాళికలో ఆంధ్రప్రదేశ్‌లో సహకార సేద్య పథకం ప్రవేశపెట్టబడింది. ప్రతి సహకార సేద్య సంఘంలో కనీసం 100 ఎకరాల కుష్కి, లేక 50 ఎకరాల మాగాణి భూమి ఉండాలి. యీ సంఘంలో 12 మంది సభ్యులుగా ఉండాలి. రాష్ట్రంలో యిప్పుడు 657 సహకార సేద్య సంఘాలు ఉన్నాయి. వీటిలో 147 సహకార సమిష్టి సేద్య సంఘాలు తూర్పుగోదావరి జిల్లాలోని కోనసీమ ప్రాంతాలలోను, 210 సమిష్టి సేద్య సంఘాలు కృష్ణాజిల్లాలోని దివిసీమలోను ఉన్నవి.

నాల్గవ ప్రణాళికలో రు. 5 లక్షల ఖర్చుతో 400 సహకార సంఘాలను స్థాపించడానికి సంకల్పించ బడింది.

సహకార గృహ నిర్మాణ సంఘాలు

ఆంధ్రప్రదేశ్ సహకార గృహనిర్మాణ సమాఖ్య 1966 డిశెంబరులో ఆరంభించబడింది. ప్రభుత్వము, భారత జీవిత భీమా సంస్థల నుంచి రుణాలు సేకరించి క్రొత్తయిండ్లు కట్టుకోడానికి ప్రాథమిక సహకార గృహనిర్మాణ సంఘాల సభ్యులకు రుణాలివ్వడం యీ సమాఖ్య ముఖ్యోద్దేశమై ఉంది. రాష్ట్రప్రభుత్వం సహకార గృహనిర్మాణ రుణాల మంజూరీ విషయంలో పెద్ద మార్పు తీసుకొని వచ్చింది. 1970-71 నుంచి సహకార రంగంలో ఇండ్ల నిర్మాణానికి కావలసిన రుణాల కొరకు తగిన ఏర్పాట్లు చేయడానికి ఆంధ్రప్రదేశ్ సహకార గృహనిర్మాణ సమాఖ్యకు బాధ్యత అప్పగించబడింది.

1970-71 లో రాష్ట్ర ప్రభుత్వం మూలధనం వాటా క్రింద రూ. 8.75 లక్షలు యిచ్చింది. ప్రభుత్వం యిచ్చిన వాటాధనం సహాయంతో యీ సమాఖ్య కార్యకలాపాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 306 ప్రాథమిక సహకార గృహనిర్మాణ సంఘాలను అనుబంధ సంస్థలుగా చేసి వాటా మూల ధనాన్ని రూ. 22,25,100 లకు పెంచింది. ఈ సమాఖ్య రూ. 86 లక్షలు ఋణం సేకరించడానికి జీవిత భీమా సంస్థను అభ్యర్థించింది.

షెడ్యూల్ తరగతులు, షెడ్యూల్ జాతుల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తరగతులు, షెడ్యూల్ జాతుల సహకార గృహ నిర్మాణ సమాఖ్య ద్వారా అంచెలవారీగా ఇండ్లు నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రమంతటా యీ పథకం అమలు జరుపబడుతుంది. ఈ గృహ నిర్మాణ పథకానికి జీవితభీమా సంస్థ నుంచి రుణ సహాయం లభిస్తుంది. ఈ ప్రజలకు 1971 72 లో 70 వేల యిండ్లు నిర్మించడానికి ప్రభుత్వం సంకల్పించింది. యిందు నిమిత్తం ప్రతి జిల్లాలో సహకార గృహ నిర్మాణ సంఘం స్థాపించబడుతుంది. యివన్నీ కలసి సమాఖ్యగా రూపొందుతాయి.

రిక్షా డ్రైవర్లు, రజకులు, టాక్సీ, ఆటోరిక్షా డ్రైవర్లు మున్నగు బలహీనవర్గాల, సాంఘిక ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి సహకార సంఘాలు ఏర్పాటు చేయబడినాయి. యింతవరకు 23 రిక్షా డ్రైవర్ల సహకార సంఘాలు ఏర్పాటుచేయబడినాయి. వీటికి రూ. 8.70 లక్షలు మంజూరు చేయబడింది. రూ. 2.50 లక్షలతో మూడు ఆటోరిక్షా డ్రైవర్ల సహకారసంఘాలు రూ. 29 లక్షలతో ఎనిమిది టాక్సీ డ్రైవర్ల సహకార సంఘాలు రిజిష్టరు చేయబడినాయి. వీటి సభ్యులకు అద్దెకొనుగోలు పద్ధతిపైన, ఆటోరిక్షాలు టాక్సీలు సరఫరా చేయబడినాయి. 90 టాక్సీ కార్లకు 70 ఆటోరిక్షాలకు అయిన ఖర్చులో స్టేటు బ్యాంకు ఆఫ్ ఇండియా 85 శాతం మేరకు ఋణాలు మంజూరు చేసింది.

11 రజకుల సహకార సంఘాలు, 12 సహకార ముద్రణ సంఘాలు ఏర్పాటు చేయబడినాయి. వీటికి మొత్తం రూ. 5,54 లక్షలు మంజూరు చేయబడినాయి.

వలస వచ్చిన ప్రజల సహకార ఆర్థిక, అభివృద్ధి బ్యాంకు వాటామూలధనం క్రింద రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు మంజూరుచేసింది. 1971-72 లో రూ. 10 లక్షల మొత్తంతో సహకార సంఘాల ద్వారా బలహీన వర్గాల ప్రజలకు సహాయం చేయడానికి ప్రతిపాదించబడింది. ★

మహాభారతము

తెంపెగంటుల లక్ష్మణశాస్త్రి

53

కలియుగ ప్రభావము

చతుర్యుగ సహస్రము ముగియుటకు కొంచెము కాలము కలియుగములో మిగిలి యుండగా, అనగా కలియుగాంతమునందు సాధారణముగా మానవులందరు అసత్యవాదులుగా నుందురు. యజ్ఞ దానాది వ్రతము లప్పుడు సక్రమముగా జరుగవు. బ్రాహ్మణులు శూద్రకర్మాచరణ చేయుదురు. శూద్రులు వైశ్యులవలె ధనార్జనము న దాసక్తులై యుండెదరు. అథవా క్షత్రియ ధర్మమునైన ఆశ్ర యించెదరు. కలియుగాంతమునందు బ్రాహ్మణులు వేదాధ్యయ నము, యజ్ఞాచరణము మొదలగు స్వకర్మలను వీడెదరు. సర్వ వస్తు భక్షణము చేసెదరు. ఇది తినదగినది, ఇది తినకూడనిది అను విచక్షణ వారికి ఉండదు. బ్రాహ్మణులు జపాదులను విడిచె దరు. శూద్రులు వాని నాచరించెదరు. ఈ విధముగా లోకుల ఆచారములు వ్యవహారములు విపరీతములై జగత్తు ఎప్పుడు అస్త వ్యస్తమగునో అప్పుడు ప్రళయమునకు పూర్వరూప మారంభ మగును.

అప్పుడు మ్లేచ్ఛులు రాజ్యపాలనము చేయుదురు. కపటులు, అసత్యవాదులు పాపిష్ఠులునగు శకులు, పుళిందులు, యవనులు, కాంభోజులు, బాహ్లికులు, ఆభీరులు రాజ్యపాలనము చేయు దురు. ఆ సమయమునందు ఏ బ్రాహ్మణుడు గూడ స్వధర్మముతో జీవనము గడపడు. క్షత్రియులు వైశ్యులును—తమ ధర్మకర్మము లను వీడి ఇతరుల కర్మల నాశ్రయించెదరు. అందరి ఆయు ష్యము—బలము—వీర్యము పరాక్రమము తగ్గిపోవును. మానవులు పొట్టిగా, అసత్యవాదులుగను నుందురు. అప్పుడు సామాన్య ముగా దేశము జనశూన్యమగును. దిక్కులలో పశువులు, సర్ప ములు నిండియుండును. యుగాంతమునందు అనేకులు వ్యర్థముగా తాము బ్రహ్మజ్ఞానులమని చెప్పికొందురు. శూద్రులు బ్రాహ్మణు లను 'ఏయ్' అని పిలుచుటయు, బ్రాహ్మణులు శూద్రులను 'అయ్యా!' అని పిలుచుటయు నాకాలములో జరుగును. సుగంధ వస్తువులు నిర్గంధములుగను, రుచికరవస్తువులు నీరసములుగను నగును. స్త్రీలలో సత్ప్రవర్తన, శీలము ఉండదు. వారు సర్వదా సురత—వ్యభిచార సంబంధమైన మాటలనే ఉచ్చరించుచుందురు. యుగాంతకాలమునందు తరచుగా ప్రజలు అన్నవిక్రయము చేయు వారగుదురు. బ్రాహ్మణులు వేదవిక్రయము చేసెదరు, స్త్రీలు వేశ్యావృత్తి నే స్వవృత్తిగా గైకొనెదరు.

> అట్టశూలా జనపదాః, శివశూలాః చతుష్పథాః।
> కేశశూలాః స్త్రియో రాజన్! భవిష్యంతి యుగక్షయే॥

అనగా (అట్ట- అన్నము, శూల విక్రయము, శివ— వేదము, చతుష్పథాః— బ్రాహ్మణులు, కేశ—భగము, అనగా ప్రజలు అన్నమును, బ్రహ్మణులు వేదమును స్త్రీలు భగమును విక్రయింతురని భావము.) గోవులు తక్కువపాలను పిదుకును. చెట్లు అల్ప పుష్పఫలములు గలవిగా నగును. ఆ చెట్లన్నియు మంచి పక్షులు లేక కాకులు నిండియుండును. బ్రహ్మహత్య చేయు వారును మిథ్యావాదులునైన రాజులనుండి బ్రాహ్మణులు దానము పుచ్చుకొనెదరు. బ్రాహ్మణులు లోభమోహములుగలవారై ఆడంబ రముచేత ధర్మము నాచరించువారుగా నుండి భిక్షార్థులై ప్రజలందరిని పీడించు చుందురు. గృహస్థులు పన్నుభారమును భరించలేక దొంగతనము చేయుదురు. బ్రాహ్మణులు మునులవలె కపటవేష ధారులై వైశ్యుల వృత్తిలో జీవించెదరు. నఖములు, గడ్డము, మీసములు మునులవలె పెంచుకొని వారు డంబాచారులై యుందురు. బ్రహ్మచారులు గూడ ధన లోభముచేత దంభముగలవారై ఆశ్ర మము లేర్పరచుకొని మద్యపానమును, గురుపత్నీగమనమును చేసెదరు. ప్రజలు తమ శరీరములో రక్తమాంసములను పెంచు కొనుటకుగాను ఇహలోక కర్మలయందాసక్తులగుదురు. కలియుగాం తమునందు అన్ని ఆశ్రమములలోను ప్రజలు పాషండులుగా నుండి

పరాన్నమునే ప్రశంసించుచుండెదరు. ఇంద్రుడు సకాలమునందు వానలు కురియడు. బీజములు సరిగా భూమియందు మొలవవు. జనులు హింసయందు రుచిగలవారై అపరిశుద్ధులుగ నుందురు. వారికి అధర్మ ఫలము అధికముగా చేరును. ఎవడైన ధర్మపరుడుగా నున్నను నతడు అల్పాయుష్మంతుడగును. కారణమేమనగా నాకాలమునందు ధర్మము ఎంత మాత్రము నిలుచుటకు అవకాశము ఉండదు గనుక ధర్మపరులు త్వరగా మరణించెదరు. జనులు అంగళ్ళలో తప్పుడు కొలతలతోను, తూనికలతోను క్రయవిక్రయములు చేయుచుందురు. వర్తకులు మిక్కిలి కపట వ్యవహారములు గలవారై యుందురు.

ధర్మాత్ములు క్షీణింతురు. పాపిష్ఠులసంఖ్య పెరుగును. ధర్మము దుర్బలమై యధర్మము బలవంతముగా నుండును. ధర్మిష్ఠులు అల్పాయుష్మంతులుగను, దరిద్రులుగను నుందురు. అధర్మపరులకు ఆయుస్సు అధికమై వారు ధన సంపన్నులుగా నుందురు. ఆ కాలమునందు నగరోద్యానములలో పాప పురుషులు చేరి పాపోపాయముల ద్వారా ప్రజలతో దుష్టమైన వ్యవహారములు చేయుచుందురు. కొంచెము సంపద కలిగినను ధనగర్వము గలవారై తమ సంపదను పెంచుకొనవలెనని తమ వద్ద ఇతరులు న్యాసముగా నుంచిన ధనమును అపహరించి 'నా వద్ద నీవుంచలేదు' అని అతనికి సిగ్గువీడి చెప్పెదరు. మనుష్య మాంస భక్షణము చేయు క్రూర మృగములు అంతటను జన సంచారముగల ప్రదేశములలో నుండును. యుగాంత కాలమునందు ఏడెనిమిది సంవత్సరముల వయస్సు గల స్త్రీలు గూడ గర్భధారణ చేయుదురు. పది పన్నెండేండ్ల పురుషులు పుత్రోత్పాదన చేయుదురు. పదియారు వత్సరముల వయస్సులోనే వెంట్రుకలు నరసి త్వరలో మరణించెదరు. తరుణావస్థలో వృద్ధ గుణములు, వృద్ధావస్థలో తరుణగుణములు గలవారగుదురు. యోగ్యులగు భర్తలను వంచించి స్త్రీలు సేవకులతోను తుదకు పశువులతోను వ్యభిచరించుచుందురు. వీర పత్నులు సామాన్యులతోను, వనితలు పతి జీవించి యుండగా పరపురుషులతోను వ్యభిచరించుదురు. సహస్రయుగముల చివర ప్రళయము సంప్రాప్తమగుటకు పూర్వము అనేక సంవత్సరములు అనావృష్టి దోషమేర్పడును. అప్పుడు దుర్బల జంతువులన్నియు నశించును. మిక్కిలి తేజరిల్లుచున్న ఏడుగురు సూర్యులు నదుల జలమును సముద్రముల జలమునంతయు పీల్చివేయుదురు. ప్రపంచములో, తృణములు కట్టెలు పచ్చివిగాని, ఎండినవిగాని మండి బూడిదయగును.

ఆ తరువాత 'సంవర్తక' అనుపేరుగల ప్రళయకాలాగ్ని వాయువుతోను సూర్యుల తాపముచేతను మండి సమస్తలోకములలో వ్యాపించును. ఆ యగ్నిభూమిని చీల్చుకొని పాతాళమునకు పోయి దేవదానవులనందరిని భీతిల్లజేయును. ఈపృథివిక్రిందిభాగములో నున్న సమస్తవస్తువులను భస్మముచేయును. ఆసంవర్తకాగ్ని, వాయువుతో గూడి ఇరువది రెండువేల యోజనముల ప్రదేశములోని జనములనందరిని మాడ్చివేయును. ఆ తిరువాత దేవ—దానవ—రాక్షస—యక్ష—గంధర్వాదుల నందరిని దహించివేయును.

ఆ పిదప గజయూథముల వలె మేఘపంక్తులు ఆకాశమంతయు వ్యాపించును. అవి వివిధ వర్ణములు గలవిగానుండును. కొన్ని పట్టణములవలెనూ, మరి కొన్ని కాటుక కొండలవలెను, కొన్ని మకరముల వలెను మేఘములుండును. అవి ఘోరములగు మెఱపులతోను, ఉఱుములతోను ఆకాశమంతయు వ్యాపించి యుండును. అవి కురియు వర్షజలము చేత నీ భూమండలమంతయు నద-నదీ పర్వతములన్నియు జలమయములగును. వాటిని ప్రళయ కాలమునందు బ్రహ్మదేవుడు ప్రేరేపించును. ఆ జలము ఘోరమగు ప్రళయాగ్నినికూడ ఆర్పివేయును. అవి నిరంతరము పన్నెండేండ్లు జలమును కురియును. సముద్రములు ఎల్లలు దాటును, పర్వతములు చీలిపోవును, భూమి జలములో మునిగిపోవును. ఆ మేఘములన్నియు నేకకాలములో మహాప్రళయ వాయువుచేత నశించి పోవును.

ఆతరువాత ఆదిదేవుడగు బ్రహ్మ కమలములో నివసించి యుండి ఆ ప్రళయ మారుతము నంతయు పానముచేయును. అట్లు సమస్త స్థావరజంగమాత్మకమగు ప్రపంచము ప్రళయకాలమునందు నశించిపోవగా రాజా! నేనొక్కడనే మిగిలియుండి జలమయమగు లోకమునందు తిరుగుచు దిక్కుతోచక మిక్కిలి వ్యాకులత చెందెదను' అని మార్కండేయ మహాముని చెప్పి యింకను తన సంగతి యిట్లు చెప్పదొడగెను :—

"రాజా ! అట్లు నేనాజలములో ఈదుచు బహుదూరము ప్రయాణము చేసి అలసిపోయి యెక్కడ గూడ ఆశ్రయము లభించక చిక్కుపడితిని. ఆ తరువాత నొకప్పుడా జలములోనొక గొప్ప మఱ్ఱిచెట్టును, దాని యొక్క ఒక విశాలమగు శాఖపైన మంచిపరుపు పైకూర్చొని యున్న కమల ముఖుడగు నొక బాలకుని చూచితిని. అప్పుడు నాకు మహాశ్చర్యము కలిగెను. లోకమంతయు నశించినను ఈ శిశువెట్లు బ్రతికి యున్నాడు అని అనుకొంటిని. మహాతపశ్శాలినయ్యు, త్రికాలవేదినయ్యు నెంతచింతించినను దానికి కారణముగాని, ఆ బాలకుడెవడనికాని తెలిసికొన జాలక పోయితిని.

ఆబాలకుడు అవిసె పువ్వు వర్ణము, శ్రీవత్సలాంఛనము గలవాడై సాక్షాత్తు లక్ష్మీదేవికి నివాసస్థానమైనవాడుగా నాకపుడు తోచెను. అప్పుడాబాలకుడు "మార్కండేయా! నీవు అలసినావు, విశ్రాంతిని కోరుచున్నట్లు కనపడుచున్నావు. నీయిచ్ఛ యున్నంత కాలమిచట కూర్చొనుము. నీవు నా శరీరము లోపల దూరి విశ్రమించుము. అక్కడ నీవుండుటకు అన్ని యేర్పాట్లు చేసియుంచినాను. నీ యెడల నాకు అనుగ్రహము కలిగినది" అని చెవుల కింపుగా నాతో ననెను. ఆ బాలకుని మాటలు విని నాకు నా మానవ జీవితమునందు వెగటు కలిగెను. అప్పుడా బాలకుడు నోరు తెరచెను. దానిలో నేను దైవయోగము చేత వివశుడనై ప్రవేశించితిని. అందు పోవగనే సమస్త నగరాది శోభితమగు భూమండలము కనపడెను. అక్కడ సమస్త నదులు, సముద్రము, చంద్ర సూర్య శోభితమగు నాకాశము, గిరి కాననమృగ శోభితమగు పృథివి కనపడెను. ఆయా జాతులవారు, వృత్తులవారు తమతమ పనులను చేసికొనుచు నచట నాకు కనపడిరి. అక్కడ ఇంద్రాది దేవతలను సందర్శించితిని. ప్రపంచమునందు సర్వస్థావర జంగమాదులు అందుండెను. ఆ బాలకుని శరీరాంతర్భాగమునందు

నేను శతాధికవత్సరములు ఫలమూలాహారము చేయుచు తిరుగుచుంటిని. కాని, ఆ శరీరముయొక్క చివరి భాగము నాకు కనపడలేదు.

అప్పుడు నేను ఆ బాలునే శరణు వేడగా నతడు అనుగ్రహించి తన నోరు తెరచి నేను వెలుపలికి వచ్చునట్లు చేసెను. బయటకి వచ్చి చూతును గదా, సమస్త ప్రపంచమును పొట్టలో పెట్టుకొని హాయిగా కూర్చొనియున్న ఆ బాలకుడు నాకు కనపడెను, అప్పుడు నాతో నతడు "మార్కండేయ మహామునీ! నాశరీరములో నీవుండి విశ్రాంతి తీసుకొంటివా?" అని యడుగగనే నాకు కొంత తెరపి కలిగి ఆ మహానుభావుని చరణములను శిరస్సుతో తాకి నమస్కరించితిని. 'దేవా! నీ మాయను తెలసికొన గోరుచున్నాను. నీ నోటినుండి లోపలికి దూరి సర్వ ప్రపంచమును చూచితిని. నీ యిచ్ఛచేతనే తిరిగి బయటకు వచ్చితిని. నీవెవడవని తెలిసికొన గోరుచున్నాను. సర్వ ప్రపంచమును పానము చేసి శిశువుగా కూర్చున్న నిన్ను గూర్చి తెలిసికొనగోరుచున్నాను. ఎందులకు ప్రపంచమును శరీరములో నిలిపికొంటివి? నీ వింకను నెంతకాలమిట్లుండవలెను? తెలుపుము" అని యంటిని. అప్పుడతడిట్లనెను:—

విప్రోత్తమా! దేవతలు గూడ నా స్వరూపమును వాస్తవముగా తెలిసికొనజాలరు. నీ యందలి ప్రీతితో చెప్పుచున్నాను. నీవు పితృభక్తి గలవాడవు. నన్ను శరణు జొచ్చితివి. నీ బ్రహ్మచర్య ప్రభావమును గూడ నేనెరుగుదును. పూర్వము నేనే జలమునకు 'నార' అని పేరు పెట్టినాను. ఆ జలము నాకు నివాసస్థానము (అయనము) గనుక నాకు 'నారాయణ' అను పేరు సార్థకమైయున్నది. ప్రపంచ సృష్టి స్థితిలయకారకుడను నేనే. సర్వ జగత్తునందు వ్యాపించి సమస్త దేవతా స్వరూపుడనుగా నుందును. నాకు ముఖము అగ్ని, భూమి పాదములు, చంద్రసూర్యులు నేత్రములు, ద్యులోకము (పైలోకము) శిరస్సు, ఆకాశము, దిక్కులు చెవులు. నా శరీరపు చెమట నుండి జలము పుట్టినది. వాయువు నా మనస్సులో నున్నది. అనేక యజ్ఞములను నేను చేసినాను. ద్విజులు స్వర్గ కాంక్షచేత నన్నుగూర్చి యజ్ఞములు చేయుదురు. సమస్త భూభారమును మోయు ఆదిశేషుడు నా స్వరూపమే. వరాహరూపముతో భూమిని జలమునుండి ఉద్ధరించితిని. బడబాగ్నినై సముద్రజలమును పానముచేసి తిరిగి విడుచుచుందును. నా శరీరము సర్వమానవ స్వరూపము. చతుర్వేదములు నా నుండి పుట్టి తిరిగి నన్ను చేరుచున్నవి. మహర్షులు నన్ను ధ్యానించుచు నుపాసించెదరు. కామక్రోధాదులు నా రోమములు (వెంట్రుకలు). అహింసా-సత్య-దాన తపస్సులు నా చేతనే నిర్మింపబడినవి, అవి నా శరీరమునందే విహరించుచుండును. నేను ప్రాణులకు జ్ఞానము కలిగించినప్పుడే అవి కదలుచు పనులు చేయును. అన్యథా వారి యిచ్ఛ యేమాత్రము ఉపయోగపడదు. వేదవిదులు, యాగకర్తలు, శాంతులు, కోపరహితులు మాత్రమే నన్ను పొందగలరు. దుష్టులు, పాపులు, అధర్మాది దోషయుక్తులు నన్ను చెందలేరు. నరులు పొందదగిన మహాఫలము నేనే. ధర్మము నశించి అధర్మము ప్రబలినప్పుడు నేను అవతరించి ధర్మమును ఉద్ధరించెదను. రాక్షసులు మొదలైన దుష్టులు లోకహింసచేయుచు నెవరికిని సాధ్యులు కాకున్న కష్ట సమయమునందు నేను పుణ్యాత్ముల యింటిలో మనుష్యుడనుగా నవతరించెదను. కృత యుగమునందు తెల్లగాను, త్రేతాయుగమునందు పసుపుపచ్చగాను, ద్వాపరమునందు ఎఱ్ఱగాను, కలియుగమునందు నల్లగాను నా శరీర వర్ణములు ఉండును. అధర్మము మూడు భాగములుగా ప్రబలినపుడు కాల స్వరూపుడనై నేనొక్కడనే మూడు లోకములను నశింపజేసెదను. సర్వ భూతములయందు నేను అంతర్యామిగా నున్నను నన్ను ఎవరును కనుగొనజాలరు. సర్వ లోకములందు జనులు నన్ను పూజించుచుందురు.

బ్రాహ్మణోత్తమా! నా వద్దకు ఇప్పుడు వచ్చి అనేక క్లేశముల ననుభవించితివి. ఇవి యన్నియు భవిష్యత్తులో నీమేలుకొరకే ఉపయోగపడును.

బ్రహ్మదేవుడు నాయర్ధశరీరము. ప్రళయకాలమునందు నేను ఆ కాలము ముగియువరకు సర్వలోకులను మహామాయతో మోహితులను జేసి జలములో శయనించి యుందును. నేను బాలకుడను కాకపోయినను ఈ ప్రళయమునుండి బ్రహ్మదేవుడు జాగరూకుడగువరకు బాల రూపములోనే యుందును.

బ్రహ్మర్షీ! నీకు వరమిచ్చితిని. నీవీ ప్రళయము జూచి వ్యాకుల పడితివి. అందుకే నీవు నా శరీరములో దూరి సమస్త ప్రపంచమునుచూచి మోహితుడవై నప్పుడు నిన్ను ఉద్ధరించుటకై నేను తిరిగి నిన్ను నా నోరు తెరచి యీవలికి తెచ్చి నీకు చైతన్యము కలిగించితిని.

ముని సత్తమా! నా స్వరూపమును గూర్చి నీకు ఉపదేశించితిని. దానిని దేవదానవులు గూడ తెలిసికొనజాలరు. బ్రహ్మదేవుడు మేల్కొనువరకు నీవు సుఖముగా సంచరించుచుండుము. మరల జగత్సృష్టి చేసెదము.'' 'ఈ మాటలు చెప్పి ఆ భగవంతుడు అంతర్ధానము చెందెను. ఆ వెంటనే ఈ ప్రపంచమంతయు నుత్పన్నమైనట్లు నాకు గోచరించెను'' అని మార్కండేయ మహాముని చెప్పి యింకను నిట్లనెను:— ధర్మరాజా! ప్రళయ కాలము వచ్చిన తరువాత నాకు అత్యాశ్చర్యకరములగు సంఘటనలేర్పడును. ఏ మహానుభావుని నేను చూచితినో ఆ దేవుడే నీ బావ శ్రీకృష్ణుడు సుమా! ఆ భగవంతుని వరప్రభావముచేతనే నాకు పూర్వస్మృతి, దీర్ఘాయుష్యము, స్వచ్ఛంద మరణము కలిగినవి. ఆ దేవదేవుని మీరందరు శరణునొందుడు.'' ఆ మాటవిని పాండవులు శ్రీకృష్ణునకు నమస్కారము చేసిరి. ఆ దేవుడు వారిని ఓదార్చెను.

కల్కి అవతార వర్ణనము

భవిష్యత్తులో ప్రపంచ పరిస్థితిని తెలుపుమని ధర్మరాజు మార్కండేయ మహామునిని ఇట్లడిగెను:— ''మహాత్మా! కలియుగ విషయములను తెలిసికొనుటకు నాకు ఇంకను కుతూహలము గలదు. అన్ని ధర్మములు ఆ యుగమున నశించినపుడు మిగులునది యేమి? యుగాంతమునందు కలియుగ మనుష్యుల బలపరాక్రమములు, వారి యాహార విహారములు ఎట్లుండును? వారి ఆయుష్యమెంత?


వారి వస్త్రభూషణాదు లెట్లుండును? తిరిగి కృతయుగ మెప్పుడు వచ్చును?'' యుధిష్ఠిరుడు చేసిన ప్రశ్నములకు ఆ మహాముని పాండవులు, శ్రీకృష్ణుడు వినుచుండగా నిట్లనెను:—

''రాజా! భగవదనుగ్రహము వలన నేను చూచినది, విన్నది అనుభవించినది చెప్పెదను వినుము. కృతయుగమునందు పూర్తి నాలుగు పాదములతో ధర్మము యుగ యుగమునకు నొక్కొక్క పాదముచొప్పున తగ్గుచు కలియందు ఒక్క పాదమే నిలుచును. అప్పుడు మానవులు ఆయుస్సు, వీర్యము, బుద్ధి, బలము నశించియుందురు; నాలుగుజాతులవారు కపటముతో ధర్మము నాచరింతురు. ధర్మము అను వలను పన్ని మానవులను మోసగించుదురు. స్వయము పండితులమని వృథాభిమానముగలవారై అసత్యవాదులగుదురు. అందువలన ఆయుస్సు క్షీణించును. దానిచేత తమజీవననిర్వాహమునకుఅనువైనవిద్యను ఆర్జించజాలరు. విద్యలేక విజ్ఞాన శూన్యులగుటచేత వారిని లోభము ఆవేశించును. దానితో పాటు కామక్రోధములు పెంచుకొని ప్రజలు పరస్పరము శత్రుత్వము పూనెదరు. బ్రాహ్మణ—క్షత్రియ—వైశ్యులు అన్యోన్యము సంకీర్ణులై, తపస్సు—సత్యమును వీడి శూద్రతుల్యులగుదురు. అంత్యులు మధ్యములుగను, వారు అంత్యులుగను నగుదురు. యుగాంతమునందులోక మిట్లగును. నారబట్టలు, కొఱ్ఱధాన్యములు శ్రేష్ఠములగును. పురుషులు భార్యలకు దాసులగుదురు. గోవులన్నియు నశింపగా మేకపాలు, గొఱ్ఱెపాలే త్రాగెదరు. చేపమాంసము ఆహారమగును, ఒకరినొకరు దోచుకొందురు. హింసింతురు. అందరు నాస్తికులగుదురు. సోమరులై పోడు వ్యవసాయము చేయుదురు. కాబట్టి తక్కువ పంటలు పండును-లోభులగుదురు. తండ్రి, కొడుకులకు పరస్పరము ప్రేమ ఉండదు. వేద నిందకులై వ్రతములను విడిచి యజ్ఞయాగాదులు చేయక కేవలము హేతువాదములు (తర్కవితర్కములు) చేసి అతినీచ కర్మలు చేయుటకు గూడ పాల్పడెదరు. గోవులు మేసి నీరుత్రాగు తగ్గు ప్రదేశములలో వ్యవసాయము చేసి గోవులకు ఆహారపానీయములు లేకుండ జేసెదరు. పాలు పిదుకు గోవులను ఒకఏడు వయస్సుగల దూడలను గూడ నాగేటికి గట్టి భూమి దున్నెదరు. తండ్రి కొడుకును, కొడుకు తండ్రిని చంపును. అయినను వారికి సంఘములో గౌరవము ఉండును. లోకులందరు మ్లేచ్ఛప్రాయులై శుభకర్మలను విడిచెదరు. ప్రజలు దీనుల యొక్క, అసహాయుల యొక్క, చివరకు విధవా స్త్రీల యొక్కయు ధనమును అపహరించెదరు.


రాజా! కలియుగాంతమునందు మానవులు దుర్బలులై లోభమోహములకు వశులగుదురు. దుష్టులను పొగడుచు వారిచ్చు క్షుద్రదానములను తీసికొని సంతుష్టిచెందెదరు. పరస్పరము హత్య చేయుటకు వెనుదీయరు, మూర్ఖులుగూడ తమను పండితులను కొందురు. అప్పుడు క్షత్రియులందరు ప్రపంచమునకు కంటకులుగానగుదురు. ఆ కాలమునందు ప్రజలను రక్షించు నాథులుండరు. వారిని మోసగించి ధనమును అపహరించెదరు. అభిమానము దంభముగలవారై జనులను దండించుటయందే రుచిగలవారగుదురు. సత్పురుషుల ధనమును, భార్యలను లాగికొని భర్తలు ఏడ్చుచుండగనే అనుభవించెదరు. ఎవరుగూడ కన్యకలను యాచించరు, కన్యకలను దానముచేయరు. స్త్రీపురుషులు స్వేచ్ఛగలవారై స్వయముగానే పరస్పరము వరించుకొనెదరు. రాజులు మూర్ఖులై పరద్రవ్యములను కుయుక్తులచే నపహరింతురు. సమస్త జగత్తు మ్లేచ్ఛమయమై సోదరులుగూడ పరస్పర ధనమును హరించెదరు. సత్యము క్షీణించును. వృద్ధులు బాల్యవ్యవహారములను, బాలురు వృద్ధుల వ్యవహారములను అలవరచుకొనెదరు. భయశీలురు శూరులుగాను, శూరులు భయశీలురు గానుందురు. ఒకరి నొకరు నమ్మరు. విచక్షణ లేక అందరు అన్ని ఆహారములను తినెదరు. ధర్మము నశించును. చాతుర్వర్ణ్యముల వారందరు కలిసి ఒకేజాతి వారగుదురు. తండ్రి కొడుకును, కొడుకు తండ్రిని సహించరు. భార్యలు పతి శుశ్రూష చేయరు. ప్రజలు, వరిబువ్వను, గోధుమాన్నమునుకోరి అవి పండు దేశములకు, ఆ దేశములు నిషిద్ధములైనను. తరలిపోయెదరు. స్త్రీ పురుషులు స్వేచ్ఛాచారముగలవారై ఒండొరులను సహించరు.

ధర్మరాజా! అందరు నాస్తికులై శ్రాద్ధాదులచేత పితృదేవతలను, యజ్ఞాదులచేత దేవతలను కలియుగాంతమునందు పూజించరు. ఒకనిమాట నొకడు వినువాడుగాని, ఒకనికొకడు గురువగువాడుగాని లేక అందరు అజ్ఞానాంధకారమునందు చిక్కుకొనెదరు. పదియారేండ్లకన్న ఎక్కువ జీవించువాడు ఉండడు. భార్య భర్తతోగాని భర్త భార్యతోగాని తృప్తినందక ఇతరత్ర సంచరించుచుందురు. అల్ప ధనంమున్నను లోకులు బడాయిలకు లోబడుదురు. దాతయనువాడుండడు. క్రయవిక్రయములలో నందరు నందరిని వంచించెదరు. కర్మజ్ఞానములేక దుష్కర్మల నాచరించుచుందురు. ప్రజల జీవితమే సంశయములో పడిపోవును. బ్రాహ్మణ ద్రవ్యములను ఆశించి వారిని సంహరింతురు. ద్విజులు రక్షకులులేక దిక్కులబడి భ్రమించెదరు. అందరిని అందరు చంపికొనుచు, ప్రాణిహింస చేయుచు ప్రజలెప్పుడు ఉందురో ఆ కాలమే యుగ ప్రళయకాలమని తెలిసికొనుము.

ఆ యుగాంతమునందు ద్విజులు దొంగల భయమువేతను శత్రుల భయముచేతను పీడితులై కాకులవలె నగుదురు. దుష్టరాజులు విధించు పన్నుల భారముచేత బాధితులై ధైర్యము చాలక తమ జీవనార్థమై శూద్రులకు ఊడిగము మొదలగు నీచకార్యములను చేసెదరు. శూద్రులు ధర్మ ప్రవర్తకులైయుండగా ద్విజులు వారిని ఉపాసించుచు వారి మాటలయందు ప్రామాణ్య బుద్ధిగలవారై అవి వినుచుందురు. లోకమంతయు నస్తవ్యస్తమగును. పాడుపడిన గోడలను దేవతాబుద్ధిచేత పూజించుచు దేవతా పూజను మానివేసెదరు. (సశేషము)



1



4

నగరంలో : వార్తా చిత్రాలు

1. డిసెంబరు 4వ తేదీన శ్రీ అరవింద మహర్షి అస్తికలను ముఖ్యమంత్రి స్వీకరిస్తున్న దృశ్యం.

2 "ఇండియామీద ఆసియాలో యిటీవలి పరిణామాల ప్రభావం" అనేగోష్ఠికి ముఖ్యమంత్రి డిసెంబరు 4న ఎగ్జిబిషన్ క్లబ్‌లో ప్రారంభోత్సవం చేశారు.


3. నవంబరు ?2న బల్గేరియా కవి మ్లాడెన్ ఇస్సావ్ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు.

4 నవంబరు 14న పరిశ్రమల మంత్రి శ్రీ జె. చొక్కారావు సికింద్రాబాదులో ద్వితీయ పారిశ్రామిక ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు.

5. పోలెండు సినిమా ప్రదర్శనకు సమాచారశాఖ మంత్రి శ్రీ ఎ. వాసుదేవరావు ప్లాజా సినిమా హాలులో ప్రారంభోత్సవంచేశారు.




2




3



5



1



2



3


నగరంలో : వార్తాచిత్రాలు

1 యాంత్రిక శాఖమంత్రి డా॥ సి హెచ్. దేవానందరావు గైడ్ల శిక్షణ కార్యక్రమానికి హైదరాబాదులో ప్రారంభోత్సవం చేశారు. (డిసెంబరు 6)

2 స్త్రీ సంక్షేమశాఖ మంత్రిణి శ్రీమతి పద్మాభాస్కర రెడ్డి నవంబరు 24న అమీర్ పేటలోని స్టేట్ హోం సందర్శించారు.

3 సాంకేతిక విద్యాశాఖ మంత్రి శ్రీ ఎ. మదన్ మోహన్ డిసెంబరు 6న, 6వ అఖిలభారత సివిల్ సర్వీసుల బ్యాడ్మింటన్ పోటీలకు ప్రారంభోత్సవం చేశారు.

4 ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం డిసెంబరు 8న హైదరాబాదులోని పారిశ్రామిక గృహ సందర్శించారు.



4

వందేమాతరం

— ముదిగొండ వీరభద్రమూర్తి

హోళీ ఖండము నుండి

బెంగాలులో హోలీ పండుగరోజున, నృత్యనాటకాదులతో, హాస్యవేషాలతో ప్రజలు పండుగ జేసుకొంటున్నారు. ఒకడు వైస్రాయివేషంవేసి, బ్రిటిష్ ప్రభుత్వంచేసిన మేళ్ళనుగురించి ఏకరువు పెడతాడు. వైస్రాయిని పగటి వేషగాడిగా చూపి, హాస్యమూ హేళన కలిపి నాటి ప్రజలలోని బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేకతను వర్ణిస్తుంది యీఘట్టం.

శ్రీపన్నీల సితారుణాదిక రసా సేకార్ద్రమై ఘీంకృతి
స్థేమ స్నిగ్ధ నినాద హూత మిధమై ధిం ధిం నదన్మర్దలం
బై మంజుస్వనగీత నాట్య విశం బై హాస్య వేషోజ్జ్వలం
బై మోదించె జనమ్ము హోళికటి ఘోరావగ్రహం తమ్మనన్

కోపింపరు బూతులకున్
శాపింపరు సరిగపట్టు సాలువపై నా
టోపించి రంగు పోసిన !
నా పండుగ తీపి యింత యంతన వశమే !

తగితగకున్న నెల్లపుడు త్వజ్జనమే నటియింప మేలె పం
డుగ రెయి నాటకమ్మున ననుంగొని వేస మొసంగు డంచు గో
రగ నొక డా నటాధిపతి లండను భారత కార్యదర్శినిన్
దెగడుము కొల్వునందు స్వజనేతరు జేర్చి కొనండటంచనెన్

నిఖిల పశుపక్షి మృగముల నిస్వనములు
చేసి కామ దహనార్థము మోసినారు
ముద్దులను గొంద తొక తెగ మొనసి రాజ్య
విదులు పగటి వేసమ్ముల వేసినారు.

అనె నొకడు నేను వైస్రా
యిని నా సభలోని సభ్యులీ రార్వురు నా
మనమలర మెలగు వారల్
జనమలరగ నిపుడయిన మెలంగు డటంచున్.

తెలియుడు 'నిట్టను' గా నను
'నెలిజన్' 'లారెన్సు' లేగి రెవడో 'మేయో' న్
బొలియించెను బగతో నా
వల వచ్చెను 'నార్తు బ్రూ' కవల నే నైతిన్.

రా యనరాదు పిల్వుడు దొరాయని నైక విధాస్మదర్థ హ
ర్తా యనరాదు పిల్వుడతి రంజక భారత భాగ్య ధర్మక
ర్తా యని నన్ను ముగ్ధజనులార పరాయిని గాదు మీకు వై
స్రాయిని నాదు శబ్దము తురాయి భవన్మహి రాజ రాజికిన్.

ఎది యపకార మంచు ననిపించుచు దా నుపకారమైనదో
యది యొకటే యొకండు భరతావనిపై బ్రిటనాధిపత్యమ
య్యదియ ఘటింపకున్న మతమందును మండల మందు దక్క పేర్మ
మ దనరనట్టి మీకు నభిమానము దేశముపైని గల్గునే ?

దేవుడు మమ్ములం భరత దేశము నోమెడు శాంతి దూతలన్
గా వెలయించు పూర్వము సుఖమ్మును మీ కిట బంచి పెట్టినా
డే ? వెదపెట్టి యుద్ధముల నేము ధనమ్మును సర్వసీమలన్
గావలి గాచి మీ కొఱకు గాదొకొ కష్టము లామతించుటల్

విశ్వ విద్యాలయములు తాపించి తిమి త్వ
దీయ భారతమాతకు దిగ్రిణయనములు
దేశ మొక్క ఛత్రమ్ము క్రిందికి నయించి
కఱపినాము జాతీయతాపరమ విద్య

నలు సంత కాలమున వా
ర్తలు సేతువునుండి హిమ ధరమును జేరన్
వలగొన నాగరకత తీ
గలు వాటించితిమి భరత ఖండ ధరిత్రిన్

బొంబాయిలోన బార్శీ
లం బయి కొనినట్టి మొఱకు లావురనిర్, భ
స్మం బయిరి మున్నె థగ్గుల్
పంబ బలికె నొడలు మాపలాలకు మాచే.

భీమా కంపెని స్వప్నమందయిన మీ పెద్దల్ గన నోప్నెచర
ప్లై మీకై నెలకొల్పినాము ప్రజలారా వృత్తిపై పన్ను మీ
కే మే లౌ లయి సన్ను నష్లై కనలే రీ గుట్టు మీ బోట్లు కా
ఫీ ముప్పొద్దును నారు ప్పొద్దులును సేవి పుండు టీ మా కృషన్

చిన్న రహదార్లు పెద్దవి సేసినాము
కోట్లు పౌండ్లు ఖర్చగు నను కొంకు లేక
యందయోమయమ్ములు నున్న పటులె యుద్ధ
ప్రోళ్లలో బెంచినాము రేవులను మేము.

అనగ "మీ పెంచినవి మీకెయవగతిమ్మ
లుడ్డు గుడిపెను మమ్మ మీ దొడ్డ ఖర్చు
బ్రిటను పొలిమేర నడుగు దుర్భిక్ష మిడద
అంత ప్రతి దానికి నిండియాను విడద.

"మాకు గను బొమముడి దెచ్చు మాటలాడ
రా దెవరును మద్రాస్ గవర్న రొక తండు
పన్ను మిన్నంటి దేశ మాపన్న మైన
దన్న మాత్రమ్మున బదవి కిన్య డయ్యె.

మాది విశిష్ట జాతి దయమాలిన వారము కాము, కాలశీ
లా దృత కార్యముల్ సలుపు కట్టున బెట్టిన పేరు వారమం
డీ ! దొరయింతు మెల్లెడల నేల్బడి యా మని గాగ, నెవ్వడే
నీ దమి నన్న జంకము సహింతుము హేతునిబద్ధ వాదముల్

చూడన్ లే దొకొ మీరు వేల్సు యువరాజున్ ముగ్ధ మందస్మిత
శ్రీ డిండీర దయాపయోనిధిని రాశీ భూత సౌజన్యమున్
మూ డేండ్లా యెనొ వచ్చి యిచ్చటికి మిమ్ము న్నిగ్గరుల్గా నెవం
డా డన్ రా దని మందలించె మము బాహాటమ్ముగా గొల్వనన్

కావలె నాంగ్లు లేలుటె జగమ్మన నంచు హుసేను సాహెబ
న్నా ! వచియింపవేమె ! యని స్వాప్తుని జక్రయ చూడ నాతడ
చ్చో ! వివరింతు మా గురువు సంతతి వారిని సంప్రతించి నా
భావము నాంగ్లు లేలుటయె భారతమన్ మరి యెవ్వ డేలుటో

నా విని గలగల నవ్విరి
యా వీధీ వీధి జనము లచ్చట ప్రోగై
వావా దొనరించె నిటుల్
వా విరి నా హుణవేష వైభవ యుతుడున్

స్థానిక పాలనా సమితి సభ్యుల గొందఱు నిందు వారినిన్
దానె వరించి చేరిచి కొనంగ గవర్నరు కాజ్ఞ యిచ్చి యం
దైన ధనవ్యయార్జనములం దచటే తుదినిర్ణయమ్ము గై
కో ననువుం బొనర్చితిమి కూర్చితి మెన్నడు లేని వింతలన్"

అమెరికాకు స్వాతంత్ర్య మెట్లు మరె ? నిండి
యా కధినివేశ యును ద వ్వైన దెటుల ?
ననుచు నొక శాస్త్రి యడుగ జెప్పె నత డమెరి
కాయు బ్రిటన్ నేక వృక్షశాఖలె కదోయి !

ఐకమత్య స్వపాలనాఖ్యములు రెండు
భారతులు రుచి చూడని పండ్లు గలవు
రెండవది యిందు దిగుమతి బ్రిటను నుండి
కావలయు చుక్క తెగి పడ్డ కరణి నెపుడొ

ఎవ రెటు లైన నేమి మన కేల య టన్నది భారతీయునం
దు విడిది గొన్న భావ మది దూరమొ మేము ను దూర మౌదు మి
ట్టివి కల వెన్నియో ప్రరి ఘటింపు డెటి గి సమాజ దౌష్ట్య సం
భవ నిరయమ్ము నయ్యదె స్వపాలన మిమ్ము వరి చు నర్హులన్

చెప్పన చెప్పనా యనుచు జెప్పెద శాస్త్రి! సువర్ణ గోప్యమున్
జెప్పకు దేరికే నిటుల జెప్పితి నంచు భవజ్జనమ్ములో
జెప్పులు కుట్టువాని మడి చేతల మంత్రము జెప్ప వాడు తా
నెప్పుడు కౌగిలించి మధురించునొ మే మపుడుంద మీ యెడన్

అని నొడువుచు నా వేస
మ్మును జాలించె నతడు దు మూగిన జనమున్
మనకు నవవేష మీ సా
లునసే ప్రారంభ మని యె లుంగిడి తెలమిన్

ఘన పెత్తనమున దా న
ష్టిని బొందిన నేమి నరుడు చింతింపడ య
న్యుని పెత్తనమున శంకిత
మనస్కుడై యెరియు లబ్ధి మందర మైనన్

ఆన సత్యము సత్యం బని
యనుచున్ బెంగాలె చూప నగు నధ్వం బీ
యనువున దీపధ్వజ మై
యనుచున్ మధ్యాహ్న మగుడు నరిగిరి లోకుల్.

1971 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతులు

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ఏటేటా కవిత, నవల, విమర్శ, నాటకం, కథానిక ప్రక్రియలకు రు. 1116లు బహుమతి యిస్తున్నారు. 1971 సంవత్సరానికి ప్రకటించిన బహుమతులు:

కవిత:	" బాపురెడ్డి గేయాలు "	— జె. బాపురెడ్డి
నవల:	" సమత "	— వాసిరెడ్డి సీతాదేవి
విమర్శ	" సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర	— ఆరుద్ర
నాటకం	" కనక పుష్యరాగం"	— ఎన్. ఆర్ నంది
కథానిక	" సీలి "	— పురాణం సుబ్రహ్మణ్యశర్మ




నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తి కావటంతో, పొగాకు పండిస్తున్న చాలా భాగపు భూమి ధాన్యపు సేద్యానికి అనువుగా తయారౌతుంది. కాని దీనివల్ల పొగాకు ఉత్పత్తి తగ్గటమూ, తద్వారా ఎగుమతులు తగ్గటమూ జరుగుతుంది. వేరే ప్రాంతాల్లోని భూముల్లో పొగాకు పండించే అభివృద్ధి చెయ్యాలి.

దక్షతగల అధిపత్యం వహించిన ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ వారు వికాసం చెందుతున్న మన ఆర్థిక స్థితిలో పొగాకు ప్రాముఖ్యాన్ని గుర్తించారు. ఐ.టి.సి. వారు, దేశంలోనూ, విదేశాల్లోనూ ప్రజలు మేలైన మొగ్గు చూపుతున్నారూ అనే విలువైన సమాచారాన్ని సేకరించి ఐ.ఎల్.టి.డి. వారికి ఇస్తారు. పొగాకు సరఫరా చేసే సంస్థగా ఐ.ఎల్.టి.డి., వ్యవసాయ రంగానికి సంబంధించిన సంస్థగా తన స్థానాన్ని గుర్తించినదై, రైతుకు ప్రోత్సాహము ఇయ్యటానికీ, కావలసిన మేలురకమైన పొగాకును పండించటంలో అభివృద్ధిని సాధించటానికీ పూనుకుంది.

వేరే ప్రాంతాలలో పొగాకు సాగు చెయ్యటానికి ఐ.ఎల్.టి.డి. వారు ఆంధ్ర ప్రభుత్వంతో కలిసి 1959లో ప్రయోగాలు మొదలుపెట్టారు ఇంకా ఇటువంటి ప్రయోగాలను గుజరాత్‌లోనూ, మైసూరులోనూ చెయ్యటానికి పూనుకొన్నారు. ఈ రంగంలో పనిచెయ్యగల సమర్థుల్ని, అవసరమైన నిర్మాణ కలాపాన్నంతటినీ, ఇంకా అవసరమైన సాంకేతిక సహకారాన్నీ యీ పద్ధతులకు క్రొత్తదైన రైతాంగానికి అందించింది ఐ.ఎల్.టి.డి. ఈ రకంగా ఉత్పత్తి అయిన పొగాకు పంట, నాణ్యతకీ, దిగుబడికీ ప్రపంచపు ఉత్తమ ప్రమాణాలతో సరితూగ గలిగింది.


కాని వీటన్నిటికంటె ముఖ్యాతిముఖ్యమైన లాభం ఏమిటంటే, ప్రత్యేకంగా, వ్యవసాయకంగా వెనకపడ్డ ప్రాంతాల్లోని రైతుల జీవన ప్రమాణాల్లో అభివృద్ధి వచ్చింది.



ఐ.ఎల్.టి.డి. వారి దృష్టిలో, వికాసం అంటే నాణ్యతతో కూడిన ఉత్పత్తి అన్నమాట

ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్

జిల్లాలనుండి




రాష్ట్రపతి శ్రీ వి. వి గిరి నవంబరు 2వ వారంలో విశాఖపట్టణం డాక్‌యార్డ్ సందర్శించినప్పటి దృశ్యం

ఉపరాష్ట్రపతిచే వేదశాస్త్ర యోగ్యతా పత్రాల ప్రదానం

భారత ఉప రాష్ట్రపతి శ్రీ జి. యస్. పాఠక్ వేద శాస్త్ర పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు తిరుపతిలో నవంబరు 9వ తేదీన యోగ్యతా పత్రాలు ప్రదానం చేసిన సందర్భంలో ప్రసంగం చేస్తూ ఎన్ని కాలాలు మారినా కూడా భారతీయ సంస్కృతి చెక్కు చెదరకుండా రాణిస్తున్నదని చెప్పారు. కాలానుగుణంగా మన సంస్కృతి అభివృద్ధి చెందుతూ వస్తున్నది. ప్రపంచంలో కెల్లా ఆది గ్రంధములుగా పరిగణింప బడుతున్న వేదాలలో మన సంస్కృతి ప్రతిఫలిస్తున్నది. వేదాలు మనకు అమూల్యమైన వారసత్వం. వాటిని కాపాడి ప్రోత్సహించ వలసిన అవసరం వుంది అని ఉప రాష్ట్రపతి అన్నారు.

తిరుపతి దేవస్థానం వారు దేవాలయ నిధులను వినియోగిస్తూ వేదాధ్యయాన్ని పునరుద్ధరించడానికి భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడానికి చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.



నవంబరు 9వ తేదీన ఉపరాష్ట్రపతి జి. యస్. పాఠక్ తిరుపతిలో ఆగమ సదస్సు ప్రారంభించారు.

మునిసిపాలిటీలు వసతులు సమకూర్చుకోవాలని గవర్నరు ఉద్బోధ

తమ పట్టణాలను, నగరాలను అభివృద్ధి పరచుకోవడానికి ఎక్కువ నిధుల నిమిత్తం మునిసిపాలిటీలు ప్రభుత్వాన్ని కోరు తున్నాయి. మునిసిపాలిటీల ఆర్థిక వనరులను గూర్చి పరిశీలించి వనరుల సమీకరణకు మార్గాలను సూచించే నిమిత్తం ప్రభుత్వం ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించినదని ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయ్ కె. దేశాయ్, నంవబరు 10వ తేదీన శ్రీకాకుళంలో శ్రీకాకుళం మునిసిపాలిటీ సమర్పించిన విజ్ఞాపన పత్రానికి సమాధానం చెబుతూ అన్నారు. ఈ ఉన్నతాధి కార సంఘం ప్రభుత్వానికి తమ నివేదికను సమర్పించిందనీ, ప్రభుత్వం దానిని పరిశీలిస్తుందని చెబుతూ మునిసిపాలిటీలకు ఎక్కువ ఆర్థిక వనరులు సమకూర్చ బడ్తాయనే ఆశా భావాన్ని గవర్నరు వ్యక్త పరచారు. మునిసిపాలిటీలు తమ వనరులను తామే సమకూర్చుకుంటూ స్వయం సమృద్ధిని సాధించాలని ఆయన అభిప్రాయ పడినారు.

సర్వేలులో రెసిడెన్షియల్ పాఠశాలకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు, నవంబరు 23వ తేదీన సర్వేలులో రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ బోధనా భాషగా తెలుగు భాషను ప్రవేశ పెట్టినంత మాత్రాన యితర భాషల బోధనను విడిచి పెట్టినట్లుగా భావించ రాదనీ, ఇంగ్లీషు, హిందీ భాషలలో కూడా ప్రావీణ్యత ఉండడం చాలా అవసరమనీ అన్నారు.

రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించబడిన మూడు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఒకదానిని నలగొండ జిల్లా సర్వేలులో ఏర్పాటు చేశారు.

శ్రీ నరసింహారావు ప్రసంగిస్తూ గురుకులం పద్ధతిలో పాఠశాలలను ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో విద్యారంగంలో నూతన అధ్యాయం ప్రారంభమైందనీ, ఆర్థికంగా వెనుక బడిన విద్యార్థులు ఉచితంగా ఉత్తమ విద్య నభ్యసించడానికి దీనివల్ల అవకాశం కలిగిందనీ అన్నారు.

మార్కెటింగ్ శాఖా మంత్రి శ్రీ సి. హెచ్. వి. మూర్తి రాజు ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి చాలా ప్రతిభావంతులనీ తెలుగు భాషాభివృద్ధికీ విద్యాభివృద్ధికీ ఆయన చేసున్న తీవ్రమైన కృషి అందరికీ విదితమేననీ అన్నారు. ఆయనకు మన సంస్కృతిలో ప్రగాఢ విశ్వాసం ఉంది, అని మంత్రి పేర్కొన్నారు.


సమాచార, పౌర సంబంధ, శాఖా మంత్రి శ్రీ ఎ. వాసుదేవరావు సభికులకు స్వాగతం చెబుతూ యీ రెసిడెన్షియల్ పాఠశాలకు విద్యావేత్తలు ముఖ్య మంత్రి ప్రారంభోత్సవం చేయడం చాలా పవిత్రమైన విషయంగా భావించాలని అన్నారు.

విద్యా శాఖ డైరెక్టరు శ్రీ బి. ప్రతాపరెడ్డి ప్రసంగిస్తూ విద్యా రంగంలో జరిగిన కృషిని వివరించారు.

శాసన సభ్యులు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య ప్రసంగిస్తూ విద్యార్థులకు ఉత్తమ విద్య గరపాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కి చెప్పారు. శాసన సభ్యులు శ్రీ గోవర్ధన రెడ్డి ప్రసంగిస్తూ నలగొండ జిల్లా చాలా వెనుకబడి ఉన్నదనీ యీ జిల్లా విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.

మునుగోడు పంచాయతీ సమితి తరపున ముఖ్యమంత్రికి సన్మాన పత్రం సమర్పించారు.


అంతకు ముందు ముఖ్యమంత్రికి స్థానిక ప్రజలు ఘనమైన స్వాగతం పలికారు. సర్వేలు పరిసర ప్రాంతాల నుండి వేలాది ప్రజలు హాజరయ్యారు. సన్నకారు రైతులకు ముఖ్యమంత్రి పట్టాలు పంపిణీ చేశారు.



నల్లగొండ జిల్లా సర్వేలులో నవం. 23వ తేదీన ముఖ్య మంత్రి ఉచిత రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రారంభోత్సవం చేశారు

ముఖ్యమంత్రి వరంగల్లు సందర్శన

ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు నవంబరు 11న తేదీన వరంగల్లులో పోస్టు గ్రాడ్యుయేట్ కేంద్రంలో విద్యార్థులను అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అక్కడ విశ్వవిద్యాలయాన్ని ఆరంభించే విషయమై ముఖ్య మంత్రి ప్రస్తావించారు. వరంగల్లు, గుంటూరులకు తప్పకుండా విశ్వ విద్యాలయాలు ఏర్పడుతాయని చెప్పారు. విద్యార్థులు విశ్వ విద్యాలయ హోదాను పెంపొందించుకోవాలి. ప్రాంతీయ ఇంజనీరింగు కాలేజి కాకతీయ మెడికల్ కాలేజీలకు ఇతర ప్రాంతాలలో మంచి పేరు ప్రతిష్ఠలు వున్నాయి. వరంగల్లు పట్టణంలో విద్యా కృషి పెంపొందడానికి అందరూ సమిష్టిగా పని చేయాలని ఆయన ఉద్బోధించారు.



వరంగల్లు పోస్ట్ గ్రాడ్యుయేట్ కేంద్రంలో ముఖ్యమంత్రి (నవం. 11)

షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల్కి క్యాపిటేషను రుసుము చెల్లింపు నుండి మినహాయింపు

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ. పి.వి. నరసింహారావు నవంబరు 11వ తేదీన వరంగలులోని కాకతీయ వైద్య కళాశాల విద్యార్థుల, సిబ్బంది సమావేశంలో ప్రసంగిస్తూ రాష్ట్రంలో ప్రయివేటు వైద్య కళాశాలలలో క్యాపిటేషన్ రుసుము చెల్లింపునుండి షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, యితర రిజర్వు తరగతులకు చెందిన వారిని మినహాయించాలని ప్రతి పాదించినటు వెలడించారు. ఈ పథకాన్ని వచ్చే మూడు సంవత్సరాలలో దశల వారీగా అమలు జరుపుతారని ఆయన అన్నారు.

లావేరులో సన్నకారు రైతులకు రూ. 40,000 ఋణాల మంజూరు

ముఖ్య మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు నవంబరు 10వ తేదీన శ్రీకాకుళం జిల్లాలోని లావేరు గ్రామంలో 100 మంది సన్నకారు రైతులకు రు. 40,000 లు ఋణాల క్రింద పంచి పెట్టారు. ఈ ఋణాలను సక్రమంగా వినియోగించి అధికోత్పత్తి సాధించాలని ఆయన రైతులను కోరారు.

ఈ కార్యక్రమం సన్నకారు రైతుల అభివృద్ధి ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. దానికి జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ శ్రీరాములు నాయుడు అధ్యక్షత వహించారు. శ్రీకాకుళం జిల్లాకు సన్నకారు రైతుల అభివృది ఏజెన్సీ మంజూరుచేసినందుకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియ జేశారు. ముఖ్య మంత్రి యీ గ్రామంలో హైస్కూలు భవనానికి ప్రారంభోత్సవం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రారంభోత్సవం

వ్యవసాయ, మత్స్య పరిశ్రమల శాఖా మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం, రేపల్లె పంచాయతీ సమితిలోని విశ్వేశ్వరంలో ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వ సహాయంతో అతి త్వరలోనే నిజాం పట్టణంలో చేపల రేవును నిర్మిస్తారని తెలిపారు. ఆయన అక్టోబరు 31న రేపల్లె పంచాయతీ సమితి లోని విశ్వేశ్వరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి ప్రారంభోత్సవం చేశారు. రేపల్లె సమితి అధ్యక్షుడు శ్రీ ఎం. గోపాల రావు స్వాగతం చెప్పుతూ $7\frac{1}{2}$ మైళ్ల పొడవు గలిగిన గంగాడిపాలెం నుండి లంకవానిదిబ్బ రోడ్డు నిర్మాణానికి మత్స్య పరిశ్రమ పథకం క్రింద రూ. 3,20,000లు మంజూరీ చేయాలని కోరారు.




వరంగల్లులో వరద పీడిత ప్రాంతాలు సందర్శించిన ముఖ్యమంత్రి (నవం. 11)



వరద పీడిత ప్రాంతాల ప్రజలతో ముఖ్యమంత్రి చర్చలు (నవం. 11)




అనంతపురంలో నవం. 20వ తేదీన కేశవ విద్యానికేతన్ హరిజన హాస్టలును ముఖ్యమంత్రి ప్రారంభించారు.



అనంతపురంలో నవంబరు 20వ తేదీన పోస్టు గ్రాడ్యుయేట్ కేంద్రం హ్యూమానిటీస్ భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

నల్లగొండ జిల్లాలో చిన్నతరహా నీటిపారుదల పనుల సమీక్ష

సమాచార, పౌర సంబంధ, చిన్న తరహా నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ ఎ. వాసుదేవ రావు నవంబరు 4న డిండీ ప్రాంతాన్ని దర్శించారు. నల్లగొండ జిల్లాలో చేపట్టిన చిన్న తరహా నీటి పారుదల పనులను గురించి సూపరింటెండెంటు యింజనీరుతో ఆయన చర్చించారు. దేవరకొండ సమితి తాత్కాలిక అధ్యక్షుడు శ్రీ దామోదర్ రెడ్డి, అధ్యక్షుడు శ్రీ పర్వత రెడ్డి, డిండీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలని, దేవరకొండలోని అన్ని చిన్న తరహా నీటి పారుదల పరిస్థితులను పరీక్షించాలని మంత్రి గారికి వినతి పత్రాన్ని సమర్పించారు. డిండీ సర్పంచ్ యితర గ్రామస్థులు డిండీలోను, తదితర గ్రామాలలోను, విద్యుచ్ఛక్తి కూడా మంజూరు చేయాలని మంత్రిని కోరారు.



నవంబరు 5వ తేదీన శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి భద్రాచలంలో 'రామదాసు ధ్యాన మందిరా'నికి ప్రారంభోత్సవం చేశారు.

కరీంనగర్‌లో గ్రామీణ పరిశ్రమల పథకానికి ప్రారంభోత్సవం

పరిశ్రమల శాఖా మంత్రి శ్రీ జె. చొక్కారావు, నవంబరు 8న కరీంనగర్‌లో గ్రామీణ పరిశ్రమల పథకానికి ప్రారంభోత్సవం చేస్తూ జిల్లాలోని నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి యీ పథకం ద్వారా లభించే సౌకర్యాలను పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కి చెప్పారు. అఖిల భారత స్థాయిలో పరిశీలించినప్పుడు ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమల రంగంలో చాలా వెనుకబడిఉందని ఆయన అన్నారు.

మునిసిపాలిటీలు పొదుపు పాటించాలి: నీటిపారుదల శాఖమంత్రి హితవు

"రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా లేని కారణాన అదనపు గ్రాంటులు మంజూరు చేయ వలసిందని మునిసిపాలిటీలు కాని, పంచాయతీ సంస్థలు కాని ప్రభుత్వంపై వత్తిడి తేరాదు. పొరుగు దేశం మనదేశంపై యుద్ధం బెదిరింపులు చేస్తున్నది. బంగ్లా దేశ్‌నుంచి అసంఖ్యాక ప్రజలు కాందిశీకులుగా మన దేశం వచ్చి తల దాచు కొంటున్నారు. అందువల్ల మన దేశంపై పెద్ద భారం పడింది. కనుక మునిసిపాలిటీలు, పంచాయతీ రాజ్ సంస్థలు చాలా కఠినంగా పొదుపు పాటించాలి. అని మధ్యతరహా నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ పి. బసిరెడ్డి, కడప మునిసిపాలిటీ నవంబరు 9వ తేదీన తమకు సమర్పించిన సన్మాన పత్రానికి సమాధానమిసూ హితవు చేశారు.

కడప మునిసిపాలిటీ, సివిల్ సరఫరా మంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడు గారికి కూడా సన్మానం ఏర్పాటు చేసింది. వెనుకబడిన రాయలసీమ ప్రాంతం సత్వరాభివృద్ధికై నిధుల కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్లానింగు కమీషన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన చెప్పారు.

బలహీనవర్గాలకు ఇతోధిక ఆర్థిక సహాయం

సహకార శాఖా మంత్రి శ్రీ బి. సుబ్బారావు గుంటూరులో ప్రసంగిసూ సహకార రంగం క్రింద ప్రభుత్వం రూ. 1.07 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. సమాజంలో బలహీన వర్గాలకు ఇంకా యెక్కువ ఆర్థిక సౌకర్యాలు కల్పించే నిమిత్తం ఈ డబ్బు వినియోగించ బడుతుందని ఆయన చెప్పారు.

అంతకు ముందు ఆయన జిలా మార్కెటింగు సొసైటీ, భూమి తనఖా బ్యాంకును దర్శించారు. సొంత నిధుల నుంచి భూమి తనఖా బ్యాంకు భవనానికి మరమ్మతులు చేయడానికి అనుమతి ఇవ్వ వలసిందని ఈ బ్యాంకు ఉద్యోగులు మంత్రిని అభ్యర్థించారు.

గుండ్లకమ్మ అక్విడక్టుకు శంఖుస్థాపన

నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ యన్. సిదా రెడి, నవంబరు 15వ తేదీన నాగార్జున సాగర్ కుడి కాలవ వెపు గుండకమ్మ నదిపెన కోటి రూపాయలు ఖర్చు కాగల అక్విడక్టుకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు శాసన మండలి సభ్యులు శ్రీ ఆర్. నారపరెడ్డి అధ్యకత వహించారు. ఒంగోలు తాలూకాలో మెట్ట పొలాలకు, త్రాగు నీటికి జలాలు సరఫరా చేయాలని ఆయన సూచించారు. దర్శి తాలూకాకు నాగార్జున సాగరు జలాలు సరఫరా చేయాలని ఈ తాలూకా లోని గ్రామాలకు కసర్ పథకం క్రింద విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలని శాసన సభ్యులు, శ్రీ మహానంద అభ్యర్థించారు.

నల్లగొండలో గ్రంథాలయ గేయాలు పుస్తకం ఆవిష్కరణ

పెద్ద తరహా నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ సిద్దారెడ్డి నవంబరు 21న నలగొండలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున "గ్రంథాలయ గేయాలు" అనే పుసకాన్ని ఆవిష్కరించారు. ఆయన ప్రసంగిసూ గ్రంథాలయ ఉద్యమాన్ని అభివృద్ధి పర్చడానికి ఆర్థికంగా సహాయ పడే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని తెలిపారు.


ప్రస్తుతపు మార్కెటు సంఘాల మార్పు

మార్కెటింగు శాఖా మంత్రి శ్రీ మూరి రాజు, నవంబరు 20న భీమడోలు పంచాయతీ సమితిలోని 16 గ్రామాలను సందర్శించిన తర్వాత ఏలూరులో మాటాడుతూ ప్రస్తుతం ఉన్న మార్కెటు సంఘాలను రద్దు చేసి, కొత్తవాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, జీవిత భీమా సంస్థ, వ్యవసాయ రిఫైనాన్స్ కార్పొరేషన్ నుండి పొందిన రు. 3 కోటు మొత్తంతో వాటిని అభివృది చేయడం జరుగుతుందనీ అన్నారు. అవసర మైనచోట మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసారని ఆయన అన్నారు.

మురికి వాడలో పిల్లలకు అధ్యయన కేంద్రం

మధ్యతరహా నీటిపారుదల శాఖా మంత్రి శ్రీ పి. బసిరెడ్డి కడపకు సమీపంలో పాతగుడుపవద్ద నవంబరు 14 న పిల్లల అధ్యయన కేంద్రానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ, ఉపాధ్యాయులు జాతి శ్రేయస్సు, భావిపౌరుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఉద్బోధించారు. ప్రాథమిక ఉపాధ్యాయులను గ్రామ రాజకీయా లలో ఉపయోగించడంవల్ల విద్యా ప్రమాణాలు పడిపోవడానికి ప్రధాన కారణంగా వుందని ఆయన అన్నారు. పిల్లల క్షేమం దృష్ట్యా, ఉపాధ్యాయులను రాజకీయాలకు ఉపయోగించమని గ్రామస్థులు ప్రతిన చేయాలని ఉద్బోధించారు.

ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు సివిల్ సరఫరా శాఖామంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడు అధ్యక్షత వహించారు. ఈ కేంద్రంలో చదువుకొంటున్న విద్యార్థుల ప్రగతిని గమనించడానికి రికార్డులు వుంచాలని ఆయన ఒక సూచన చేశారు. ఇటువంటి అధ్యయన కేంద్రాలు రాష్ట్రమంతటా వెలసినట్లయితే విద్యార్థులకు ఎంతో సహాయకారిగా వుండగలవని ఆయన చెప్పారు.



వ్యవసాయశాఖ మంత్రి శ్రీకాకాని వెంకటరత్నం నవం. 28 తేదీన నల్లగొండలో వ్యవసాయ విషయాల గోష్ఠి. ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు.

కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాక

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. కె. రావు, ప్లానింగు శాఖ కార్యదర్శి శ్రీ బి. పి. ఆర్. విఠల్, గ్రామీణ కార్యక్రమాల శాఖ డైరెక్టరు శ్రీ వి. కె. శ్రీనివాసన్ గార్లతో పాటు నవంబరు 13వ తేదీన మహబూబు నగరంజిల్లాలో కరువు సహాయక కార్యక్రమాలను పరిశీలించారు. ఈ ఉన్నతాధికారులకు జిల్లా కలెక్టరు, రెవిన్యూ ఆఫీసరు ఏకలక్షణపురం, కేశంపేట, మోతి ఘనపురంలో రోడ్డు పనులను, నందిగాంవులో చెరువు త్రవ్వకం పనులను, బాలానగర్‌లో భూసార రక్షణ కార్యక్రమాలను చూపించి పనిజరుగుతున్న విధానాలను వివరించారు. జిల్లా పరిషత్తు అధ్యక్షులు ప్రధాన కార్యదర్శికి మాధారం రోడ్డు పనులను చూపించారు. ప్రధాన కార్యదర్శి కార్మికులతో వారి వారి వేతనాల గురించి ముచ్చటించారు. ఇక్కడ జరుగుతున్న పనులవలన నాలుగు గ్రామాలకు చెందిన 104 మంది వ్యవసాయ కూలీలకు రోజూ పని దొరుకుతున్నది. ఆ రోజు సాయంత్రం ప్రధానకార్యదర్శి కోయిల్‌సాగర్ ప్రాజెక్టును దర్శించారు. ఆయినకు యీ ప్రాజెక్టు క్రింద జరుగుతున్న తాబీ సేద్యం వివరాలను కలక్టరు వివరించి చెప్పారు.

గిరిజన కార్పొరేషన్ గోదాముకు ప్రారంభోత్సవం

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి శ్రీ కె. భీమ్‌రావు, శ్రీకాకుళం జిల్లాలోని సాలూరు గ్రామంలో నవంబరు 5న గిరిజన కార్పొరేషన్ గోదాముకు ప్రారంభోత్సవం చేశారు. ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కొరకై ఎన్నో సదుపాయాలను కలుగ చేసిందని చెప్పారు. గిరిజన ప్రజలకు సౌకర్యం చేకూర్చడానికై గిరిజన సంక్షేమం క్రింద చేపట్టిన పథకాల అమలును విజయ వంతం చేయడానికి ప్రజలు తమ పూర్తి సహకారం అంద చేయాలని మంత్రి వారిని కోరారు.

పులివెందల కాలవ పథకం

మధ్యతరహా నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ పి. బసిరెడ్డి నవంబరు 11న అనంతపురం జిల్లా, గొడ్డుమర్రి గ్రామంలో శింగనరం సిబ్బంది ఇండ్ల కాలనీకి శంకుస్థాపన జరిపారు. ఇక్కడ పులివెందల కాలవ పథకం అంతర్భాగమైన భద్రావతి పైన ఆనకట్ట నిర్మించ బడుతుంది.


నల్లగొండలో వినియోగదారుల స్టోరుకు ప్రారంభోత్సవం

సహకార శాఖా మంత్రి శ్రీ బి. సుబ్బారావు, నవంబరు 21న నలగొండలో వినియోగ దారుల స్టోరుకు ప్రారంభోత్సవం చేశారు. జిలా సహకార మార్కెటింగ్ సంఘం యీ స్టోరును నిర్వహిస్తున్నది.

ఆ తర్వాత మంత్రికి నల్లగొండ మునిసిపాలిటీ పౌర సన్మానం జరిపింది. మంత్రి ప్రసంగిస్తూ మురికి వాడలను పరిశుభ్రం చేయడంలో, హరిజన వాడలలో పౌర సౌకర్యాలు కల్పించడంలో మునిసిపాలిటీలు శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. గృహ వసతి సమస్యను తీర్చడానికి మునిసిపాలిటీలు అల్పాదాయ వర్గాల గృహ నిర్మాణాన్ని చేపట్టాలని మంత్రి సలహా యిచ్చారు.



సహకార శాఖ మంత్రి శ్రీ బత్తిన సుబ్బారావు నవంబరు 21న నల్లగొండలో వినియోగ వస్తువుల స్టోరును ప్రారంభోత్సవం చేశారు



పరిశ్రమల మంత్రి శ్రీ జె. చొక్కారావు సూర్యాపేటలో నవం. 24వ తేదీన బాలాజీ పాలీ ప్రోడక్ట్సు కర్మాగారానికి ప్రారంభోత్సవం చేశారు

హస్నాబాదు లంబాడా తండాకు మంత్రి రాక

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి శ్రీ కె. భీమరావు, నల్గొండ జిల్లా కలెక్టరు శ్రీ ఓబయ్య ఇతర అధికారులతో పాటు హస్నాబాదు లంబాడా తాండాను దర్శించారు. లంబాడీ ప్రజలను వుద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ, హరిజనులు, గిరిజనుల సంక్షేమం కొరకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు జరుపు తున్నదనీ, ఈ ప్రజలు తమ జీవన పరిస్థితులను అభివృద్ధి పరచుకోవ డానికి ఈ పథకాల నుంచి లాభం పొందాలని అన్నారు. జిల్లా కలెక్టరు ప్రసంగిస్తూ నల్గొండ జిల్లాలో హరిజనులు, గిరిజనులకు ప్రభుత్వం ఇంత వరకు 30,000 ఎకరాల భూమి పంచి పెట్టిందని చెప్పారు. సన్న కారు రైతుల అభివృద్ధి సంస్థ రైతులకు అనేక విధాలుగా సహాయ పడుతున్నదని ఆయన చెప్పారు. కరువు సహాయక పనుల కొరకు ప్రభుత్వం ఇంకా యెక్కువ నిధులు కేటాయించాలని సమితి అధ్యక్షులు శ్రీ సీతారామ రావు మంత్రిని అభ్యర్థించారు.

పాకాలలో 30 పడకలతో ఆసుపత్రి మంజూరీ

చిత్తూరు జిల్లాలోని పాకాల గ్రామంలో 30 పడకలు కలిగిన ఆసుపత్రిని మంజూరు చేశారు. గతంలో లోకల్ ఫండు అధ్వర్యంలో ఉన్న ఆసుపత్రి నవంబరు 4న వైద్య ఆరోగ్య కేంద్ర క్రిందికి తీసుకోబడిందని చిత్తూరు వైద్య శాఖాధికారి డా. పి. కృష్ణమూర్తి చెప్పారు.

ఆహార కొరతను తీర్చడానికి ప్రభుత్వ చర్యలు

సివిల్ సరఫరా శాఖా మంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడు నవంబరు 8వ తేదీన అనంతపురం జిల్లా తాడిపత్రిలో తమకు

సమర్పించిన పౌర సన్మానానికి సమాధానమిస్తూ ప్రభుత్వం కృష్ణా, గోదావరి జిల్లాల్లో 50 శాతం బియ్యాన్ని, ఇతర జిల్లాల్లో మిల్లర్ల వద్ద నుంచి 25 శాతం బియ్యం సేకరించిందని తెలిపారు. ఇంత వరకు సేకరించిన బియ్యం రాష్ట్రంలో మన ప్రజల అవసరాలకు సరిపోతాయి. అయితే యితర రాష్ట్రాలలో ఆహార ధాన్యాల కొరతను తీర్చడానికి కొంత బియ్యం ఎగుమతి చేయవలసిందని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆహార కొరతను తీర్చడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉంది. రాష్ట్రంలోని మిల్లర్ల వద్ద నుంచి కావలసినంత ధాన్యం సేకరించ బడుతుంది అన్నారు మంత్రి.

విశాఖపట్టణంలో చిత్రకళా ప్రదర్శనానికి ప్రారంభోత్సవం

విశాఖ పట్టణంలోని క్వీన్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో సెంట్రల్ చైల్డ్ ఆర్ట్సు అకాడమీ ఆఫ్ యిండియా వారు ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనానికి నవంబరు 18న జిల్లా కలక్టరు శ్రీ ఎస్. ఎన్. ఆచంట, ప్రారంభోత్సవం చేశారు. దేశములోని 19 రాష్ట్రాల నుండి వచ్చిన పెయింటింగ్స్‌ని చక్కగా అమర్చారు. ఈ పెయింటింగ్స్‌ను 5–18 సంవత్సరాల మధ్య వయస్కులైన పిల్లలు వేశారు. ఈ చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేయడానికి సుమారు 5,000ల పెయింటింగులు, 200 ఫోటో గ్రాఫులు వచ్చాయి.

గోవర్ధనగిరిలో గాంధీ విగ్రహం ఆవిష్కరణ

రవాణాశాఖా మంత్రి శ్రీ కె. గోపాలనాయుడు చిత్తూరు జిల్లాలోని గాంధీ నగర్ గ్రామంలో నవంబరు 6 వ తేదీన గాంధీ విగ్రహానికి ఆవిష్కరణ చేశారు. తమిళనాడు ప్రభుత్వానికి చెందిన రవాణా శాఖా మంత్రి శ్రీ యస్. రామచంద్రన్ కూడా యిదే గ్రామంలో ఆ రోజు గ్రామ పంచాయితీ గ్రంథాలయానికి ప్రారంభోత్సవం జరిపారు.

పంపుసెట్ల ఏర్పాటుకు ఋణాల పంపిణీ

చిట్యాలలో నవంబరు 19వ కెనరా బ్యాంక్ బ్రాంచ్‌కు నల్గొండ జిలా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య ప్రారంభోత్సవం చేశారు. 43 పంపుసెటు ఏర్పాటు చేయడానికి కెనరా బ్యాంకు సబ్సిడీ ఋణాల క్రింద మంజూరు చేసిన రూ. 145,000 లను పంపిణీ చేశారు.


నల్గొండ జిల్లాలో హరిజనులకు 2,600 యిండ్లు

నల్గొండ జిల్లా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య, నవంబరు 10 న నల్గొండ జిల్లా పరిషత్తు 5 వ స్థాయీ సంఘ సమావేశంలో ప్రసంగిస్తూ సహకార గృహ నిర్మాణ కేంద్రం క్రింద 2,600 యిండ్లను హరిజనులకు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఈ పథకం క్రింద వ్యక్తులు రూ. 1,800లు మేరకు ఋణం పొందడానికి అర్హులవుతారు.

వన్య మృగ సంరక్షణ కేంద్రంగా పాఖాల అభివృద్ధి

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వన్య మృగ రక్షణ సలహామండలి 10 వ సమావేశం, నవంబరు 8వ నర్సంపేటలో జరిగింది. ఆటవీ శాఖా మంత్రి శ్రీ పి. మహేంద్రనాథ్ యీ సమావేశానికి అధ్యక్షత వహించారు. పాఖాల చెరువును వన్యమృగ సంరక్షణకు పెద్ద కేంద్రంగా రూపొందించాలనీ 5 సంవత్సరాల కాలంలో రు. 9.5 లక్షల ఖర్చుతో ఒక సమగ్రమైన పథకంద్వారా 150 చదరపు మైళ్ల ప్రాంతంలో యీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనీ యీ మండలి సిఫార్సు చేసింది.

అంతకు ముందు, మంత్రి వన్య, మృగ పెంపకం క్షేత్రానికి ప్రారంభోత్సవము చేశారు.




హనుమకొండ బేసిక్ శిక్షణ పాఠశాలలో నవం. 1వ తేదీన జిల్లా కలెక్టరు శ్రీ కె. మాధవరావు ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలకు అధ్యక్షత వహించారు.

వెనుకబడిన ప్రాంతాలను గూర్చి కేంద్ర ప్రభుత్వ పరిశీలన

పౌర సరఫరా శాఖా మంత్రి శ్రీ చలా సుబ్బరాయుడు, నవంబరు 13న పెరుమామిళలో తమకు జరిగిన పౌర సన్మానానికి సమాధానం చెబుతూ దేశంలోని వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని తమ విధానాలలో మార్పు తేవాలనీ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాయలసీమ అభివృద్ధి మండలి తయారు చేసిన బృహత్ ప్రణాళికను గూర్చి ప్రస్తావిస్తూ, రూ. 110 కోట్ల ఖర్చుతో



పరిశ్రమల మంత్రి శ్రీ జె. చొక్కారావు ఖమ్మంలో నవం 27 తేదీన పరిశ్రమల సత్వరాభివృద్ధి పథకానికి ప్రారంభోత్సవం చేశారు.

కూడిన యీ ప్రణాళికను అమలు జరపడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వానికి పంచవర్ష ప్రణాళికల ద్వారా నిధులను కేటాయించాలని కేం। దానికి మంత్రి సూచించారు.

రాయలసీమ అభివృద్ధిని గూర్చి చెబుతూ రాయలసీమ అభివృద్ధి మండలి ఏర్పడినప్పడి నుంచి అభివృద్ధి కార్య క్రమాలు చురుకుగా కొనసాగుతున్నవని అన్నారు. ఈ ప్రాంతంలో దారిద్ర్యం నిర్మూలించడానికి ప్రతి నీటి బొట్టును నిల్వ చేసి సద్వినియోగం చేయడమే ఏకైక మార్గమని ఆయన సూచించారు.

త్వరలో తోగూరుపేట ప్రాజెక్టు అమలు

రాజంపేట తాలూకాలోని తోగూరుపేట ప్రాజెక్టు విషయమై సవరించబడిన అంచనాలు పూర్తి అయిన తరువాత ఆ ప్రాజెక్టు నిర్మాణం పనులు త్వరలోనే చేపట్టడం జరుగుతుందని సివిల్ సరఫరా శాఖా మంత్రి శ్రీ సుబ్బారాయుడు సిద్ధవటం పంచాయతీ సమితి సమావేశంలో వెలడి చేశారు. రాయలసీమ ప్రాంతంలో ప్రస్తుతం వున్న చిన్న తరహా నీటి పారుదల వనరులను గురించి ప్రభుత్వం విపులమైన భోగట్టా సేకరిస్తున్నది. ఈ వివరాలు పూర్తిగా అందిన తరువాత నీటి పారుదల వనరులను అభివృది పరచడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

శాసన సభ్యులు శ్రీ రత్న సభాపతి ఈ సమావేశంలో మాట్లాడుతూ భారత ప్రభుత్వం కొత్త పరిశ్రమల స్థాపనకు రూ. 238 కోట ఖర్చు పెట్టినప్పటికి రాయల సీమలో ఒక్క భారీ పరిశ్రమ కూడా నెలకొల్పడం జరగలేదని చెప్పారు.

శాసన సభ్యులు శ్రీ రహమతుల్లా ప్రసంగిసూ నడింపల్లి, ఉడ్డిమడుగు ప్రాజెక్టు పథకాలను చేపట్టాలని వినతి చేశారు.

ఈ సభకు సివిల్ సరఫరా శాఖా మంత్రి శ్రీ చలా సుబ్బారాయుడు అధ్యక్షత వహించారు.

బొంగిని చెర్వు గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరా

రామన్నపేట పంచాయతీ సమితి అధ్యక్షుడు, శ్రీ జి. అనంతరెడ్డి నవంబరు 14న నల్లగొండ జిల్లా బొంగినిచెర్వు గ్రామంలో బాలల దినోత్సవంతో పాటుగా విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు.



సాంకేతిక విద్యా శాఖ మంత్రి శ్రీ ఎం. మదన మోహన్ నవంబరు 25న సిరిసిల్లలోని జూనియర్ కళాశాల విద్యార్థి సంఘానికి ప్రారంభోత్సవం చేశారు.

స్త్రీ సంక్షేమ శాఖామంత్రి స్టేట్ హోం సందర్శన

స్త్రీ సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి పద్మా భాస్కర రెడ్డి, నవంబరు 24న స్టేట్ హోం కార్య క్రమాలను తెలుసుకోవడానికి ఆ సంస్థ దర్శించారు. స్త్రీ సంక్షేమ శాఖ డైరెక్టరు శ్రీమతి శ్రీ రాజ్యం సినా, స్త్రీ సంక్షేమ శాఖా అధికారులు ఆమె వెంట వున్నారు.

స్టేట్ హోం సందర్శించిన తర్వాత అధికారులతో ప్రసంగిస్తూ కావలసిన సహాయం చేయ గలనని మంత్రి హామీ యిచ్చారు.

గుజువాడ గ్రామంలో విద్యుచ్ఛక్తికి ప్రారంభోత్సవం

గృహ నిర్మాణ శాఖా మంత్రి శ్రీ రాజనరసింహ నవంబరు 24న మెదక్ జిల్లా లోని గుజువాడ గ్రామంలో విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు. ఆయన 81 మంది హరిజనులకు, పట్టా సర్టిఫికేట్స్‌ను, ఇండ్లకు ఉపయోగ పడే పరికరాలను కొనుగోలు చేయడానికి ఒక్కొక్కరికి రూ. 100లు చొప్పున రొక్కాన్ని పంపిణీ చేశారు. జిల్లా కలక్టరు శ్రీ పేములు, జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ పి. నరసింహ్మా రెడ్డి, అధికారులు, అనధికారులు యీ ఉత్సవంలో పాల్గొన్నారు.

చిల్లకల్లు పంచాయతీ సమితిలో హరిజనులకు పట్టాలు

చిల్ల కలు పంచాయతీ సమితిలోని అనుమంచి పల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నంగారు ఫారెస్టు బంజరు భూములకు హరిజనులకు పట్టా ప్రదానం చేసారు. ఈ కార్యక్రమం క్రింద 95 మంది పేద హరిజనులకు భూవసతి లభిస్తుంది. పంచిన 65 పట్టా దారులకు 234 ఎకరముల భూమిని పంచారు.

సభకు శ్రీ రేపాల బుచ్చి రామశేషయ్య శ్రేష్ఠి యం. ఎల్. ఎ. అధ్యక్షత వహించారు. సమితి అధ్యక్షులు శ్రీ తొండపు రాధాకృష్ణమూర్తి, నందిగామ శాసన సభ్యులు శ్రీ అడ్సుమిల్లి సూర్యనారాయణ, పలువురు స్థానిక ప్రముఖులు ప్రసంగించారు. తొలుత గ్రామ సర్పంచ్, శ్రీ ఇంటూరి కొండలరావు మంత్రిగారికి స్వాగత, ప్రశంసా, వినతి పత్రం సమర్పించారు.

31–10–1971వ తేదీ రాత్రి చిల్లకల్లు సమితిలోని గరికపాడు వ్యవసాయ క్షేత్రంలో, తక్కెళ్ల పాడు గ్రామ హరిజనులకు, కూడా నివేశన స్థలములకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నంగారు పట్టాలు ప్రదానం చేసారు. సభకు జగ్గయ్య పేట శాసన సభ్యులు శ్రీ రేపాల బుచ్చిరామశేషయ్య శ్రేష్ఠి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమము వల్ల 4–20 ఎకరముల భూమిని, ప్రభుత్వము సేకరించి నివేశన స్థలములు లేని 58 మంది పేద హరిజనులకు కేటాయించడమైనది.

గ్రామ సర్పంచ్ శ్రీ గెంటేల శేషగిరిరావు మంత్రి గారికి వినతి పత్రం సమర్పిస్తూ, నివేశన స్థలములకు పట్టాలు మంజూరు అయిన వారికి రూ. 100లు నగదు గ్రాంటు కూడ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసారు.

30–10–1971వ తేదీన చిల్లకల్లు పంచాయతీ సమితి లోని పాత చిల్లకల్లు గ్రామంలో హరిజన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గృహ పారిశుద్యం, శిశు పోషణ పోటీలు నిర్వహించ బడినాయి.

పరిశుభ్రమైన హరిజన గృహ యజమానులకు ఆరోగ్య వంతమైన శిశువులకు బహుమతులూ, పేద హరిజన విద్యార్థులకు పలకలు బహూకరించబడినవి.

పట్టా భూముల పంపిణీ

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి శ్రీ కె. భీంరావు నవంబరు 1వ తేదీన ఆదిలాబాదు జిల్లా సిర్పూరు గ్రామంలో పట్టా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తూ ఈ భూములు పొందిన వారు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధికోత్పత్తిని సాధించాలని ఉద్బోధించారు.

సిర్పూరు గ్రామంలో మంత్రి 26 పట్టా సర్టిఫికెట్లను పంచి పెటారు. ఇండ్లు కట్టుకోవడానికి 20 మంది హరిజనులకు ఒక్కొక్కరికి రూ. 100ల చొప్పున రూ. 2,000లు కూడా పంచిపెట్టారు.

నిర్మాణాత్మక కృషిలో యువకుల పాత్ర

సాంకేతిక విద్య, యువజన సేవల శాఖా మంత్రి శ్రీ ఎ. మదన మోహన్ తిరుపతిలో చిత్తూరు జిల్లా కలెక్టరు శ్రీ బి. వి. రామా రావుతో జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను గురించి చర్చలు జరిపారు. యువకుల శక్తి సామర్థ్యాలను నిర్మాణాత్మక కార్య కలాపాలకు వినియోగించాలని మంత్రి చెప్పారు.

ఈ సంచికలో రచయితలు

శ్రీ జి. కల్యాణసింగ్, హైదరాబాదు
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, హైదరాబాదు
శ్రీ పి. రాజగోపాలనాయుడు ఎం. ఎల్. సి. చిత్తూరు
శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, హైదరాబాదు
శ్రీ రావిపాటి మహానంద, ఎం. ఎల్. ఎ. దరిశి
శ్రీ గుంటి పుండరీకాక్షయ్య, శ్రీకాకుళం
శ్రీపులిచెర్ల సాంబశివరావు, గుంటూరు
శ్రీ జె. పీరాస్వామి, న్యాయశాఖ కార్యదర్శి, హైదరాబాదు
శ్రీ " మహేశ్ " హైదరాబాదు
శ్రీ జె. బాపురెడ్డి, హైదరాబాదు
శ్రీ తిరుమల రామచంద్ర, ఆంధ్ర ప్రభ, హైదరాబాదు
శ్రీ పోకూరి శ్రీరాములు, హైదరాబాదు
శ్రీ ప్రభాకర్ మాచ్వే, న్యూఢిల్లీ
శ్రీ వక్కలంక లక్ష్మీపతిరావు, అమలాపురం



పుష్కలమైన పంటలకు ఫాక్టమ్‌ఫాస్

అన్ని రకముల భూములకు, పైర్లకు, అనుకూలమై తన ఆధిక్యతను నిరూపించుకున్న, అద్భుత సంకీర్ణ ఎరువు. దక్షిణ ప్రాంత రాష్ట్రముల రైతులు విరివిగా వాడు ఎరువు. భారత దేశంలో రసాయన ఎరువుల ఉత్పత్తికే పునాది వేసిన బ్రహ్మాండమైన ప్రప్రథమ ఫాక్ట్ ఎరువుల ఫాక్టరీ ప్రతిష్టను చాటే ఎరువు.

వరి పైరుకు శిఫారసు చేయబడ్డ ఎరువుల మోతాదులు ఎకరాకు కిలోగ్రాములలో

	ఫాక్టమ్‌ఫాస్ 16 : 20	మ్యూరియేట్ ఆఫ్ పొటాష్	యూరియా
వరి :			
(ఎ) అధిక దిగుబడినిచ్చే రకాలు	180	50	58
(బి) దేశవాళీ రకాలు	135	26	12

FACT

ఫాక్ట్ కర్షక బంధు

ది ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కూర్ లిమిటెడ్, ఉద్యోగమండల్ - కేరళ

ఆంధ్రప్రదేశ్ ఏరియా ఆఫీసు షాపూర్ వాడి, హైదరాబాద్ - 4

ప్రాంతీయ కార్యాలయాలు - నిజామాబాద్ వరంగల్ కర్నూలు, నెల్లూరు

aries EKM FT. 152.TL

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISM, ANDHRA PRADESH HYDERABAD.
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD

ఆంధ్రప్రదేశ్ గురించి

* **1971** జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో **7.93** శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో **9** శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం **2.75,109** చ. కి. మీటర్లు.

* **1971** లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా **4,33,94,951** మంది. దేశజనాభా **54,69,55,945**.

* **1971** లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు **24.56** శాతం మంది వున్నారు. **1961** లో **21.19** శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం **1971** లో **29.35. 1961**లో **24.03** శాతం.

* మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. **1**కి **157** మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. **1**కి, **362**. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత **79** మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (**1960-61** నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. **281**లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. **306**లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. **333** ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. **430** లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో **1,000** అడుగుల లోతు మేరలో సుమారు **1,000** మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. **2,000** అడుగుల లోతు మేరలో **1,320** మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారతదేశంలో, బారైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బారైట్స్‌లో **90** శాతం మొదలు **95** శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

* అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.

